S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుక.. మన పత్రిక  తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 146 | ఎడిటర్ : విక్రం కుమార్ | ఆదివారం 29 మార్చి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |



## రావద్దన్నారు.. పదవి పోతుందన్నారు

- నొయిడా సెంటిమెంట్‌ను తుడిచిపెట్టాం..
- మూఢనమ్మకాలతో అభివృద్ధిని గాలికొదిలేశారు
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

ఉత్తరప్రదేశ్ పర్యటనలో భాగంగా శనివారం నొయిడా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, గత పాలకుల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న 'నొయిడా సెంటిమెంట్' కారణంగానే గత నాయకులు ఈ ప్రాంత అభివృద్ధిని పట్టించుకోలేదని ఆయన విమర్శించారు.

4

## అయోధ్యలో అగ్నిప్రమాదం

- అగ్నికి ఆహుతి అయిన యజ్ఞశాల పందిళ్లు
- ప్రమాదంలో ప్రాణనష్టం లేదని వివరణ

4



# అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణ

## రాఘవ కన్‌స్ట్రక్షన్ సహా అన్నింటిపైనా దర్యాప్తు

- రాఘవ కన్‌స్ట్రక్షన్ సహా అన్నింటిపైనా దర్యాప్తు
- అక్రమాలను సహించేది లేదని వెల్లడి
- ప్రభుత్వ ఖజానాకు గండికొడితే ఊరుకోం
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన



"మైనింగ్, ఇసుక తవ్వకాలపై సీబీసీఐడీ విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు శాసనసభలో ప్రకటించారు. సిరిసిల్ల, నేరెళ్ల ఇసుక మాఫియాపై విచారణ జరిపిస్తాం. సంతోష్‌రావు, ఆయన తండ్రి రవీందర్‌రావుపై విచారణకు ప్రభుత్వం సిద్ధం అని తెలిపారు. గంగుల కమలాకర్ అక్రమ గ్రానైట్ మైనింగ్, వద్దిరాజు రవిచంద్ర కంపెనీ అక్రమ మైనింగ్‌పై విచారణకు సిద్ధం అని ప్రకటించారు."

**హైదరాబాద్, మార్చి 28:** రాఘవ కన్‌స్ట్రక్షన్‌తోపాటు అన్నింటిపై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నాం అని తెలిపారు. విచారణలో నిజాలు నిగ్గు తేల్చి శాసనసభలో నివేదిక పెడతాం. ఇసుక మాఫియా, అక్రమాలకు పాల్పడింది బీఆర్ఎస్ నేతలు, వారి బంధువులే. వద్దిరాజు రవిచంద్ర వంటివారిని బెదిరించి దారిలోకి తెచ్చుకున్నారు. స్వయంగా హరీశ్‌రావు తమ్ముడు మహేశ్వర్‌రావు ఇసుక మాఫియా నడిపారు. అతడి అక్రమాల వల్లే కేటీఆర్ మైనింగ్ శాఖను తీసుకున్నారని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఖజానాకు గండి కొడుతూ సాగే అక్రమ మైనింగ్ వ్యవహారాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో అత్యంత కఠినమైన వైఖరిని ప్రదర్శించారు.

మిగతా 2 లో



## మూసీని అడ్డుకుంటే శివతాండవమే

- అడ్డుకున్న వారికి ప్రజలే బుద్ధి చెబుతారు
- మూసీ కాలుష్యాన్ని నిర్మూలనే మా లక్ష్యం
- దేవుడు మాకిచ్చిన అవకాశంగా చూస్తున్నాం
- మంచిరేవులలో ఓంకారేశ్వరాలయ శంకుస్థాపనలో సీఎం రేవంత్

2

## తెలంగాణలో క్రీడా స్ఫూర్తికి చర్యలు

గత పదేళ్లలో క్రీడలను పట్టించుకోని ప్రభుత్వం

ఎల్బీ స్టేడియంలో ఎమ్మెల్యేల క్రీడలను ప్రారంభించిన సీఎం

## చిన్నారులకు పౌష్టికాహారం తొలిముద్ద

వివరాలు 2వ పేజీలో

## ప్రభుత్వ ఆధీనంలోకి మెట్రో

- అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం ఆమోదం
- మెట్రో విస్తరణకు మార్గం సుగమం
- తీర్మానం ప్రవేశ పెట్టిన సీఎం రేవంత్



.. వివరాలు 2లో

## పోలీస్ శాఖపై నిర్లక్ష్యం

- నియామకాల్లో తీరని జాప్యం
- ఆర్టీసీ, బీసీ, సంక్షేమంలోనూ అదే వైఖరి
- అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ వాకౌట్



3

## మరోమారు పెరిగిన బంగారం ధరలు



2

## ఇక అమరావతి ప్రజా రాజధాని

- 9 నెలల కాలంలో సచివాలయం, అసెంబ్లీ నిర్మాణం
- అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ఉద్వేగ ప్రసంగం
- రాజధాని కోసం ఏకగ్రీవ తీర్మానం



5

## జగన్ జవాబు చెప్పాలి

5

అమరావతికి అనుకూలమా? వ్యతిరేకమా?

అసెంబ్లీలో మంత్రి లోకేష్ నిలదీత



## మొజ్తబా ఖమేనీ మృతి?

ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

తదుపరి లక్ష్యం క్యూబా అంటూ హెచ్చరికలు



4



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక్కటే రాజధాని..

## అమరావతి

5

# అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణ

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ ఆదాయానికి ఎక్కడ గండి పడినా, ఖనిజ సంపద దోపిడీకి గురైనా తాము చూస్తూ ఊరుకోబోమని, అక్రమాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అంశంపై ముఖ్యమంత్రి సాక్ష్యాధారాలతో సమాధానమిస్తూ, ఇప్పటికే ఆ సంస్థకు నోటీసులు జారీ చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మైనింగ్ శాఖ జరిపిన విచారణలో భాగంగా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుండి భారీ మొత్తంలో పన్నులు వసూలు చేసినట్లు ముఖ్యమంత్రి వివరించారు. సినరేజ్ ఛార్జీల కింద రూ. 1,52,97,825, అలాగే పర్మిట్ ఫీజు కింద రూ. 22,25,446 మొత్తాన్ని ప్రభుత్వం ఇప్పటికే ఆ సంస్థ నుండి కట్టించుకుందని ఆయన సభకు తెలిపారు. ఎవరైనా మంత్రుల పేర్లు చెప్పుకుని లేదా రాజకీయ పలుకుబడితో పన్నులు ఎగ్గొట్టాలని చూస్తే చట్టం తనపని తాను చేసుకుపోతుందని, ఖజానాకు రావాల్సిన ప్రతి పైసాను వసూలు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయడంలో రాజీపడేది లేదని ఈ సందర్భంగా ఆయన తేల్చి చెప్పారు.



# చిన్నారులకు పౌష్టికాహారం తొలిముద్ద

## పథకాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

## అంగన్‌వాడీలకు సొంత భవనాలు నిర్మిస్తామని హామీ

## అంగన్‌వాడీలకు సెల్‌ఫోన్లు అందచేత

**హైదరాబాద్, మార్చి 28:** దేశంలో ప్రస్తుతం ఆహారభద్రత ఉంది కానీ, పౌష్టికాహారం అందట్లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాసనసభ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద 'తొలిముద్ద' కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రెడీ టూ కుక్ ఫుడ్ ఉప్మా, కిచిడీ మిక్స్ ను బ్రేక్ ఫాస్ట్‌గా అందించనుంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ అమలు చేయడం వెనుక సహేతుక కారణం ఉందన్నారు. బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టికాహారం అందిస్తున్నాం. పిల్లలకు పౌష్టికాహారం అందితేనే మానసిక ఎదుగుదల ఉంటుందన్నారు. అంగన్వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబసభ్యుల్లా భావిస్తోంది. వారి సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాం. అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదు. సొంత భవనాలు నిర్మించే చర్యలు చేపట్టాం. సమతులాహారం లేకపోవడం వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయని సీఎం అన్నారు. గతంలో దేశంలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు, వ్యవసాయ అభివృద్ధికి తొలి ప్రధాని నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. దేశంలో ప్రస్తుతం ఆహార భద్రతఉంది.. కానీ పౌష్టికాహారం అందడం లేదు. అందుకే ప్రభుత్వం బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టిక ఆహారం అందిస్తోంది. అందుకే తాజాగా బ్రేక్ ఫాస్ట్ స్కీంను కూడా ప్రారభించాము. ప్రభుత్వం ఎంత మంచి ప్రణాళికలు చేసినా.. అమలు చేయాల్సింది అంగన్వాడీ టీచర్లు మాత్రమే. అందుకే ఈ ప్రభుత్వం మీపై గురుతర బాధ్యత పెట్టిందని రేవంత్ రెడ్డి అన్నారు. సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బందికి మొబైల్ ఫోన్లు సీఎం రేవంత్ రెడ్డి పంపిణీ చేశారు. అంగన్వాడీ భవనాలు నిర్మించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఏ మాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా మీ సమస్యలనే పరిష్కరిస్తామని అంగన్వాడీలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం, చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖపై తీవ్ర నిర్లక్ష్యం


## నియామకాల్లో తీరని జాప్యం

## ఆర్టీసీ, బీసీ, సంక్షేమంలోనూ అదే వైఖరి

## అసెంబ్లీ నుంచి బీఆర్‌ఎస్ వాకౌట్

**హైదరాబాద్, మార్చి 28:** పోలీసులు, ఆర్టీసీ, బీసీ సంక్షేమంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా అసెంబ్లీ నుంచి బీఆర్‌ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. అంతకుముందు హరీశ్‌రావు మాట్లాడుతూ.. పోలీస్ నియామకాల్లో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. వడ్డించేవాడు మనవాడు అయితే ఎక్కడున్నా లడ్డూ వస్తుందని అంటారు.. కానీ ముఖ్యమంత్రి వద్దనే పోలీసు శాఖ ఉన్నప్పటికీ ఇంత నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. రాత్రింబవళ్లు కష్టపడే వారు పోలీసులు అని.. రాష్ట్రం కోసం సమాజం పనిచేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. పోలీసులను కేసీఆర్ ఎంతగానో గౌరవించారని అన్నారు. 40, 50 పోస్టులను భర్తీ చేశారని తెలిపారు. కొత్త కమిషనరేట్లను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల సంక్షేమంపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు. కొన్ని జిల్లాలకు మాత్రమే టీఏలు, డీఏలు ఇస్తున్నారని తెలిపారు. ఏడు టీఏ బిల్లులు, మూడు సరెండర్ లీవులు, ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పోలీసుల భద్రత పథకాన్ని ఒక లక్షకు మాత్రమే పరిమితం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు శాఖలో ప్రమోషన్లను పక్కనబెట్టారని హరీశ్‌రావు తెలిపారు. పోలీసులకు ఈహెచ్‌ఎస్‌ను ఇంప్లిమెంట్ చేస్తలేరని పేర్కొన్నారు. 2024 తర్వాత ఇప్పటివరకు పోలీస్ రిక్రూట్‌మెంట్ చేపట్టలేదని అన్నారు. అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. గత సంవత్సరం కంటే 400 కోట్ల బ్జడెట్‌ను ఎందుకు తగ్గించారని హరీశ్‌రావు ప్రశ్నించారు. పెంచాల్సిన బ్జడెట్ ఎందుకు తగ్గిందని నిలదీశారు. మా ప్రశ్నలకు మంత్రి నుంచి ఎలాంటి అస్యూరెన్స్ లేదని మండిపడ్డారు. అలాగే ఆర్టీసీ ఉద్యోగులకు , కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని హరీశ్‌రావు అన్నారు. పోలీసుల టీఏలు, డీఏలు, సరెండర్ లీవులు విడుదల చేయనందుకు నిరసనగా, పోలీసుల ఆరోగ్య భద్రతా పథకంపై భరోసా ఇవ్వనందుకు నిరసనగా, పోలీసు శాఖలో ఉన్న 17వేల ఖాళీల భర్తీపై సమాధానం చెప్పనందుకు నిరసనగా, పోలీసులకు కొత్త వాహనాల విషయంలో సమాధానం చెప్పనందుకు నిరసనగా, బీసీల ఆత్మగౌరవ విషయంలో స్పష్టత ఇవ్వనందుకు నిరసనగా, బీసీ సబ్ ఎ÷–లాన్ నిదుల కేటాయింపుపై వైఖరి చెప్పనందుకు నిరసనగా, ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్టీసీ ఉద్యోగుల అపాయింటెడ్ డేట్ చెప్పనందుకు నిరసనగా వాకౌట్ చేస్తున్నామని ప్రకటించారు.

# మరోమారు పెరిగిన బంగారం ధరలు



**న్యూఢిల్లీ, మార్చి 28:** పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో బంగారం, వెండి ధరల్లో అంచనాలకు అందని మార్పులు చోటుచేసుకుంటున్నాయి. గత రెండు రోజులుగా ధరల్లో ఓ మోస్తరు మార్పులు కనిపించినప్పటికీ నేడు అనూహ్యంగా భారీ స్థాయిలో ధరలు పెరిగాయి. భారత్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర సగటున రూ.2,500 మేర పెరిగింది. కిలో వెండి ధరలో రూ.5 వేల మేర పెరుగుదల కనిపించింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు (మార్చి 28) ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,090కు చేరుకుంది. నిన్నటి ముగింపుతో పోలిస్తే ధర రూ.2,510 మేర పెరిగింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా రూ.2,300ల మేర పెరిగి రూ.1,35,750కు చేరుకుంది. కిలో వెండి ధర నిన్నటితో పోలిస్తే రూ.5 వేల మేర ఎగబాకింది. ప్రస్తుతం రూ.2.5 లక్షల వద్ద కొనసాగుతోంది. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రస్తుతం ఔన్స్ 24 క్యారెట్ల పసిడి ధర 4,492 డాలర్ల వద్ద కదలాడుతోంది. ఔన్స్ వెండి ధర 69 డాలర్లుగా ఉంది.

# తెలంగాణలో క్రీడా స్ఫూర్తికి చర్యలు

- గత పదేళ్లలో క్రీడలను పట్టించుకోని ప్రభుత్వం
- ఎల్బీ స్టేడియంలో ఎమ్మెల్యేల క్రీడలను ప్రారంభించిన సీఎం

**హైదరాబాద్,మార్చి 28(ఆర్‌ఎన్‌ఎ):** ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రజాప్రతినిధుల స్పోర్ట్స్, కల్చరల్ మీట్‌ను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు మంచి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. తమ కేబినెట్‌లోనూ మంచి క్రీడాకారులు ఉన్నారన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారికి క్రీడలు ఓ ఉపశమనం అని సీఎం చెప్పుకొచ్చారు. తెలంగాణ ఒకప్పుడు క్రీడల రాజధానిగా ఉండేది. కానీ ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా స్ఫూర్తి కనుమరుగైందన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. 'యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచేందుకు యత్నిస్తున్నాం. ఫామ్‌హౌస్‌లు, పబ్బులు వంటివాటికి యువత దూరంగా ఉండాలి. బీఆర్‌ఎస్ ఆలోచనలు ఫామ్‌హౌస్‌లు, పబ్బుల్లో పార్టీలు, విందులే' అని ప్రతిపక్ష పార్టీపై విమర్శలు గుప్పించారు రేవంత్. ఎల్బీ స్టేడియాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడం సహా రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహిస్తున్నామని ఆయన అన్నారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి నింపుతున్నామన్న ఆయన.. వారు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. 'స్పోర్ట్స్, కల్చరల్ మీట్–2026' పేరిట నిర్వహిస్తున్న ఈ పోటీలకు సీఎం రేవంత్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సలహాదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఫుట్‌బాల్ ఆడారు. లెమన్ అండ్ స్పూన్ పోటీలో మంత్రి కొండా సురేఖ మొదటి బహుమతి గెలుచుకోగా.. ఎమ్మెల్యేలు యశస్విని రెడ్డి, రాగమయి రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. క్రీడా పోటీల ప్రారంభం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నిత్యం రాజకీయాల్లో మునిగి తేలుతూ, నిరంతరం సమస్యల పరిష్కారం కోసం విరామం లేకుండా పని చేసేవారికి ఇది అద్భుత అవకాశం అన్నారు. ఇక్కడ అద్భుతంగా ఆడలేకపోవచ్చు గానీ, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించేందుకు ఎల్బీ స్టేడియం వేదిక అవుతుందన్నారు. ఈ మైదానంలో శిక్షణ పొందిన వారు మంత్రివర్గంలో ఉన్నారు. క్రికెట్‌లో దేశానికి వన్నె తెచ్చిన అజారుద్దీన్ మంత్రివర్గ సభ్యుడిగా ఉన్నారు. రంజీ క్రికెట్ ఆడిన వాకిటి శ్రీహరి క్రీడా శాఖ మంత్రిగా ఉన్నారు. ఒకప్పుడు క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. కానీ, తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా స్ఫూర్తి కరవైంది. అందుకే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చాం. మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలని సీఎం కప్ పోటీలను నిర్వహించాం అన్నారు. క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోంది. చదువుతోపాటు క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు



విజ్ఞప్తి చేస్తున్నా. క్రీడా స్ఫూర్తిని నింపేందుకే ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద్ తీసుకొచ్చాం అని అన్నారు. దీనిపై ప్రతిపక్ష నాయకులు వివాదం సృష్టించే ప్రయత్నం చేశారు. మెస్సీ ఇక్కడికి వస్తే.. హైదరాబాద్ ఖ్యాతి ప్రపంచానికి తెలిసింది. ఎల్బీ స్టేడియం రాజకీయ కార్యకలాపాలకే పరిమితమైంది. దీనిని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. గచ్చిబౌలి స్టేడియంను ప్రపంచ క్రీడా పోటీలు నిర్వహించేలా అభివృద్ధి చేయబోతున్నాం. బేగంపేట హాకీ క్రీడా మైదానాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంది. ఫుట్‌బాల్‌లో గతంలో దేశానికి మెడల్స్ తెచ్చిన వారిలో నలుగురు మన ప్రాంతానికి చెందినవారున్నారు. మళ్లీ ఆ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలని సంకల్పించాం అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# మూసీని అడ్డుకుంటే శివతాండవమే





- ప్రజలే అడ్డుకున్న వారికి బుద్ది చెబుతారు
- మూసీ కాలుష్యాన్ని నిర్మూలనే మా లక్ష్యం
- దేవుడు మాకిచ్చిన అవకాశంగా చూస్తున్నాం
- మంచిరేవులలో ఓంకారేశ్వరాలయ శంకుస్థాపనలో సిఎం రేవంత్

**రంగారెడ్డి, మార్చి 28:** రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం సరికాదని, ఆరు నూరైనా.. అక్కడి సూర్యుడు ఇక్కడ ఉదయించినా ఈ ప్రాజెక్టు ఆగదని తేల్చి చెప్పారు. శనివారం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే చేవెళ్లలోని ఎంకేపల్లి వద్ద ఆధునిక గోశాలకూ ఆయన శంకుస్థాపన చేశారు. కుటుంబసమేతంగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. మంచిరేవుల ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం ఏ సంస్కృతి అంటూ ప్రశ్నించారు.. హైదరాబాద్ నగరం మత సామరస్యానికి వేదిక. మూసీ పరీవాహకంలో చారిత్రక శివాలయాన్ని పునఃనిర్మించాలని ఈశ్వరుని ఆశీర్వాదంతో పనులు మొదలుపెట్టాం. దీనిపై పెడార్థాలు తీసి విమర్శించే వారిపై ప్రజలే శివతాండవం చేస్తారని హెచ్చరించారు. ఆరు నూరైనా ఈ ప్రాజెక్టు ఆగదు.. ఇది శివదీక్ష. రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. ఇది ఓట్ల కోసం.. నోట్ల కోసం చేస్తున్న పని కాదు. ఇది చరిత్రలో దేవుడి ఇచ్చిన గొప్ప అవకాశం.. ప్రజల పట్ల మాకున్న చిత్తశుద్ధి. ప్రజలే మాకు దేవుళ్లు. వారి ఆకాంక్షల మేరకే చేస్తున్నాం. చరిత్రాత్మక మందిరాన్ని నిర్మించుకోవడం ఒక చారిత్రక సందర్భం. ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈ పని జరుగుతోందని అనుకోవట్లేదని సిఎం అన్నారు. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదంటారు. ఇది దైవేచ్ఛతో జరుగుతున్న కార్యక్రమం. 8 ఎకరాల్లో రూ.700కోట్లతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నాం. ఈ ప్రాంతానికి 1400 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ చరిత్ర కనుమరుగు కాకుండా భవిష్యత్తు తరాలకు అందించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన. మూసీ నది పునరుజ్జీవనం చేయాలని చాలా మంది ప్రయత్నించారు. కారణాలు ఏవైనా ఆ ప్రయత్నాలు ముందుకు సాగలేదు. ఆ అవకాశం మనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నా అని వివరించారు.. విమర్శలు వచ్చినా, అడ్డంకులు సృష్టించినా దేవుడే వాటిని తొలగిస్తాడు. తెలంగాణ పౌరులకు నా విజ్ఞప్తి ఒక్కటే. చరిత్రను గమనిస్తే నది పరీవాహకంలోనే నాగరికత అభివృద్ధి చెందింది. సముద్ర పరీవాహకంలో వ్యాపారం, ఆర్థిక అభివృద్ధి జరిగింది. మూసా, ఈసా నదులు ఉన్నా సరైన విధంగా మనం ఉపయోగించుకోలేదు. మానవ తప్పిదాలతోనే మూసీ కాలుష్య కారకంగా మారిందని దానిని మార్చాల్సిందేనని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, సిఎస్ రామకృష్ణారావు,డిజిపి శివధర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆధీనంలోకి హైదరాబాద్ మెట్రో

## అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం ఆమోదం

## తీర్మానం ప్రవేశ పెట్టిన సిఎం రేవంత్

**హైదరాబాద్, మార్చి 28:** హైదరాబాద్ మహానగర రవాణా వ్యవస్థలో ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది. ఇప్పటివరకు ప్రైవేట్ భాగస్వామ్యంతో నడుస్తున్న మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వం పూర్తిగా తన స్వాధీనంలోకి తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానానికి సభ ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో మెట్రో రైలు ఇకపై పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఆస్తిగా మారిపోనుంది. నగరవాసుల చిరకాల వాంఛ అయిన మెట్రో విస్తరణకు ఉన్న అడ్డంకులను తొలగించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సాహసోపేతమైన అడుగు వేసింది. మెట్రో స్వాధీన తీర్మానానికి తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రైలును స్వాధీనం చేసుకోవడానికి సంబంధించి దాదాపు అన్ని పక్రియలు పూర్తయ్యాయి. ఈ నెల 31 నుంచి మెట్రో రైలును నడిపించేందుకు సర్కారు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే మెట్రో రైలు స్వాధీనానికి సంబంధించి తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెట్రో స్వాధీన తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌లో మెట్రో నెట్వర్క్‌ను భారీగా విస్తరించాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రణాళికలను సిద్ధం చేసింది. అయితే ప్రస్తుతం ఫేజ్–1 ప్రైవేట్ నిర్వహణలో ఉండటం వల్ల, కొత్తగా చేపట్టబోయే ఫేజ్–2 పనులకు అనేక సాంకేతిక , చట్టపరమైన అడ్డంకులు ఎదురవు తున్నాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం లేవనెత్తిన కొన్ని నిబంధనలను పరిష్కరించాలన్నా, మెట్రో విస్తరణ వేగంగా జరగాలన్నా మొత్తం నెట్వర్క్ ప్రభుత్వ ఆధీనంలో ఉండటం అత్యవసరమని ముఖ్యమంత్రి సభలో వివరించారు. అందుకే ఎల్ అండ్ టీ సంస్థ నుండి మెట్రో ఫేజ్–1ను 'హైదరాబాద్ మెట్రో రైల్వే లిమిటెడ్' ద్వారా స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం గట్టిగా నిర్ణయించుకుందని వివరించారు. ఈ స్వాధీన పక్రియతో పాటు మెట్రోను నగరం నలుమూలలా విస్తరించేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికలను ఆవిష్కరించింది. ఫేజ్–2ఏ కింద సుమారు 76.4 కిలోమీటర్ల మేర కొత్త మార్గాల నిర్మాణం చేపట్టబోతుండగా, ఫేజ్–2బి కింద మరో 86.1 కిలోమీటర్ల విస్తరణ కోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ఈ విస్తరణ పూర్తయితే హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థ అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది. నగరంలో వేగంగా పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మెట్రో సేవలను మెరుగుపరచడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం. ప్రభుత్వం నేరుగా నిర్వహణ బాధ్యతలు చేపట్టడం వల్ల భవిష్యత్తులో టిక్కెట్ ధరల నియంత్రణ, మెరుగైన సౌకర్యాలు , కొత్త మార్గాల అనుసంధానం మరింత సులభతరం కానుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఫేజ్–2 విస్తరణకు త్వరితగతిన ఆమోదం పొందేందుకు కూడా ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తానికి, మెట్రో రైలుపై ప్రభుత్వ పెత్తనం పెరగడం వల్ల సామాన్య ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతాయని, నగరం ప్రపంచ పటంలో ఒక అత్యాధునిక రవాణా వ్యవస్థ కలిగిన మెట్రోపాలిటన్‌గా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే అసెంబ్లీలో తీర్మానాలను ఏకపక్షంగా ఆమోదించడం సరికాదని ఎమ్మెల్యే హరీష్‌రావు పేర్కొన్నారు. మెట్రో తీర్మానంపై సభలో చర్చించలేదని అన్నారు. మెట్రో తీర్మాన ఆమోదం ఏకగ్రీవం కాదు.. ఏకపక్షం అంటూ మండిపడ్డారు. నష్టాలతో సతమతమవుతున్నామని, మెట్రో రైలు నిర్వహణ నుంచి తప్పుకొంటామని నాలుగైదేళ్లుగా ఎల్‌అండ్‌టీ సంస్థ చెబుతోంది. ఇదే విషయాన్ని గత సెప్టెంబరులో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లింది. సుదీర్ఘ చర్చల తర్వాత ఎల్‌అండ్‌టీ వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న రూ.13 వేల కోట్ల రుణంతో పాటు సంస్థ ఈక్విటీ వాటా రూ.2 వేల కోట్లను చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఎల్‌అండ్‌టీ నుంచి మెట్రో రైలును టేకోవర్ చేసిన తర్వాత ఎలాంటి మార్పులు లేకుండానే ప్రభుత్వం కార్యకలాపాలను నిర్వహించనుంది. మెట్రో తీర్మానంపై సభలో చర్చించలేదని హరీష్ రావు అన్నారు. మెట్రో తీర్మాన ఆమోదం ఏకగ్రీవం కాదు.. ఏకపక్షం అంటూ మండిపడ్డారు.

# కాళేశ్వరం అవినీతికి కేసీఆర్ బాధ్యుడు

- అవినీతిని పట్టుకోవడంలో సీఎం విఫలం
- కవితకు ప్రజాదరణ ఉంటే ఆదరిస్తారు
- మీడియాతో కేంద్రమంత్రి బండి సంజయ్



**కరీంనగర్, మార్చి 28 :** కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని బండి సంజయ్ స్పష్టం చేశారు. మరోసారి ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారశైలి, కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యం, కవిత కొత్త పార్టీ, తాజా రాజకీయ పరిణామాలపై బండి సంజయ్ తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీ డియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'కాళేశ్వరం ప్రాజెక్టుకు కేసీఆర్ అతిపెద్ద ఇంజనీర్. టోపి పెట్టుకొని ప్రాజెక్టును డిజైన్ చేసింది ఆయనే. ఈ ప్రాజెక్టు కుంగిపోవడానికి, ప్రజా ధనం వృథా కావడానికి కేసీఆర్ నిర్ణయాలే కారణం. ప్రజలు ప్రతి విషయాన్నీ గమనించి సరైన నిర్ణయం తీసుకుంటున్నారు' అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవడంలో అధికార ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు.'సీఎం రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాష తెలంగాణ సమాజం తలదించుకునేలా ఉంది. ప్రజలు సైతం ఆయన భాషపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి మరీ దిగజారిపోయి.. ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఆయన వ్యవహార శైలి మార్చుకుంటే మంచిదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించారు. ముఖ్యమంత్రికి ఎన్నికల ముందు గుడ్లు గుర్తుకు వస్తాయి. గాడిద గుడ్లు అంటారు. ఎన్నికలు అయిపోయాక తొండలు గుర్తుకు వస్తాయి. తొక్కుడు గుర్తుకు వస్తుందన్నారు. కాళేశ్వరం గురించి ప్రస్తావిస్తూ.. ఆ ప్రాజెక్టును డిజైన్ చేసింది కేసీఆర్ ప్రభుత్వమే అన్నారు.. కాళేశ్వరం కూలిపోవడానికి అప్పుడున్న బీఆర్ఎస్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కుమ్మక్కయ్యారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి, కేసీఆర్‌లు కలిసే రాజకీయం చేస్తారని ఆరోపించారు. 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్థాయి మరిచి మాట్లాడుతున్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణకి ముఖ్యమంత్రి.. ఉత్తరాది రాష్ట్రాల నాయకుడు కాదు. ముందు మీరు ప్రకటించిన మొదలు ఆరు గ్యారంటీలు అమలు చెయ్యాలి. కేంద్రం ఏమిస్తున్నదో తెలంగాణ ప్రజానీకానికి తెలుసు. తెలంగాణ రాష్ట్రం ఖజానా పరిస్థితి బాగాలేదు.' అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పెడతారనే ప్రచారంపై బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ..'తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు ఇది సంకేతం. ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజకీయ పార్టీ స్థాపించే హక్కు కలిగి ఉంటారు. అది వారి వ్యక్తిగత, రాజకీయ స్వేచ్ఛకు సంబంధించింది. కవిత కొత్త పార్టీ పెట్టాలనే ఆలోచనను స్వాగతిస్తున్నాం' అని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యయుతంగా ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చు.. ప్రజలకు ఉపయోగ పడితే ఆ ఆ పార్టీలను వారు స్వాగతిస్తారన్నారు.

# బెంగాల్లో గెలిచాక ఢిల్లీలో పాగా వేస్తాం

- మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు



**కోల్‌కతా, మార్చి 28:** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్ర విమర్శలు చేశారు. ముర్షిదాబాద్లో శుక్రవారం రామనవమి శోభాయాత్ర జరుగుతున్న సమయంలో ఘర్షణలు చోటుచేసుకోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. పశ్చిమబెంగాల్‌ను ధ్వంసం చేయాలని చూస్తే బీజేపీ దేశంలో అధికారం కోల్పోవడం ఖాయమని అన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఢిల్లీని స్వాధీనం చేసుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ముందుకు వెళ్తానని చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లోని రాణిగంజ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఇళ్ల పైకి బుల్డోజర్లను ప్రయోగించి ప్రజలందరినీ బయటకు గెంటేస్తారని మమత ఓటర్లను హెచ్చరించారు. తమ గెలుపు కోసం దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుంటూ బీజేపీ నేతలు అన్ని హద్దులను దాటుతున్నారని మండిపడ్డారు. ఆ పార్టీ ఆదేశాల మేరకే ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఎలక్షన్స్‌కు ముందు హడావిడిగా 'సర్' ప్రక్రియ చేపట్టిందని ఆరోపించారు. ఓటరు జాబితా నుంచి బెంగాలీ ఓటర్లను తొలగించడానికి ఎన్నికల కమిషన్‌ను బీజేపీ పావులా వాడుకుంటోందని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఉనికి లేకుండా చేయడం, ఆ పార్టీ నుంచి దేశాన్ని రక్షించడమే తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమన్నారు. రాణిగంజ్‌లోని పర్వత ప్రాంతాల్లో తరచూ కొండచరియలు విరిగిపడుతుండడం వల్ల అక్కడి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని మమత ఆవేదన వ్యక్తంచేశారు. ఇటువంటి ప్రమాదకర ప్రాంతాలను విడిచిపెట్టి.. సురక్షిత ప్రాంతాలకు వెళ్లే వారికి తమ ప్రభుత్వం గృహవసతితోపాటు రూ.10 లక్షల ఆర్థికసాయం అందిస్తుందని హామీ ఇచ్చారు. బెంగాల్‌లో గెలువగానే దేశంలోని ఇతర రాజకీయ పార్టీలతో కలిసి కేంద్రంలో బీజేపీని గద్దె దించుతానని హెచ్చరిక చేశారు.

# బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దు

- ఐపిఎల్ ప్రారంభంతో యువతకు సిపి సజ్జన్నార్ హెచ్చరిక



**హైదరాబాద్, మార్చి 28:** బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ట్విట్టర్ వేదికగా యువతను హెచ్చరించరు. ఐపీఎల్ సీజన్ మొదలవుతున్న తరుణంలో క్రికెట్‌ను కేవలం క్రీడగా ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. వందలాది యాప్‌లను ప్రభుత్వం నిషేధించినప్పటికీ, ఇప్పుడు టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా ఈ దందా కొత్త రూపం దాల్చింది. కేవలం డబ్బు కోసం ఇటువంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్ మాత్రమే కాకుండా ఫామ్ హౌస్‌లు, రహస్య ప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై మా ప్రత్యేక నిఘా ఉంటుందని సజ్జన్నార్ హెచ్చరించారు. బెట్టింగ్ వల్ల అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తెచ్చుకోవద్దు. మీ పరిసరాల్లో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా మా వాట్సాప్ నంబర్ 94906 16555 కు సమాచారం ఇవ్వండని శనివారం వీడియో షేర్ చేశారు. క్రికెట్ అభిమానులకు ఐపీఎస్-2026 పండుగ మొదలైంది. శనివారం రాత్రి 07:30 గంటలకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనున్నాయి. ఐపీఎల్ 19వ సీజన్ మే 31 వరకు నిర్వహించనున్నారు. ఈ లీగ్‌లో మొత్తంగా 10 జట్లు తలపడనుండగా.. 74 మ్యాచ్‌లు జరుగనున్నాయి. అయితే, ఐపీఎల్ అంటే గుర్తొచ్చే మరో విషయం బెట్టింగ్. ఈ సమయంలో బెట్టింగ్ రాయుళ్లు రెచ్చిపోతుంటారు. అమయాక యువతను లక్ష్యంగా చేసుకుని కోట్లు దండుకుంటుంటారు. ఐపీఎల్ వేళ వందల కోట్ల రూపాయలు చేతులు మారుతుంటాయి. ఈ సందర్భంగా యువతకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక సూచనలు చేశారు. బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. బెట్టింగ్ వల్ల అప్పులు పెరిగి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దాని జోలికి వెళ్లకుండా క్రికెట్‌ను కేవలం క్రీడగా మాత్రమే ఆస్వాదించాలని యువతకు పిలుపునిచ్చారు.

# ఇరాన్‌పై భూతల దాడులు చేయాల్సిన అవసరం

## అనుకున్న సమయానికన్నా ముందే యుద్ధం ముగింపు

## అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో



ప్యారిస్, మార్చి 28: ఇరాన్‌పై అనుకున్న సమయం కంటే ముందే దాడులను ముగిస్తామని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో అన్నారు. మరికొన్ని వారాల్లో ఇరాన్ యుద్ధం ముగుస్తుందని తెలిపారు. ఇరాన్‌పై భూతల దాడులు చేయాల్సిన అవసరం లేకుండానే తమ లక్ష్యాలను సాధిస్తామని అన్నారు. తమ దాడులు మరో రెండు, మూడు వారాల్లో పూర్తవుతాయని, అప్పటికి టెహ్రాన్ పూర్తిగా బలహీనపడుతుందని పేర్కొన్నారు. ఫ్రాన్స్‌లో జీ-7 ప్రతినిధులతో సమావేశమైన అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో రుబియో మాట్లాడారు. 'హోర్ముజ్‌లో జరిగే చమురు రవాణాపై ఇరాన్ సుంకాలు విధించకుండా నిరోధించడమే మా తక్షణ కర్తవ్యం. ఆ సుంకాల వల్ల అనేక దేశాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. యుద్ధం ముగింపుపై చర్చల కోసం ఇరాన్ పాలకవర్గం మాకు సందేశాలు పంపింది. అయితే మేం ప్రతిపాదించిన శాంతి ప్రణాళికపై మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు' అని రుబియో తెలిపారు. పశ్చిమాసియాలో అమెరికా తన సైనిక బలగాల మోహరింపును ఇటీవల భారీగా పెంచిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై కూడా రుబియో మాట్లాడారు. 'ఇరాన్‌పై భూతల దాడులు చేయాలని మేం అనుకోవడం లేదు. కానీ, అత్యవసర పరిస్థితులు తలెత్తితే మాత్రం భూతల దాడులకు దిగక తప్పదు. అందుకే అమెరికా దళాలు ఇరాన్ చుట్టూ మోహరిస్తున్నాయి' అని రుబియో స్పష్టం చేశారు.



# భద్రాచలంలో గవర్నర్ దంపతులు

## భద్రగిరి మార్ట్ ను ప్రారంభించిన శుక్లా

**భద్రాచలం,మార్చి 28:** భద్రాచలంలో అంగరంగ వైభవంగా శ్రీరాముని పట్టాభిషేక మహోత్స వాన్ని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా దంపతులు తిలకించారు. బద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా సాగింది. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ఆయన సతీమణి జానకి శుక్లా ఈ వేడుకకు హాజరై సీతారాముల వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే వెంకట్రావు,గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఈ ఉత్సవాన్ని తిలకించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొనేందుకు తొలిసారి వచ్చిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు ప్రజా ప్రతినిధులు , అధికారులు ఘన స్వాగతం పలికారు. బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీ హెలీప్యాడ్ వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు, కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజు శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి గవర్నర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ ఐటిడిఏ ఆధ్వర్యంలో భద్రాచలంలో - భద్రగిరి మార్ట్ ను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రారంభించారు. మార్ట్ లో విక్రయానికి ఉంచిన గిరిజన ఉత్పత్తుల గురించి భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్, సహాయ ప్రాజెక్ట్ అధికారి డేవిడ్ లు గవర్నర్ కు వివరించారు. గిరిజన ఉత్పత్తులను పరిశీలించి, పలు ఉత్పత్తులను గవర్నర్ దంపతులు కొనుగోలు చేశారు.

# పిల్లలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్య



మమత | మణికంఠ | ప్రళయశ్రీ

**సంగారెడ్డి, మార్చి 28:** సంగారెడ్డి జిల్లా కంది మండలం జులకల్‌లో శనివారం దారుణం చోటుచేసుకుంది. ఇద్దరు పిల్లలకు విషమిచ్చిన తల్లి.. తానూ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతులను మమత (28), కుమారుడు మణికంఠ (5), కుమార్తె ప్రళయ (4) గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. ఈ ఏడాది జనవరిలో రోడ్డు ప్రమాదంలో మమత భర్త మృతి చెందాడు. భర్త చనిపోయడాని మనస్తాపానికి గురైన మమత పిల్లలతో కలిసి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు జులకల్ చేరుకొని వివారాలు సేకరిస్తున్నారు.

# ఫుట్‌బాల్ క్రీడాకారిణి పట్ల అసభ్య ప్రవర్తన : కేసు నమోదు

**హైదరాబాద్, మార్చి 28:** జాతీయ స్థాయిలో ఫుట్‌బాల్ ప్లేయర్‌గా గుర్తింపు తెచ్చుకున్న క్రీడాకారిణితో కొందరు వ్యక్తులు అసభ్యంగా ప్రవర్తించారు. కుక్క విషయంలో మొదలైన గోడవ చివరకు క్రీడాకారిణి కుటుంబానికి ప్రాణభయంగా మారింది. కొందరు మందుబాబులతో క్రీడాకారిణికి కుక్క విషయంలో గొడవ జరిగింది. దీంతో వారు ఆమెను వేధించడం ప్రారంభించారు. హయత్ నగర్ పరిధిలో నివసిస్తున్న ఆమె ఇంటిపై దాడి చేశారు. ఇంట్లోకి చొరబడి క్రీడాకారిణి, ఆమె చెల్లెళ్లతో అసభ్యంగా ప్రవర్తించారు. రోజూ వారి ఫోటోలు తీసి వేధిస్తున్నారు. మందుబాబుల దాడిలో గాయపడిన క్రీడాకారిణి హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో హయత్‌నగర్ పోలీసులు నిందితులపై పోక్సో కేసు నమోదు చేసి విచారణ ప్రారంభిచారు.

# ఆశాల చలో హైదరాబాద్

## ఎక్కడికక్కడే పోలీసుల అరెస్ట్



**హైదరాబాద్, మార్చి 28:** చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అరెస్టులకు పాల్పడ్డారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరాపార్క్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించేందుకు బీఆర్‌టీయూ నేతలు, ఆశావర్కర్లు ముందస్తుగా అనుమతులు తీసుకున్నారు. కానీ ర్యాలీకి పర్మిషన్ ఇచ్చినట్లే ఇచ్చి బీఆర్‌టీయూ ఆశావర్కర్లను అక్రమంగా అరెస్టు చేసారు. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్; కార్యదర్శి మారయ్యను అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేశారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఆశావర్కర్లు ఎక్కడికక్కడ అరెస్టు చేసారు. పోలీసుల తీరుపై ఆశావర్కర్లు, బీఆర్‌టీయూ నేతలు మండిపడుతున్నారు. ధర్నాకు అనుమతులు ఇచ్చిన తర్వాత ఎందుకు అరెస్టు చేస్తున్నారని పోలీసులను నిలదీస్తున్నారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు దక్కుతున్న గౌరవమిదేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేసి తీరుతామని స్పష్టం చేశారు.



సంపాదకీయం

# ట్రంప్‌ను నిలువరించేదెవరు?

పశ్చిమాసియాలో యుద్ధజ్వాలలు ఆరేలా లేవు. పరస్పర దాడులతో మరింత ఉద్రిక్తంగా మారుతోంది. దీంతో ప్రపంచ దేశాలు ఏమీ చేయలేని దుస్థితిలో ఉండిపోయాయి. అమెరికాను నిలువరించే పరిస్థితి ఏ దేశానికి లేకుండా పోయింది. సుంకాలు విధించినా చైనా, భారత్ లాంటి దేశాలు సైతం కిమ్మనకుండా మిన్నకుండాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పుడు చమురు సంక్షోభం నేపథ్యంలోనూ అమెరికాను కట్టడి చేయగల శక్తి ఎవరికీ లేకుండా పోయింది. ట్రంప్ కూడా ఆయుధ బలంతో రెచ్చిపోతున్నాడు. ఇది ప్రపంచ వినాశనానికి కంకణం కట్టుకున్నట్టుగా ఉంది. ఇంతటితోనే ఇది ఆగుతుందనుకోవడానికి లేదు. ఇక భూతలదాడులు జరిగితే నష్టం మరింత తీవ్రంగా ఉంటుంది. ఇరాన్‌లో భూతల దాడులకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వస్తున్న వార్తలు ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఈ దాడులను అడ్డుకొనేందుకు ఇరాన్ కూడా సన్నాహాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. అందులోభాగంగా 10లక్షల మందికి పైగా సైన్యాన్ని సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. సైనికాధికారులను ఉటంకిస్తూ ఆ దేశ మీడియా ఈ విషయాన్ని ఇప్పటికే వెల్లడించింది. ఓ వైపు చర్చలు కొనసాగుతున్నాయంటూనే.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పశ్చిమాసియాలో తన సైనిక ఉనికిని విస్తరిస్తున్నారు. గల్ఫ్ దేశాల్లో తీవ్ర సంక్షోభం నెలకొన్నా పట్టించుకోవడం లేదు. ఆర్థికంగా దెబ్బతింటున్న పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలోనే బసిజ్ ఫోర్స్, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్‌తో సహా అనేక విభాగాలు తక్షణమే కదనరంగంలోకి వచ్చేవిధంగా దళాలను బలోపేతం చేస్తున్నట్లు ఇరాన్ సైనిక వర్గాలు పేర్కొన్నాయి. ఇరాన్ నేలపై అమెరికా సైన్యం అడుగుపెడితే.. వారికి నరకం చూపించేందుకు తమ యోధులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించాయి. స్వచ్ఛందంగా సైన్యంలో చేరతామని బసిజ్ ఫోర్స్, ఐఆర్‌జీసీలకు యువకుల నుంచి పెద్దఎత్తున అభ్యర్థనలు వస్తున్నట్లు వెల్లడించాయి. ఇదిలాఉండగా.. ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో యుద్ధంలో పాల్గొనేందుకు అర్హత వయసును కూడా ఇరాన్ తగ్గించినట్లు తెలుస్తోంది. 12 ఏళ్ల పిల్లలను సైతం యుద్ధంలో పాల్గొనేందుకు అనుమతివ్వాలని నిర్ణయించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీనికి 'ఫర్ ఇరాన్' అని పేరు పెట్టినట్లు వెల్లడించాయి. పెట్రోలింగ్, చెక్ పాయింట్ల దగ్గర వీరిని ఉంచనున్నారు. ఇరాన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ సైనిక కొరతను ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. అవసరమైన దానికంటే 12వేల మంది తగ్గినట్లు సైనికాధికారులు ప్రభుత్వానికి వెల్లడించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ కొరత కారణంగా ఐడీఎఫ్ కూలిపోయే ప్రమాదం ఉందని.. ఆ సంస్థ చీఫ్ ఆఫ్ స్టాఫ్, లెఫ్టినెంట్ జనరల్ ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఇకపోతే హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ సాగిస్తున్న దిగ్బంధనంతో నౌకాయానం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. చాలా దేశాల్లో చమురు, గ్యాస్ సంక్షోభానికి ఇది కారణమైంది. ఇప్పుడు మరో జలసంధికి ముప్పు ముంచుకొచ్చింది. తమ ఖర్గ్ దీవిని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తే బాబ్ అల్ మాండెబ్ జలసంధిని అడ్డుకుంటామని ఇరాన్ అమెరికాను హెచ్చరించడమే ఇందుకు కారణం. ఆ నౌకామార్గమూ మూసుకుపోతే ప్రపంచానికి మరిన్ని కష్టాలు తప్పవంటున్నారు. అరేబియా ద్వీపకల్పానికి పశ్చిమాన మరో జలమార్గమే బాబ్ అల్ మాండెబ్ జలసంధి. అరబిక్ భాషలో బాబ్ అల్ మాండెబ్ అంటే 'కన్నీటి ద్వారం' లేదా 'విషాద ద్వారం' అని అర్థం. అక్కడ ప్రతికూల పరిస్థితుల కారణంగా అనేక నౌకలు ప్రమాదానికి లోనయ్యాయి. అందువల్లే ఈ మార్గానికి ఆ పేరు వచ్చింది. 1869లో సూయజ్ కాలువను తెరిచాక మాండెబ్ జలసంధికి ప్రాముఖ్యత పెరిగింది. ఇది మధ్యధరా సముద్రం, హిందుమహాసముద్రానికి మధ్య కీలక లంకెగా మారింది. మాండెబ్ జలసంధికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఇది యెమన్, జిబౌటి మధ్య ఉంది. ఎర్ర సముద్రాన్ని అరేబియా సముద్రంతో అనుసంధానం చేస్తోంది. సూయెజ్ కాలువ దిశగా వెళ్లే నౌకలు, చమురు ట్యాంకర్లకు ఇది కీలక నడవాగా మారింది. ఎర్ర సముద్రానికి, గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌కు మధ్య ద్వారంలా వ్యవహరిస్తోంది. దీని వెడల్పు 30 మీటర్లు మాత్రమే.ఆసియా, ఐరోపా, ఉత్తర అమెరికా, పశ్చిమాసియా మధ్య ప్రయాణించే నౌకల మధ్య మాండెబ్ జలసంధి ఒక గేట్‌వేలా పనిచేస్తోంది. నిత్యం ఈ మార్గంలో 45 లక్షల బ్యారెళ్ల చమురు రవాణా అవుతోంది. అంతర్జాతీయ వాణిజ్యం లో 10–12 శాతం దీని గుండానే పయనిస్తోంది. ఏటా రూ.93.95 లక్షల కోట్ల విలువైన సరకులు మాండెబ్ జలసంధి గుండా రవాణా అవుతున్నట్లు అంచనా. తన అజమాయిషీలో పనిచేసే హూతీలను ఇప్పటికే మాండెబ్ మార్గంలో ఇరాన్ మోహరించింది. యెమెన్‌లోని ఈ ముఠా.. ఎర్ర సముద్ర తీరంలోని కొన్ని భాగాలను నియంత్రిస్తోంది. సముద్రంలోని లక్ష్యాలపై దాడి చేసే సామర్థ్యం ఈ ముఠాకు ఉంది. 2023 అక్టోబరు 7న గాజా యుద్ధం చెలరేగాక.. పాలస్తీనావాసులకు సంఘీభావంగా హూతీలు రంగంలోకి దిగారు. ఇరాన్, చైనాలు అందించిన డ్రోన్లు, నౌకా విధ్వంసక క్షిపణులు, విస్ఫోటక బోట్లతో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకున్నాయి. దీంతో ప్రధాన నౌకాయాన కంపెనీలు వేరే మార్గంలో పయనించాల్సి వచ్చింది. 2 నెలల కాలంలో 134 నౌకలపై దాడి చేశారు. ఫలితంగా ఎర్ర సముద్ర వర్తక నడవాలో అంతర్జాతీయ వాణిజ్యం 60 శాతానికిపైగా తగ్గింది. ఇందులో చాలావరకూ పశ్చిమ దేశాలతో ముడిపడినవే. నాలుగు నౌకలు మునిగిపో యాయి. మాండెబ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధిస్తే సరకు రవాణా నౌకలు ఆఫ్రికాలోని దక్షిణ భాగం నుంచి పయనించాల్సి వస్తుంది. దీనివల్ల ప్రయాణ సమయంతోపాటు ఖర్చులూ పెరుగుతాయి. ఇది అంతిమంగా చమురు ధరల పెరుగుదలకు, ఇంధన మార్కెట్‌లో మరింత అస్థిరతకు దారితీయవచ్చు. అయితే ఈ జలసంధి దిగ్బంధనానికి ప్రయత్నిస్తే అమెరికా గట్టిగా ప్రతిఘటించవచ్చు. మాండెబ్ జలసంధిలో జిబౌటి వైపున అగ్రరాజ్యానికి భారీ సైనిక స్థావరం ఉంది.

# మొజ్తబా ఖమేనీ మృతి?

- ట్రంప్ సంచలన వ్యాఖ్యలు
- తదుపరి లక్ష్యం క్యూబా అంటూ హెచ్చరికలు



**వాషింగ్టన్, మార్చి 28:** పశ్చిమాసియా ఉద్రిక్తతల నడుమ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా కలకలం రేపుతున్నాయి. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా భావిస్తున్న మొజ్తబా ఖమేనీ మరణించి ఉండొచ్చని ట్రంప్ పేర్కొన్నారు. మయామిలో జరిగిన ఫ్యూచర్ ఇన్వెస్ట్‌మెంట్ ఇనిషియేటివ్ సమ్మిట్‌లో మాట్లాడిన ట్రంప్, అమెరికా సైనిక దాడులు ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని పూర్తిగా దెబ్బతీశాయని చెప్పారు. "ఇరాన్ నౌకాదళం అంతమైపోయింది, వైమానిక దళం నిర్వీర్యమైంది, వారి రక్షణ వ్యవస్థలు పూర్తిగా కూలిపోయాయి" అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని అంచనాలకు మించి దెబ్బతీశామని, క్షిపణి, డ్రోన్ కర్మాగారాలను ధ్వంసం చేశామని తెలిపారు. అయితే ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలను ఇరాన్ ప్రభుత్వం ఇప్పటివరకు అధికారికంగా ధ్రువీకరించలేదు. సాధారణంగా అయతొల్లా అలీ ఖమేనీ కుటుంబానికి సంబంధించిన విషయాలను ఇరాన్ అత్యంత గోప్యంగా ఉంచుతుందన్నది తెలిసిందే. ఇరాన్, వెనిజులా తర్వాత తమ తదుపరి లక్ష్యం క్యూబా కావచ్చని ట్రంప్ హెచ్చరించారు. అవసరమైతే సైనిక చర్యలకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. "కొన్నిసార్లు సైన్యాన్ని ఉపయోగించాల్సి వస్తుంది.. తర్వాతి వంతు క్యూబాదే" అని వ్యాఖ్యానించారు. అయితే వెంటనే ఆ వ్యాఖ్యలను కొంత సర్దిచెప్పే ప్రయత్నం కూడా చేశారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో క్యూబా అధ్యక్షుడు మిగెల్ డియాజ్ కానెల్ అమెరికాతో చర్చలు జరుపుతున్నట్టు అంగీకరించారు. భవిష్యత్తులో ఉద్రిక్తతలు పెరగకుండా చూడాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కాగా, ట్రంప్ వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నాయి. ఒకవైపు పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం కొనసాగుతుండగా, మరోవైపు క్యూబాపై సైనిక చర్యల సూచనలు రావడం అంతర్జాతీయ ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశముంది. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రపంచ దేశాలు పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాయి. పరిస్థితి మరింత దిగజారకుండా రాజనీతిక పరిష్కారాలే మార్గమని నిపుణులు సూచిస్తున్నారు.

# 'లాక్‌డౌన్' ప్రసక్తే లేదు..


- వదంతులు నమ్మొద్దు : కేంద్ర ప్రభుత్వం



**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాల నేపథ్యంలో దేశవ్యాప్తంగా మళ్లీ లాక్‌డౌన్ విధిస్తారంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వార్తలను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఈ ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ స్పష్టం చేస్తూ, దేశంలో ఇంధన కొరత ఏర్పడవచ్చనే ఆందోళనలతో ప్రజలను గందరగోళానికి గురిచేసే వదంతులను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఇంధన సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్న భయంతో పలు ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు బారులు తీరుతున్న తరుణంలో, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాజ్యసభలో ఆర్థిక బిల్లు 2026పై సమాధానం ఇస్తూ దేశంలో లాక్‌డౌన్ విధించే ఆలోచన గానీ అలాంటి ప్రతిపాదన గానీ ప్రభుత్వం వద్ద లేదని తేల్చి చెప్పారు. అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్న మాట నిజమేనని, అయితే ఎనర్జీ సప్లై చైన్, నిత్యావసరాల రవాణాను ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తోందని ఆమె భరోసా ఇచ్చారు. గత నెల రోజుల్లో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుంచి ఏకంగా 122 డాలర్లకు చేరినప్పటికీ, సామాన్యులపై భారం పడకుండా ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుందని నిర్మలమ్మ వివరించారు. దీనిలో భాగంగా పెట్రోల్‌పై అదనపు ఎక్సైజ్ సుంకాన్ని రూ. 13 నుంచి రూ. 3కు తగ్గించడమే కాకుండా, డీజిల్‌పై ఉన్న రూ. 10 సుంకాన్ని పూర్తిగా ఎత్తివేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం తగ్గినప్పటికీ, చమురు కంపెనీలకు మరియు సామాన్య ప్రజలకు భారీ ఊరట లభించనుంది. అంతర్జాతీయంగా పెట్రోల్ ధరలు 20 నుంచి 50 శాతం పెరిగినా, భారత్‌లో ప్రజలకు రక్షణ కల్పించేందుకే ఈ ఎక్సైజ్ సుంకాల తగ్గింపు నిర్ణయం తీసుకున్నట్లు ఆమె స్పష్టం చేశారు. దేశంలో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, అసత్య ప్రచారాలను నమ్మి ఆందోళన చెందవద్దని కేంద్రం మరోసారి విజ్ఞప్తి చేసింది.

# మారనున్న ఆస్కార్ వేడుకల వేదిక

## 2029 నుంచి పీకాక్ థియేటర్‌లోకి మార్పు



లాస్‌ఏంజిల్స్, మార్చి 28 : ప్రపంచ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'అకాడమీ అవార్డ్స్' ఆస్కార్ ఒక చారిత్రాత్మక మార్పునకు సిద్ధమవుతోంది. దశాబ్దాలుగా హాలీవుడ్ వేదికగా జరుగుతున్న ఈ వేడుకలు, 2029 నుంచి లాస్ ఏంజిల్స్ డౌన్‌టౌన్‌లోని కొత్త వేదికకు మారనున్నాయి. అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ప్రకటించిన వివరాల ప్రకారం, 2029 నుంచి 2039 వరకు పదేళ్ల పాటు ఈ వేడుకలు లాస్ ఏంజిల్స్ లైవ్ కాంప్లెక్స్‌లోని 'పీకాక్ థియేటర్'లో జరగనున్నాయి. ఇందుకోసం ప్రముఖ వినోద సంస్థ తో అకాడమీ ఒప్పందం కుదుర్చుకుంది. 2001 నుంచి ఆస్కార్ వేడుకలకు ఆతిథ్యం ఇస్తున్న హాలీవుడ్ బౌలేవార్డ్ లోని 'డాల్బీ థియేటర్' యుగం, 2028లో జరగబోయే 100వ వార్షికోత్సవ వేడుకలతో ముగియనుంది. అప్పటివరకు ఈ వేడుకలు ఎబిసి ఛానల్‌లోనే ప్రసారమవుతాయి. అయితే, 2029 నుంచి 2033 వరకు జరిగే ఆస్కార్ వేడుకల ప్రసార హక్కులను యూట్యూబ్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. దీనివల్ల రెడ్ కార్పెట్, తెరవెనుక విశేషాలు మరియు ప్రధాన వేడుక వంటివన్నీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినిమా అభిమానులు యూట్యూబ్‌లో ఉచితంగా వీక్షించే అవకాశం కలగనుంది. అత్యాధునిక సాంకేతికత కలిగిన వేదికపై సినిమా పండుగను ప్రపంచవ్యాప్తంగా జరుపుకోవడానికి ఈ మార్పు ఎంతో దోహదపడుతుందని అకాడమీ ప్రతినిధులు పేర్కొన్నారు.

# అయోధ్య యజ్ఞశాలలో భారీ అగ్నిప్రమాదం

## అగ్నికి ఆహుతి అయిన పందిళ్లు

## ప్రమాదంలో ప్రాణనష్టం లేదని వివరణ




**అయోధ్య,మార్చి 28:** అయోధ్యలోని యజ్ఞశాలలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. రాజ్‌ఘాట్‌లో బటి బాబా ఆశ్రమం సమీపంలో ఉన్న మహాలక్ష్మి నారాయణ యజ్ఞశాలలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. పెద్ద పెద్ద పందిళ్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. 10 అగ్నిమాపక వాహనాలు రెండు గంటల్లోనే మంటలను అదుపులోకి తెచ్చాయి. అగ్ని ప్రమాదంలో ఎవరూ ప్రాణాలు కోల్పోలేదని ఉత్తర ప్రదేశ్ రవాణా శాఖ మంత్రి దయాశంకర్ సింగ్ అన్నారు. మార్చి 20 నుంచి మార్చి 28 వరకు యజ్ఞం జరిగిందని.. తొమ్మిది రోజుల పాటు జరిగిన మహాయజ్ఞం ముగిశాక ఈ అగ్నిప్రమాదం జరిగిందని వెల్లడించారు. యజ్ఞశాల ఖాళీగా ఉన్న సమయంలో ఈ ఘటన జరిగిందని.. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదన్నారు. కానీ లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్లు చెప్పారు. దాదాపు ఎకరం విస్తీర్ణంలో ఉన్న యజ్ఞశాల నిమిషాల వ్యవధిలోనే బూడిదైపోయింది. ఈ భారీ అగ్నిప్రమాదం రామ మందిరానికి కేవలం 800 మీటర్ల దూరంలో జరిగింది. శనివారం ఉదయం సుమారు 11:30 గంటలకు పూర్ణాహుతితో యజ్ఞం ముగియగానే.. భక్తులు ఇళ్లకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం తర్వాత ఈ ప్రమాదం జరిగింది. అగ్నిప్రమాదానికి గల కచ్చితమైన కారణం ఇంకా స్పష్టంగా తెలియరాలేదని, దర్యాప్తు చేసేందుకు ఒక సాంకేతిక బృందాన్ని పంపుతామని మంత్రి తెలిపారు. యంత్రాంగం ఈ విషయంపై దర్యాప్తు చేస్తోందని, అసలు కారణం త్వరలోనే వెల్లడయ్యే అవకాశం ఉందన్నారు.

# రావద్దన్నారు.. పదవి పోతుందన్నారు

## నొయిడా సెంటిమెంట్‌ను తుడిచిపెట్టాం..

## మూఢనమ్మకాలతో అభివృద్ధిని గాలికొదిలేశారు

## ప్రధానమంత్రి నరేంద్ర మోదీ






**న్యూఢిల్లీ:** ఉత్తరప్రదేశ్ పర్యటనలో భాగంగా శనివారం నొయిడా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, గత పాలకుల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న 'నొయిడా సెంటిమెంట్' కారణంగానే గత నాయకులు ఈ ప్రాంత అభివృద్ధిని పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. నొయిడాలో పర్యటిస్తే పదవి కోల్పోతామనే భయంతో, మూఢనమ్మకాలతో పాలకులు ఇక్కడకు రావడమే మానేశారని, అయితే తాను మాత్రం ప్రజా ఆశీర్వాదమే ప్రధానమని నమ్మి ఈ అపశకున ప్రచారానికి స్వస్తి పలికానని మోదీ స్పష్టం చేశారు. ఒకప్పుడు నాయకులు వదిలేసిన ఈ ప్రాంతమే ఇప్పుడు ప్రపంచ స్థాయి విమానాశ్రయంతో 'నిర్భర భారత్'కు గర్వకారణంగా నిలిచిందని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా తనకు ఎదురైన ఒక ఆసక్తికర అనుభవాన్ని ప్రధాని పంచుకున్నారు. గతంలో సమాజ్‌వాదీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తాను నొయిడా పర్యటనకు సిద్ధమవ్వగా, అప్పటి ముఖ్యమంత్రి స్వయంగా ఫోన్ చేసి రావద్దని వారించారని వెల్లడించారు. "మోదీజీ.. మీరు ఇప్పుడే ప్రధానమంత్రి అయ్యారు, నొయిడా వెళ్లకండి.. వెళ్తే మీ పదవి పోతుంది" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారని, దానికి స్పందనగా తాను మాత్రం నొయిడా ప్రజల ఆశీర్వాదం కోసం వెళ్తానని, అదే తనకు దీర్ఘకాలం దేశానికి సేవ చేసే అవకాశం ఇస్తుందని బదులిచ్చానని మోదీ గుర్తు చేసుకున్నారు. మూఢనమ్మకాల కంటే ప్రజల ప్రయోజనాలే మిన్న అని చాటిచెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. నొయిడా శాపం పేరిట గత మూడు దశాబ్దాలుగా యూపీ రాజకీయాల్లో ఒక భయం తాలూకు నీడలు ఉన్నాయి. 1988లో వీర బహదూర్ సింగ్ నుంచి మొదలుకొని ఎన్డీ తివారీ, ములాయం సింగ్ యాదవ్, మాయావతి, కల్యాణ్ సింగ్ వంటి దిగ్గజ నాయకులు నొయిడా పర్యటన తర్వాత పదవులు కోల్పోవడంతో ఈ సెంటిమెంట్ బలపడింది. రాజ్‌నాథ్ సింగ్ వంటి వారు కూడా ఫ్లైఓవర్‌ను ఢిల్లీ వైపు నుంచే ప్రారంభించి జాగ్రత్త పడ్డారు. అయితే, ప్రస్తుత ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పదేపదే నొయిడా పర్యటనలు చేస్తూ, తిరిగి రెండోసారి కూడా అధికారంలోకి వచ్చి ఈ మూఢనమ్మకాలకు ఎట్టకేలకు బ్రేక్ వేశారని ప్రధాని కొనియాడారు. నేడు ప్రారంభమైన ఈ విమానాశ్రయం ఉత్తరప్రదేశ్‌ను అంతర్జాతీయ పటంలో సరికొత్త స్థాయికి తీసుకెళ్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



# జగన్‌కు అధికార యావ తప్ప మరోటి లేదు

నమ్మిన సిద్ధాంతం కోసం చంద్రబాబు ఆరాటం

అమరావతి కోసం రాత్రింబవళ్లు కష్టపడ్డ బాబు

ఉమ్మడి ఏపిలోనూ మొక్కవోని ధైర్యంతో పని

అసెంబ్లీలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

**అమరావతి, మార్చి 28:** వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాటలు మోసం, కుట్ర, నయవంచనకు ప్రతిరూపంగా కనిపిస్తున్నాయని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. జగన్‌కు అధికారం తప్ప ప్రజల ఆకాంక్షలు కనిపించవంటూ మండిపడ్డారు. తెలుగుజాతికి చరిత్రలో ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. రాష్ట్ర విభజన జరుగుతున్న సమయంలో తమలాంటి వారు ఆ సభలో ఉన్నారని, తెలుగుజాతి బాగుండాలని చంద్రబాబు పడిన తపన తాము చూశామని చెప్పుకొచ్చారు. చంద్రబాబు ఎప్పుడూ నిబ్బరం కోల్పోలేదని తెలిపారు. సీఎంగా ఉండి కూడా బస్సులో పడుకున్నారు. ఈ కార్యాలయాన్ని సీఎం కార్యాలయంగా చేసుకుని పని చేశారు. 53 సంవత్సరాలు ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్న వ్యక్తి చంద్రబాబు. అవతల వైపు ఎంతమంది మారినా.. ఇటువైపు చంద్రబాబు ఒక్కరే నిలబడ్డారు. రాష్ట్రం కోసం, నమ్మిన సిద్ధాంతం కోసం ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. 1995-2004 మధ్య చంద్రబాబు తెచ్చిన 63 ప్రాజెక్టుల్లో.. 2004 తర్వాత వైఎస్ 62 ప్రాజెక్టులను కొనసాగించారు. కానీ, జగన్ మాత్రం చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలన్నింటినీ తిరగదోడారని మండిపడ్డారు. జగన్ సొంతంగా ఒక్క ప్రాజెక్టు తెచ్చింది లేదు. ఒక్క ఇటుక పెట్టి పని చేసింది లేదు. రాష్ట్రం ఒక్కటిగా ఉండాలని ప్రజలు చేసిన పోరాటం మా కళ్ల ముందు ఉంది. విభజన కష్టాలతో ఉన్న సమయంలో నమ్మి ఓట్లేసిన ప్రజల కోసం మేం పని చేశాం. కానీ జగన్ మాత్రం ఎలా ఆలోచించారో ఈ వీడియోల ద్వారా ప్రజలు చూశారు. జగన్ 3 రాజధానులకు అప్పటి సభ్యులు చప్పట్లు కొట్టారు. కేవలం బటన్ నొక్కడంతోనే ప్రజల బతుకులు సాగాలని జగన్ కోరుకున్నారు. సింగపూర్ మాస్టర్ ఎ÷-లాన్‌తో లక్షన్నర ఉద్యోగాలు వస్తాయి. జగన్ మాత్రం పురిట్లో బిడ్డను చంపినట్లు అమరావతిని చంపాలని చూశారని అన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ అమరావతిని నిలబెట్టేందుకు కృషి చేశారు. వైసీపీ నేతలు ఓ వైపు రాజదాని కావాలంటారు.. మరోవైపు అమరావతిలోనే ఖర్చు చేస్తున్నారని ప్రచారం చేస్తారు. రాజధాని అంటే కేవలం నాలుగు భవనాలు కాదు. రాజధాని గ్రోత్ ఇంజిన్‌లా ఉండాలని చంద్రబాబు భావించారు. హైదరాబాద్ విషయంలో ఇదే విషయం రుజువైంది. అదే తరహా నగరం ఏపీ రాజధానిగా ఉండాలని చంద్రబాబు భావించారు. రాయలసీమ, ఉత్తరాంధ్రలోని యువకులకు సైతం మాకు మంచి రాజధాని ఉందనుకునేలా చేశారు. రెండున్నరేళ్లపాటు అమరావతి నిర్మాణ పనులు పరుగులు తీశాయని అన్నారు.

# కేంద్రానికి అమరావతి తీర్మానం

ఏకగ్రీవ తీర్మానాన్ని పంపిన ప్రభుత్వం

**అమరావతి, మార్చి 28:** రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఆమోదించిన ఏకగ్రీవ తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీకి పంపించింది. కేంద్ర హోం శాఖ మంత్రి, రాజ్యసభ ఛైర్మన్, లోక్‌సభ స్పీకర్‌కు శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీర్మానాన్ని పంపించారు. అలాగే కేంద్ర హోం శాఖ కార్యదర్శి, ఏపీ చీఫ్ సెక్రటరీకి తీర్మానం కాపీని అసెంబ్లీ సెక్రటరీ జనరల్ పంపారు. ఈ తీర్మానాన్ని మెయిల్ ద్వారా పంపడంతో పాటు, నేరుగా ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయి అధికారి ద్వారా ఢిల్లీకి పంపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సాయంత్రానికి ఢిల్లీకి తీర్మానాన్ని పంపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. అమరావతికి చట్టబద్ధత కల్పించడమే కాకుండా భవిష్యత్తులో ఎవరు వచ్చినా కూడా అమరావతిని మార్చే అవకాశం లేకుండా చేసే ఉద్దేశంతోనే 2014 ఆంధప్రదేశ్ పునర్విభజన చట్టాన్ని సవరిస్తూ ఏపీ శాసనసభ ఈరోజు ఏకగ్రీవ తీర్మానం చేసింది.

# జగన్ సమాధానం చెప్పాలి

మొదటి పేజీ తరువాయి

రాజధాని కోసం 35 వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా ఇచ్చిన రైతులకు సభ తరపున శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. గత ఐదేళ్లలో జరిగిన విధ్వంసాన్ని గుర్తు చేస్తూ లోకేష్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "రాజధాని ఇక్కడే ఉంటుందని అబద్ధం చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్, తర్వాత మూడుముక్కలాట ఆడారు. అమరావతిని నాశనం చేయడమే కాకుండా, కనీసం విశాఖలో గానీ, కర్నూలులో గానీ ఒక్క అభివృద్ధి పని చేయలేదు. కేవలం తన కోసం 700 కోట్లతో ప్యాలెస్ కట్టుకున్నారు" అని మండిపడ్డారు. అమరావతి ఉద్యమ సమయంలో మహిళలను బూటు కాళ్లతో తన్నారని, దళిత రైతులకు సంకెళ్లు వేసి జైల్లో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ చేసిన ఈ దారుణాలకు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు, అమరావతి రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధిని పరుగులు తీయిస్తోందని మంత్రి వివరించారు. "అభివృద్ధి వికేంద్రీకరణ అంటే మూడు రాజధానులు కాదు.. ప్రతి జిల్లాలోనూ పరిశ్రమలు రావడం. అనంతపురాన్ని ఆటోమోటివ్ హబ్ గా, ఉత్తరాంధ్రను స్టీల్ మరియు ఐటీ హబ్ గా, రాయలసీమను సోలార్ మరియు ఎలక్ట్రానిక్స్ హబ్ గా తీర్చిదిద్దుతున్నాం" అని చెప్పారు. భారతదేశంలో వచ్చే ప్రతి 100 రూపాయల పెట్టుబడిలో 25 రూపాయలు ఏపీకి వస్తున్నాయని, జగన్ అడ్డంకులు సృష్టించకపోయి ఉంటే అది 50 రూపాయలు దాటేదని అన్నారు.



### డబుల్ ఇంజన్ సర్కార్ పవర్

కేంద్రం అమరావతి కోసం 16 వేల కోట్ల గ్రాంటు ఇచ్చిందని, ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కలసి రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని లోకేష్ పేర్కొన్నారు. గూగుల్ డేటా సెంటర్ వంటి దిగ్గజ సంస్థలను రాష్ట్రానికి తేవడానికి అర్ధరాత్రి పూట కూడా సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రులతో చర్చలు జరుపుతున్నారని కొనియాడారు. "ఈరోజు రాష్ట్రంలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉంది. ఇకపై ఏ తుగ్లక్ వచ్చినా అమరావతిని మార్చలేరు" అని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఏపీ దక్షిణ భారతదేశంలోనే అగ్రగామిగా నిలుస్తుందని స్పష్టం చేస్తూ, అమరావతి తీర్మానాన్ని మనస్ఫూర్తిగా బలపరుస్తున్నట్లు మంత్రి లోకేష్ ప్రకటించారు.

# ఇక అమరావతి ప్రజా రాజధాని

మొదటి పేజీ తరువాయి

జాతీయ స్థాయిలో ఫ్రంట్ ఏర్పాటు చేసిన పార్టీ టీడీపీ అని ఆయన పేర్కొన్నారు. విభజన సమయంలో సమన్యాయం కోసం తాము కోరినట్లు చంద్రబాబు చెప్పారు. ఆనాడు పార్లమెంట్‌లో జగన్ కనిపించకుండా దాక్కున్నారని విమర్శించారు. విభజన తర్వాత ఏపీలో కార్యాలయాలు లేవని, బస్సులో ఉండి పరిపాలన చేశామని ఆయన వెల్లడించారు. అమరావతిలో అసెంబ్లీ, సచివాలయ భవనాలను కేవలం 9 నెలల్లోనే పూర్తి చేశామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.సింగపూర్ సహకారంతో ఆ స్థాయిలో రాజధాని నిర్మాణం కోసం ప్రణాళికలు ఇవ్వాలని కోరామని సీఎం తెలిపారు. 'ముందు దేశం బాగుండాలి.. అలా ఉండాలంటే మన జాతి బాగుండాలి. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలి' అని అన్నారు. తెలుగు వాళ్లకు చెందిన హైదరాబాద్, అమరావతి తొలి రెండుస్థానాల్లో ఉండాలన్నదే తన సంకల్పమని స్పష్టం చేశారు. విజయవాడ- గుంటూరు



మధ్య రాజధాని పెట్టాలని 46 శాతం మంది కోరుకున్నట్టు శివరామకృష్ణన్ కమిటీ స్పష్టంగా చెప్పిందన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తూ వివిధ జాతీయ స్థాయి సంస్థలను రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న వ్యక్తి రాజధాని అమరావతికి బేషరతుగా మద్దతు ఇస్తామని చెప్పారని.. కానీ రోజుకో మాట మార్చేసి ఊసరవెల్లి రాజకీయాలు చేశారని సీఎం విమర్శించారు. టెక్నాలజీ అందుబాటులో ఉన్న రోజుల్లోనూ రాజకీయ విన్యాసాలు చేశారన్నారు. వంద ఎకరాలు తీసుకుని భవనాలు కట్టేసి రాజధాని అని చెప్పేయవచ్చుని.. కానీ రాష్ట్రానికి ఆర్థిక వనరులు సమకూరేలా ఓ ప్రాంతం ఉండాలని ఆలోచించినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలోని రైతులను సంప్రదించగా 58 రోజుల్లో 34 వేల ఎకరాలను రాజధాని కోసం ఇచ్చేశారన్నారు. రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని సీఎం తెలిపారు. రాజధాని పట్ల కుట్రలు చేసిన కొందరు వక్తులు తోటలకు నిప్పు పెట్టారని మండిపడ్డారు. ప్రపంచ బ్యాంకుకు ఈమెయిళ్లు పెట్టారని ఫైర్ అయ్యారు. కానీ పవిత్రమైన మట్టి, నీరుతో ఈ ప్రాంతాన్ని పునీతం చేశామని... అందుకే ఇది శాశ్వతంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# అమరావతి రాజధానిపై చట్టబద్ధత బిల్లు

ఇది చారిత్రిక సన్నివేశం అన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ఈ సమావేశానికి ఎంతో ప్రాధాన్యం ఉందని వ్యాఖ్య

**అమరావతి, మార్చి 28:** ఏపీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం శనివారం ఉదయం ప్రారంభమైంది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లును ప్రవేశపెట్టారు. ఉదయం సరిగ్గా 11 గంటల 11 నిమిషాలకు శాసనసభలో ఈ బిల్లును సీఎం ప్రవేశపెట్టడంతో తీర్మానంపై చర్చ మొదలైంది. తీర్మానంపై 20 మందికి పైగా సభ్యులు మాట్లాడారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఈ చర్చలో పాల్గొన్నాన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ.. ఈ శాసనసభ సమావేశానికి ఎంతో ప్రాముఖ్యం ఉందన్నారు. రాష్ట్ర ప్రగతికి ఎదురయ్యే సవాళ్లను అధిగమించే యజ్ఞం ఈ సమావేశంతో మొదలవుతోందని స్పీకర్ అన్నారు. 2014లో నడిసంద్రంలో చుక్కాని లేని నావలా ఆంధప్రదేశ్ ఉందని.. అలాంటి సమయంలో దార్శనికుడు చంద్రబాబుకు రాష్ట్రాన్ని ప్రజలు అప్పగించారని తెలిపారు. చంద్రబాబు ప్రగతి బాటలో నడిపించాలని ప్రణాళికలు



రూపొందించారన్నారు. అందరి సంప్రదింపులతో అమరావతిని రాజధానిగా ఖరారు చేశారని అన్నారు. ఈ ప్రాంతంలోని రైతులు తమ ప్రాణప్రదమైన భూములను రాజధాని కోసం విరాళంగా ఇచ్చారని తెలిపారు. అన్నదాతల అండతోనే రాజధానికి భూమి లభించిందని... అమరావతి రాజధాని పనులు వేగంగా ముందుకు సాగాయని స్పీకర్ తెలిపారు. 2019లో అమరావతికి అడ్డంకులు ఎదురయ్యాయన్నారు స్పీకర్. మూడు రాజధానుల పేరిట తప్పుడు నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు మారినప్పుడు పాత నిర్ణయాలు కొనసాగించాలనే సూత్రానికి విరుద్ధంగా అప్పటి ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. చేతికి కొబ్బరికాయ చిక్కినట్లు ప్రవర్తించి, అప్రజాస్వామిక విధానాలతో రాష్ట్రం 50 ఏళ్లు వెనక్కు వెళ్లిందని వ్యాఖ్యానించారు. పాలకులు కూడా విధ్వంసానికి పాల్పడవచ్చని ఈ సంఘటనలు నిరూపించాయని స్పీకర్ వెల్లడించారు. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా అమరావతిని శాశ్వత రాజధానిగా చేస్తున్నారని స్పీకర్ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ధృఢ సంకల్పం ఫలితంగా దీనికి కేంద్ర ప్రభుత్వం సమ్మతించిందన్నారు. ఈ మేరకు అమరావతి రాజధానిగా తీర్మానం చేసేందుకు అవకాశం వచ్చిందని తెలిపారు. తెలుగు ప్రజలు గర్వించదగ్గ రోజు ఇది అని చెప్పుకొచ్చారు. ఈ చరిత్రాత్మక సమావేశానికి 11 మంది వస్తారని అనుకున్నామని... చేసిన తప్పును ఒప్పుకునే ధైర్యం వారికి లేదని తెలిసిపోయిందన్నారు. అమరావతి తీర్మానంపై జరిగే చర్చ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. 'ఇలాంటి చరిత్రాత్మక సందర్భంలో మాట్లాడే అవకాశం మీ అదృష్టం. అందరూ అర్థవంతంగా చర్చలో పాల్గొని మాట్లాడాలి' అని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక్కటే రాజధాని.. అది అమరావతి

- గతంలో మూడు రాజధానుల పేరిట వైసిపి నాటకాలు
- భూములు ఇచ్చిన రైతులను కేసులో హింసించారు
- బలమైన నాయకుడు చంద్రబాబు వల్లనే అభివృద్ధి సాధ్యం
- అందుకే కూటమి కట్టి ఎన్నికల్లో పోటీ చేశాం
- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం

**అమరావతి, మార్చి 28:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక్కటే రాజధాని ఉందని, అది అమరావతి మాత్రమేనని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. చంద్రబాబులాంటి వ్యక్తి చేతిలో ఏపీ ఉంటేనే అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాజధాని కోసం రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని తెలిపారు. వైసీపీ పాలనలో అమరావతిపై కక్ష కట్టారని, మూడు రాజధానులంటూ మూడుముక్కలాట ఆడారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో ప్రజలకు రక్షణ లేకుండాపోయిందన్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులను హింసించారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతిపై చర్చలో శనివారం పవన్ అసెంబ్లీలో మాట్లాడుతూ.. 'రాజకీయ స్థిరత్వం చాలా ముఖ్యం. తెలంగాణ వేరు.. ఏపీ వేరు అనే భావన మాకెప్పుడూ



లేదు. తెలుగునేల అనేదొక్కటే మా భావన. రాష్ట్ర విభజనలో కాంగ్రెస్ బాధ్యతగా వ్యవహరించలేదు. రాజధాని లేని రాష్ట్రంగా మనం ఇంకా కొట్టుకుంటూనే ఉన్నాం. ఏపీ నేలపై ప్రేమతోనే ఎలాంటి షరతులు లేకుండా టీడీపీతో కలిశాం. రాష్ట్రాన్ని కాపాడుకోవాలనే కూటమిగా ఏర్పడ్డాం. వైసీపీ హయాంలో ఎక్కడ చూసినా అరాచకమే. ఇళ్ల నుంచి బయటకు రావాలంటే మహిళలు భయపడేవారు. ప్రశ్నించిన అందరిపైనా దాడులు చేశారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని విభజించేటప్పుడు కాంగ్రెస్ బాధ్యతగా వ్యవహరించ లేదని అన్నారు. రాష్ట్రం ఏర్పడే నాటికి సరైన కార్యాలయాలు లేవని, చంద్రబాబు బలమైన ఆశావాది కాబట్టి.. కార్యాలయాలు లేకపోయినా టెంట్ వేసుకొనైనా పని చేద్దామని ఆశించారన్నారు. రాష్ట్రం ఏర్పడి ఇన్నేళ్లయినా.. ఇప్పటికీ రాజధాని కోసం కొట్టుకుంటున్నాం. ఇప్పటికీ రాజధాని, సరైన హైకోర్టు లేదని తలచుకుంటే బాధేస్తోంది. అభివృద్ధికి రాజకీయ స్థిరత్వం చాలా ముఖ్యం. రాజధాని కోసం మెజార్టీ రైతులు ఇష్టపూర్వకంగానే భూములు ఇచ్చారు. ఎలాంటి గొడవలు లేకుండా 33వేల ఎకరాలు రాజధాని కోసం సేకరించారు. 2019లో ప్రభుత్వం మారాక.. అమరావతిపై కక్ష కట్టారు. అమరావతి రైతులకు మద్దతుగా నేను వెళ్తే.. ముళ్ల కంచెలు వేశారు. వైకాపా హయాంలో శాసనసభ్యులకే రక్షణ లేకపోతే.. రైతులకు ఎలా ఉంటుంది? రాజధాని కోసం భూములిచ్చిన రైతులను వైకాపా హయాంలో హింసించారు. వైకాపా హయాంలో మూడు రాజధానుల ప్రతిపాదన చేశారు. రాజధాని సమస్యను పరిష్కరించకపోగా.. కఠినం చేశారు. వైకాపా మళ్లీ వస్తే.. పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. వైకాపా మళ్లీ రాదు.. వచ్చినా ఏం చేయలేదు. అమరావతి రైతుల కోసం మనమంతా ఒకే మాటపై ఉండాలని అన్నారు. అమరావతిపై జనసేన ఎప్పుడూ మాట మార్చదు..దీనికి కట్టుబడి ఉన్నాం. చట్టసభల్లో కూర్చొని దాడులు చేస్తామంటే.. చూస్తూ ఊరుకోం అన్నారు. రాష్ట్రంలో రాజకీయ స్థిరత్వం ఉంటేనే.. పెట్టుబడులు వస్తాయి. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసేటప్పుడు చంద్రబాబును అందరూ విమర్శించారు. ప్రపంచబ్యాంకుతో కుమ్మక్కయ్యారని ఆరోపించేవాళ్లు. రాజకీయ నేత ఎన్నికల గురించి ఆలోచిస్తాడు. దార్శనికుడు ఒక తరం గురించి ఆలోచిస్తాడని పవన్ అన్నారు.

# అమరావతిని అవమానించిన ఘనుడు జగన్

రాజధాని మహిళా రైతులపై కేసులు

ఆనాటి పాపాలను ఇంకా ఎలా మరచిపోగలం

అమరావతి రైతుల సుదీర్ఘ పోరాటం మరువలేనిది

అసెంబ్లీలో హోంమంత్రి అనిత ఆవేదన

**అమరావతి, మార్చి 28:** అమరావతి శాతకర్ణి పాలనలో మహిళలకు ఎంతో గౌరవం దక్కిందని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. శాసనసభలో హోంమంత్రి మాట్లాడుతూ... అమరావతిని వైసీపీ వారు 'వేశ్యల రాజధాని' అని అవమానకరంగా వ్యాఖ్యానించడం ఎంతో బాధించిందన్నారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయానికి వ్యతిరేకంగా అమరావతి రైతులు 1631 రోజుల పాటు పోరాడారని తెలిపారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే ఇది అత్యంత సుదీర్ఘ కాలం జరిగిన పోరాటం అని వివరించారు. ఈ ఉద్యమంలో చంటి బిడ్డలను ఎత్తుకుని, గర్భిణిలు, వృద్ధ మహిళలు కూడా రోడ్డుపైకి వచ్చి పోరాడారని హోంమంత్రి గుర్తు చేశారు. ఆనాటి రైతులు చేసిన ఆ మహా పోరాటాన్ని కొనసాగించేలా ఈనాటి అసెంబ్లీ తీర్మానం ఉంటుందని అనిత అన్నారు. అమరావతిని కాపాడుకున్న ఈ చరిత్ర భావితరాలకు తెలియాలన్నారు. ఉద్యమ సమయంలో మహిళలపై పోలీసులు దాడి చేశారని, వారిని కొట్టారని, జుట్టు పట్టుకుని లాక్కెళ్లారని, బూటుకాళ్లతో తన్నారని హోంమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు అనుమతితో పాదయాత్ర చేస్తున్నప్పటికీ పోలీసులు అడ్డుకుని ఇబ్బందులు పెట్టారని తెలిపారు. మహిళలు కట్టుకున్న చీరలపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేశారని అనిత ఆరోపించారు. మహిళల పోరాటానికి మద్దతు ఇచ్చిన వారి ఆర్థిక మూలాలను దెబ్బతీశారని హోంమంత్రి మండిపడ్డారు. రైతులు పాదయాత్రలో భోజనం చేసే సమయంలో టెంట్లు కూల్చివేశారన్నారు. దీంతో మట్టిలో, రోడ్లపై కూర్చుని రైతులు అన్నం తినాల్సిన దారుణ పరిస్థితులు సృష్టించారని విమర్శించారు. ఇలాంటి అనేక దారుణాల నుంచి అమరావతిని మళ్లీ సాధించుకున్నామన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు కూడా అమరావతికి మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. మహిళా రైతుల ఉద్యమాన్ని గుర్తు చేసుకుని ఈరోజు అసెంబ్లీలో అమరావతి తీర్మానానికి పూర్తి మద్దతు ఇస్తున్నట్లు హోంమంత్రి అనిత పేర్కొన్నారు.



## పదవ తరగతి పరీక్షలను సజావుగా నిర్వహించాలి

● అధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ



**వికారాబాద్, మార్చ్,28(సమయం న్యూస్) :** పదవ తరగతి పరీక్షల సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని శనివారం ఆకస్మికంగా పర్యటించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం చీఫ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో డ్యూటీ రిజిస్టర్, ప్రశ్నపత్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతం అదేవిధంగా మెడికల్ సిబ్బంది గురించి ఆరా తీసి అక్కడ ఉన్న మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో మంచినీటి సదుపాయంతో పాటు మందులను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా విద్యాధికారి రేణుకా దేవి, చీఫ్ సూపరింటెండెంట్ రాజు, సిట్టింగ్ స్క్వాడ్ సుశీల్ కుమార్ తదితరులు ఉన్నారు.

## అక్రమంగా మొర్రం తరలిస్తున్న టిప్పర్ పట్టివేత రూరల్ ఇంచార్జ్ ఎస్సై గాయత్రి

● అక్రమంగా మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం- ఎస్సై



**నారాయణపేట, మార్చ్,28(సమయం న్యూస్) :** నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి అక్రమంగా మొర్రం మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ధన్వాడ మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన మహేందర్‌కు చెందిన టిప్పర్ వాహనం అక్రమంగా మొర్రం మట్టి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో, నారాయణపేట రూరల్ ఇంచార్జ్ ఎస్సై గాయత్రి ఆధ్వర్యంలో పోలీసులు అప్పక్ పల్లి గ్రామ శివారులో వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా టిప్పర్‌ను అదుపులోకి తీసుకుని, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై గాయత్రి తెలిపారు. అక్రమంగా మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

## పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించవద్దు

● నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్






**నారాయణపేట మండలం, మార్చ్,28(సమయం న్యూస్) :** పదో తరగతి పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించవద్దని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. నారాయణ పేట మండలంలోని కోటకొండ జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని శనివారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో పరీక్షా సరళిని పరిశీలించారు. కేంద్రాల్లో కొంత మంది విద్యార్థులు వాచ్ లు ధరించి వస్తున్నారని తెలిసిందని, పరీక్షా కేంద్రాలలోకి వాచ్ లు, ఇతర ఏ ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకు వెళ్ళేందుకు అనుమతి లేదని, సీ.ఎస్. డీ.వో లు, ఇన్విజిలేటర్ల కు సైతం కేంద్రాల్లో సెల్ ఫోన్లు తీసుకు వచ్చేందుకు అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. పోలీసులు కూడా పరీక్షా కేంద్రం బయటే బందోబస్తు నిర్వహించాలన్నారు. అనంతరం శనివారం నాటి పరీక్ష కు ఎంత మంది విద్యార్థులు హాజరయ్యారని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎం.ఈ.వో బాలాజీ, సీ.ఎస్.డీ.వో పాల్గొన్నారు.

# తెలంగాణ జాగృతిలోకి భారీగా చేరికలు

● రాష్ట్రంలో రాజకీయ శూన్యతను పూరిస్తున్న కవిత నాయకత్వం.



**హైదరాబాద్, మార్చి 28సమయం న్యూస్ :** తెలంగాణ జాగృతి పార్టీ బలోపేతమే లక్ష్యంగా రంగారెడ్డి జిల్లాలో భారీగా చేరికలు జరిగాయి. శనివారం నగరంలోని జాగృతి ప్రధాన కార్యాల యంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రూప్ సింగ్, జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి సమక్షంలో, జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు కె. శివశంకర్ ఆధ్వర్యంలో చేవెళ్ళ మరియు కల్వకుర్తి నియోజకవర్గాలకు చెందిన వివిధ పార్టీల నుండి సుమారు 100 మందికి పైగా ముఖ్య నాయకులు, కార్యకర్తలు తెలంగాణ జాగృతిలో చేరారు. తెలంగాణ జాగృతి కార్య నిర్వాహక అధ్యక్షుడు రూప్ సింగ్, రాష్ర అధికార ప్రతినిధి నల్లమల్ల శ్రీకాంత్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శులు దూకుంట్ల నరేష్, వరలక్ష్మి, శ్రీనివాస్ తదితర నేతలు కొత్తగా చేరిన వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాం డురంగా రెడ్డి మాట్లాడుతూప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం ఒక కీల కమైన సంధి దశలో ఉందని, ప్రజలు ఆశిస్తున్న అభ్యుదయకర మైన నాయకత్వాన్ని అందించేందుకు కల్వకుంట్ల కవిత నాయకత్వంలోని 'తెలంగాణ జాగృతి' సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఉద్యమ కాలం నుండి తెలంగాణ సంస్కృతిని, అస్తిత్వాన్ని ప్రపంచవ్యాప్తం చేయడంలో కవితమ్మ గారు పోషించిన పాత్ర అసామాన్యమైనదని, ఇప్పుడు అదే స్ఫూర్తితో ఒక బలమైన రాజకీయ ప్రత్యామ్నాయంగా ఈ పార్టీ ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. కేవలం నినాదాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పార్టీ పనిచేస్తుందని, యువత, మహిళలు, మరియు బడుగు బలహీన వర్గాలకు ఈ ప్రయాణం ఒక పెద్ద భరోసా అని ఆయన అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుత రాజకీయ గందరగోళానికి తెరదించి, ప్రగతిశీల మార్గంలో తెలంగాణ ప్రయోజనాలే పరమావధిగా అడుగులు వేయ-బోతున్నట్లు వెల్లడించారు. పార్టీలో చేరిన వారిలో సంగేరి నగేష్, పుట్నాల పరమేష్ గౌడ్, గుణాల మాధవ రెడ్డి, గౌరవ్ కుమార్, గౌరవ్ మల్లేష్, తుమ్మలూరు అంజయ్య, గోల రాజు, వీరేష్, సంజీవ రెడ్డి, నగేష్, షణ్ముఖ్ కుమార్, విశాల్, శివరామకృష్ణా రెడ్డి, కార్తీక్ రెడ్డి, ఆనంద్, తదితర ముఖ్య నేతలు ఉన్నారు

# తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో వికలాంగుడు జహూర్ హుస్సేన్ కు ట్రైసైకిల్ పంపిణీ

● ముఖ్యంగా దివ్యాంగుల సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలి

● తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి -రవీందర్ గౌడ్, గౌరరం గోపాల్



**యాలాల మండలం, మార్చ్,28 (సమయం న్యూస్) :** తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా యాలాల మండలం ముద్దాయి పేట గ్రామానికి చెందిన నడవలేని స్థితిలో ఉన్న జహూర్ హుస్సేన్ కి ట్రై సైకిల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం గ్రామస్థుల సమక్షంలో సాదాసీదాగా కానీ హృదయాన్ని తాకే విధంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యావంతుల వేదిక నాయకులు రవీందర్ గౌడ్, గౌరారం గోపాల్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత మన అందరిదని పేర్కొన్నారు. ముఖ్యంగా దివ్యాంగుల సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమాజంలోని ప్రతి వ్యక్తి సహకారంతోనే ఇలాంటి సేవా కార్యక్రమాలు విజయవంతం అవుతాయని వారు స్పష్టం చేశారు. ఇంకా కార్యక్రమంలో మాట్లాడిన ఇతర ప్రముఖులు కూడా జహూర్ హుస్సేన్ ను ట్రై సైకిల్ అందించడం ద్వారా ఆయన జీవన విధానంలో మార్పు తీసుకురావడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ సహాయం ద్వారా ఆయనకు స్వయంగా కదలికలు సులభతరం కావడంతో పాటు స్వయం ఆధారిత జీవనం సాగించే అవకాశం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి, స్థానిక సర్పంచ్, మాజీ సర్పంచ్, గ్రామ పెద్దలు, స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పరమేశ్వరి, మహేశ్వరప్ప, దుద్యాల మండల ప్రధానోపాధ్యాయులు మల్లప్ప, ఉపాధ్యాయులు సుధాకర్, బొంరస్ పేట మండలానికి చెందిన ఉపాధ్యాయులు వెంకట్ రెడ్డి, యూటీఎఫ్ నాయకులు సర్దార్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ట్రాఫిక్ నిబంధనలను పాటించి ప్రమాదాలను నివారిద్దాము

**సంగారెడ్డి మార్చి28( సమయం న్యూస్) :** తారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డి ఎన్.ఎస్.ఎస్. విభాగాలు రెండు మూడు మరియు నాలుగుల ఆధ్వర్యంలో దత్తత గ్రామాలైన కల్పగుర్, అంగడిపేట్ మరియు మల్కాపూర్ గ్రామాలలో ప్రత్యేక శీతాకాల శిబిరాలలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ తెలిపినారు. కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ సహకారముతో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు దత్తత గ్రామాలలో ప్రజలకు వివిధ అంశాలపై ర్యాలీల ద్వారా అవగాహనను కల్పిస్తున్నారని తెలిపినారు .అదే విధంగా కళాశాల వాలంటీర్లకు ట్రాఫిక్ నిబంధనలపై, సైబర్ క్రైమ్ మరియు ఫోక్ సో చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపినారు. ఈ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ట్రాఫిక్ ఎస్ఐలు సాయిలు, రాములు మరియు గోప్యాచవాన్ మాట్లాడుతూ ట్రాఫిక్ సిగ్నల్స్ ని పాటించాలని, ట్రిపుల్ రైడ్ చేయడం నేరమని, వాహనాన్ని నడుపుతున్నప్పుడు ఓవర్టేక్ చేయరాదని, వాహనదారులు హెల్మెట్ ను లైసెన్సును, నంబర్ ప్లేట్ ను, ఇన్సూరెన్సు, పొల్యూషన్ చెకప్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా కలిగి ఉండాలని తెలిపినారు. లైసెన్స్ లేకుండా మరియు తాగి వాహనాలను నడపరాదని, అట్టి వారిపై చట్టపరంగా చర్యలు ఉంటాయని తెలిపినారు అదేవిధంగా తెలియని వ్యక్తుల నుండి వచ్చిన మెసేజ్లను ఓపెన్ చేయరాదని, తెలియని వ్యక్తులు ఓటీపీ అడిగినప్పుడు చెప్పరాదని, మన సెల్ ఫోన్లు జాగ్రత్తగా ఉపయోగించాలని, ఎట్టి పరిస్థితులలోనూ అపరిచిన వ్యక్తులకు సమాధానాలు ఇవ్వరాదని, అపరిచిత వ్యక్తుల చేతుల్లో సెల్ఫోన్లు పెట్టరాదని తెలిపినారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే అట్టి వ్యక్తులు 24 గంటల లోపు 1930 కు కాల్ చేస్తే వారు పోగొట్టుకున్న డబ్బును పోలీస్ డిపార్ట్మెంటు రికవరీ చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపినారు. అదేవిధంగా 18 సంవత్సరాల లోపు బాలికలను ఏ విధంగా వేధించరాదని, వారి తల్లిదండ్రులకు సమాచారం లేకుండా వారిని మనము ఎక్కడికి తీసుకొని పోరాదని, అది ఫోక్ షో చట్టం కిందికి, వస్తుందని లైంగికంగా వేధించిన, బాలికలను ఏ రకంగా ఇబ్బంది పెట్టిన ఫోక్సు చట్టం ప్రకారము నాన్బెయిలబుల్ వారంటూ ఉంటుందని, కఠినమైన జైలు శిక్ష ఉంటుందని, బాలికల విషయములో యువత జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. అదే విధంగా వాహనదారుల ట్రాఫిక్ సిగ్నల్స్ ను పాటించనప్పుడు ఏ విధంగా ట్యాప్ ద్వారా వారికి ఫైన్ వేయబడుతుందో, అదే విధంగా త్రాగి వాహనాన్ని నడిపితే నూతన పరికరం ఏ విధంగా పనిచేస్తుందో ప్రయోగపూర్వకంగా విద్యార్థులకు వివరించడం జరిగింది. అదేవిధంగా యువత జాగ్రత్తగా ఉండాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ రోడ్డు ప్రమాదాలు, సైబర్ క్రైమ్ వంటి వాటిపై ప్రజలలో అవగాహన కల్పించవలసిన బాధ్యత యువతరానిదే అని తెలిపి నారు. ఎన్ఎస్-ఎస్ మూడవ విభాగం ఆధ్వర్యంలో మల్కాపూర్ లో జరుగుతున్న ప్రత్యేక శీతాకాల శిబిరంలో బాలికలు ప్రాథమిక పాంశాల విద్యార్థులకు విద్యాబోధనతోపాటు వారికి వివిధ రకాలైన ఆటలను ఆడించడం జరిగిందని, గ్రామములో ర్యాలీని నిర్వహించి ప్రజలలో సాంఘిక, ఆర్థిక అంశాలపై ,వివిధ రకాలైన అంటువ్యాధులపై అవగాహన కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ అధికా రులు డాక్టర్ సదయ కుమార్, డాక్టర్ వాణి, డాక్టర్ జగదీశ్వర్, ట్రాఫిక్ పోలీస్ అధికారులు సాయిలు ,రాములు, గోప్య చౌహాన్, ట్రాఫిక్ ఏఎస్ఐ ప్రకాష్ రావు, కానిస్టేబుల్ కుమార్ పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

● సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు. బుస్స చంద్రయ్య



**దుద్యాల మండలం, మార్చ్,28(సమయం న్యూస్) :** ఆశ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తించాలని నెలకు18000 ఇవ్వాలని తదితర డిమాండ్లతో చలో ఇందిరా పార్క్ కార్యక్రమాన్ని చేపట్టగా పోలీసులు ఆశా కార్యకర్తలను ఎక్కడికక్కడ అక్రమ అరెస్టులు చేయడం తగదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బుస్స చంద్రయ్య అన్నారు. శనివారం విలేకరుల సమావేశం లో అయన మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన అని చెపుతూ.. నిర్బంధాన్ని ఉపయోగించడం చాలా దుర్మార్గం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో లేనప్పుడు ఆశా కార్యకర్తలు రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేస్తుంటే రాష్ట్రంలోని కాంగ్రెస్ నాయకులు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశా కార్యకర్తలకు 18 వేల రూపాయలు నెలకు ఇస్తామని తమ మ్యాని ఫేస్టులో పొందుపరచడం జరిగింది. కాంగ్రెస్ వాళ్ళు ఇచ్చిన మాట ప్రకారం 18 వేల రూపాయలు ఇవ్వాలని ఆశా కార్యకర్తలు తమ న్యాయమైన డిమాండ్ల కోసం ప్రజాస్వామ్యయుతంగా పోరాడితే పోలీసులతో రాష్ట్ర ప్రభుత్వం అరెస్టులు చేయడం అన్యాయం ఉద్యమాలను నిర్బంధంతో ఆపలని చూస్తే ఉద్యమాలు ఉవ్వెత్తున జరుగుతాయి తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ గురులోక్ మాసంధ్ ప్రభు బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

● నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.



**కొత్తపల్లి మండలం, మార్చ్,28(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలంలోని తిమ్మారెడ్డి పల్లిలో వచ్చే నెల ఏప్రిల్ 1 నుంచి 4 వరకు జరిగే శ్రీ గురు లోక్ మాసంద్ ప్రభు ( బావోజి) జాతర బ్రహ్మోత్సవాలకు అధికారులు పగడ్బందీగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. నాలుగు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం తిమ్మారెడ్డి పల్లి గ్రామంలో గల బావోజీ ఆలయ అవరణలో సంబంధిత శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో ఉత్సవాల ఏర్పాట్ల గురించి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ ఫణింద్ర రెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకు ముందు కలెక్టర్, కడ ప్రత్యేక అధికారి, అదనపు కలెక్టర్ ఆలయంలో (బావోజీ )గురు లోక్ మాసంద్ ప్రభు కు ప్రత్యేక పూజలు చేశారు. పక్కనే ఉన్న కాళి మాత ఆలయంలోనూ పూజలు నిర్వహించారు. జాతర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ...బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో భాగంగాప్రతి శాఖకు సంబంధించిన అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, నిర్వహణ కు ఆర్డీవో రామచందర్ నాయక్ ప్రత్యేక అధికారిగా పర్యవేక్షణ చేస్తారని ఆయన తెలిపారు. దేవాదాయ శాఖ పరంగా ఏం ఏర్పాట్లు చేశారని కలెక్టర్ ప్రశ్నించగా రథానికి కలర్స్ వేయిస్తున్నామని, మిగతా జాతర ఏర్పాట్లు చేస్తున్నామని, జాతర కోసం తమ శాఖ నుంచి మొత్తం 12 మంది ఉద్యోగులు సిబ్బందిని డిప్యూట్ చేసినట్లు, గతేడాది మాదిరిగానే ఈ సారి ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మదనేశ్వర్ రెడ్డి కలెక్టర్ కు తెలిపారు. మిషన్ భగీరథ పరంగా బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు నీటి వసతి కల్పించామని, అలాగే భక్తుల కోసం 75 మరుగు దొడ్లు, స్నానపు గదులను ఏర్పాటు చేసినట్లు మిషన్ భగీరథ ఈఈ రంగారావు తెలిపారు. శానిటేషన్ పరంగా దాదాపు 480 మందితో 12 క్లస్టర్ గా తాగునీటి, పారిశుధ్య పనులు చేస్తారని, మూడు సిఫ్టులలో వంద మంది చొప్పున 17 ట్రాలీలతో కార్మికుల సేవలు అందుబాటులో ఉంటాయని డీపీవో సుధాకర్ రెడ్డి తెలిపారు. జాతర నాలుగు రోజులు తిమ్మారెడ్డి పల్లి లో సెల్ ఫోన్ లకు సిగ్నల్స్ ఉండవని, తమకు పోలీసు శాఖ నుంచి వాకీ టాకీ లు ఇస్తారని తెలపగా,స్పందించిన కలెక్టర్ ప్రతీక్ జైన్ జియో, ఎయిర్ టెయిల్ ఏజెన్సీ వాళ్ళతో మాట్లాడి జాతర జాతరలో నెట్ వర్క్ ఎక్కువ ఉండేలా చూడాలని ఆర్డీవో రామచందర్ నాయక్ కు సూచించారు. ఒక డాక్టర్, సూపర్ వైజర్ ,ఏ ఎన్ ఎం, ఆశాలతో మూడు సిఫ్టులలో క గతేడాది ఒక వైద్య శిబిరం ఏర్పాటు చేశామని, ఈసారి రెండు వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని, అలాగే రెండు మొబైల్ యూనిట్స్ వైద్య సేవలు అందిస్తారని వైద్య శాఖ ప్రోగ్రామ్ అధికారి కలెక్టర్ కు తెలుపగా, వీలైనంత ఎక్కువ ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. అయితే మందులను నిల్వ చేసేందుకు తమకు ఆలయ ప్రాంగణంలో ఒక గదిని కేటాయించాలని ప్రోగ్రామ్ అధికారి కోరగా వారికి ఒక గదిని కేటాయించాలని కలెక్టర్ దేవాదాయ శాఖ అధికారిని ఆదేశించారు. ఆలాగే పాము కాటు మందులను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. జాతరలో ముఖ్యంగా పార్కింగ్ ఏర్పాట్లు చాలా అవసరం అని, జాతరలో పిక్ పాకెటింగ్ జరగకుండా పోలీసులు నిరంతర నిఘా ఉంచాలన్నారు. ఇక విద్యుత్ శాఖ పరంగా 50 లక్షలతో ప్రత్యేకంగా జాతర కోసం ఫీడర్ ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆ శాఖ ఎస్.ఈ నవీన్ కుమార్ తెలిపారు. జాతరకు వచ్చే భక్తుల కోసం కోస్గి, నారాయణ పేట ఆర్టీసీ డిపో ల నుంచి 8 బస్సులను నడిపిస్తామని, జాతరలో తమకు రెండు చోట్ల పార్కింగ్ స్థలాలను కేటాయించినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్య తెలిపారు. బస్ పార్కింగ్ ప్రాంతాల్లోనూ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని డీ ఎం కోరగా మొబైల్ టాయిలెట్స్ ను ఏర్పాటు చేస్తామని డిపివో సుధాకర్ రెడ్డి తెలిపారు. అగ్నిమాపక శాఖ పరంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఫైర్ అధికారి చెప్పారు. జాతరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు సీఐ సైదులు తెలిపారు. ముఖ్యంగా జాతరలో దొంగతనాలు, ఈవ్ టీజింగ్ జరగకుండా మఫ్టీ పోలీసులతో నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా 200 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. తిమ్మారెడ్డి పల్లి సర్పంచి జ్ఞానేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. జాతర ముగిసిన తర్వాత ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతమంతా వ్యర్థాలతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతుందని, జాతర ముగిసిన తర్వాత కూడా అంతా శుభ్రం చేయించాలని కోరగా డిపివో సానుకూలంగా స్పందించారు. చివరగా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. గతేడాది ఎలా ఏర్పాట్లు చేశారో ఈ సారి అలాగే చేయాలని, గతేడాది జాతర ఉత్సవాలలో జరిగిన లోటు పాట్లను దృష్టిలో ఉంచుకొని ఈ సారి అలా జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సారి జాతర ఉత్సవాలకు తాను కొత్తగా వచ్చాననీ, కానీ ఇక్కడున్న అధికారులంతా చాలా సీనియర్లు అని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. జాతర జరిగే ప్రాంతం సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గం పరిధి అని, ప్రోటోకాల్ విషయంలో చాలా జాగ్రత్త వహించాలని, ఎవరు పడితే వారిని అనుమతించవద్దని అయిన పోలీసులకు సూచించారు. ప్రోటోకాల్ పరంగా ముఖ్యమైన వాళ్లు వచ్చినప్పుడు వాళ్ళ దర్శనం విషయంలో భక్తులు అసౌకర్యానికి గురి కావద్దని, సంయమనం పాటించాలని కోరారు. ఇక జాతర జరిగే ప్రాంగణంలో ఎలా పడితే అలా దుకాణాలు ఏర్పాటు చేయకుండా విశాలమైన రహదారి కి స్థలాన్ని వదిలి దుకాణాలు ఏర్పాటు చేయించాలని, రహదారి మార్కింగ్ హద్దు దాటి ఎవరైనా దుకాణాలు ఏర్పాటు చేస్తే వెంటనే వాటిని తొలగింప చేయించాలని పోలీసు అధికారి సైదులు ను ఆయన ఆదేశించారు. అన్నింటికంటే జాతరలో పారిశుధ్యం ముఖ్యమని, ఆరోగ్యంతో జాతరకు వచ్చిన భక్తులు అనారోగ్యంతో తిరిగి వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత అధికారులందరిపై ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ మొగులప్ప, పీ.ఆర్. ఈ.ఈ అశోక్, తహసిల్దార్ జయరాములు, సంబంధిత శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఆదర్శ గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దే దిశగా ప్రజా ప్రతినిధులు పనిచేయాలి

● జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సూచించారు.

● గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర అతి కీలకం -కలెక్టర్



**వికారాబాద్, మార్చ్ 28(సమయం న్యూస్) :** ఐదు రోజులపాటు మాడుగుల్ చిట్టంపల్లి డిపిఆర్సి భవనంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. శనివారం ముగింపు కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ సర్పంచ్ లను ఉద్దేశించి మాట్లాడుతూ... గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర అతి కీలకమైన దన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ చెప్పిన విధంగా గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి చెందినట్లని అన్న విషయాన్ని మనం గుర్తించాలని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమ పథకాలు ప్రజలకు చేరవేసే బాధ్యత ప్రజాప్రతినిధులదేనని కలెక్టర్ అన్నారు. పంచాయతీరాజ్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ గ్రామపంచాయతీల ఆర్థిక బలోపేతానికి కృషి చేయాలి అన్నారు. ఇంటి పన్నులు, వ్యాపార దుకాణాల పన్నులతో పాటు ఇతర ఆదాయ వనరులను సమకూర్చుకుంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సర్పంచులకు సూచించారు. గ్రామపంచాయతీ ఆర్థిక వనరులను పెంపొందించుకున్నట్లయితే సీసీ రోడ్లు, పారిశుధ్య పనులు, నీటి సమస్య లేకుండా చేయవచ్చునని కలెక్టర్ తెలిపారు. విబి జి రాంజీ (జాతీయ ఉపాధి హామీ) ద్వారా అంగన్వాడి, గ్రామప ంచాయతీ లలో ఉన్న సమస్యలు కూడా పరిష్కరించుకోవచ్చునని కలెక్టర్ తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎక్కడైనా నీటి సమస్య ఉంటే మోటార్లను మంజూరు చేసి నీటి సమస్య రాకుండా చూస్తామని అదేవిధంగా మిషన్ భగీరథ పనుల నిమిత్తం రవాణా సౌకర్యం కూడా కల్పించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో సామాజిక కార్యక్రమాలపై ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. బాల్య వివాహాలు, సామాజిక రుగ్మతలు, రోడ్ల ప్రమాదాలు వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ప్రజా ప్రతినిధులు పాఠశాలలు, అంగన్వాడీల నిర్వహణను బాధ్యతగా తీసుకొని పాఠశాలల్లో డ్రాప్ అవుట్ ను తగ్గించే విధంగా చూడాలని, అంగన్వాడీలో సామ్ మామ్ పిల్లలను గుర్తించి పోషక ఆహారం అందే విధంగా తరచుగా పర్యవేక్షిస్తూ ఉండాలని కలెక్టర్ సర్పంచులకు సూచించారు. ప్రజా పాలన ప్రగతి అమలు కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2వ తేదీన తప్పనిసరిగా ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 6 గ్యారంటీలలో భాగంగా రైతుబంధు, రైతు బీమా, ఇందిరమ్మ ఇల్లు, సన్న బియ్యం, రేషన్ కార్డుల పంపిణీ తదితర అంశాలను చర్చించి అందరి సహకారం తీసుకొని ప్రజా సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ సమావేశాలు నిర్వహించే క్రమంలో లేఅవుట్లు, భవన నిర్మాణ అనుమతులు తదితర అంశాలపై చర్చించి ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ ఉండాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సర్పంచులకు శిక్షణ ధృవీకరణ పత్రం అందించడం జరిగింది. శిక్షణ ముగింపు కార్యక్రమంలో జెడ్పి సీఈవో సుధీర్, డిపిఓ జయసుధ, శిక్షణ కార్యక్రమ మాస్టర్ ట్రైనీలు (ఎంపీడీవోలు) వినయ్ కుమార్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపేట లోని బాలసదనం మరియు వృద్ధాశ్రమంలను తనిఖీ చేసిన సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ .



**నారాయణపేట, మార్చ్,28(సమయం న్యూస్) :** తెలంగాణా రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ మరియు నారాయణపేట జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం నాడు నారాయణపేట పట్టణంలోని బాల సదనం మరియు వృద్ధాశ్రమం లను నారాయణపేట సీనియర్ సివిల్ జడ్జి వింధ్యా నాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ అనాథ పిల్లలని, వృద్ధులను ఆశ్రమ నిర్వాహకులు మంచిగా చూసుకోవాలని వారికి మౌలిక సౌకర్యాలు, ఆరోగ్య పరీక్షలు సక్రమంగా చేయించాలని తెలిపారు. హాజరు పట్టికను పరిశీలించి, అందరూ ఉన్నారా, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీశారు. సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని. ఆశ్రమ నిర్వాహకులకు న్యాయమూర్తి ఆదేశించారు. రోజు ఆహార దిన పట్టికను అడిగి వసతులను, దిన వస్తువులను ఆహార ధాన్యాల నాణ్యత మరియు త్రాగు నీరు, పరిశుభ్రత, రిజిస్టర్లను, సీసీటీవీ ఫుటేజ్ లను, మూవ్మెంట్ రిజిస్టర్స్, ఆఫీస్ ఆర్డర్స్ ప్రకారం అడ్మిషన్స్ తీసుకుంటున్నారా, ఆఫీసర్ ఆర్డర్ ప్రకారము సంబంధించిన వాళ్ళకు అప్పచెపుతున్నారా లేదా తగిన రిజిస్టర్లు పరిశీలించారు. రోజువారీ ఆహార దిన పట్టికను పరిశీలించి, వాటి ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని తెలిపారు. బాత్రూమ్స్, బెడ్ రూమ్స్ శుభ్రంగా ఉంచాలన్నారు. తదనంతరము పిల్లలకు మరియు వృద్ధులకు పండ్లను పంపిణీ చేశారు. వృద్ధుల అవసరాలను అడిగి తెలుసుకున్నారు.

# ఆడపిల్లలకు వాక్సిన్ తప్పనిసరి

● బిజెపి ఖమ్మం వన్ టౌన్ అధ్యక్షులు గడిల నరేష్



**ఖమ్మం , మార్చి 28 :( సమయం న్యూస్ )** ఆడపిల్లలకు వాక్సిన్ తప్పనిసరి అని భారతీయ జనతా పార్టీ ఖమ్మం వన్ టౌన్ అధ్యక్షులు గడిల నరేష్ అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా దేశం మొత్తం ఆడపిల్లల ఆరోగ్య విషయంలో ఇంటిపెద్దలా బాధ్యతను తీసుకుని ఎవరు కూడా ఆరోగ్య విషయంలో ఇబ్బంది పడకూడదని , అందులోను ముఖ్యంగా గర్భాశయ క్యాన్సర్ వలన ఎంతోమంది ఇబ్బంది పడుతున్నారని అట్టి వ్యాధి నిరోధించుటకు హ్యూమన్ పాపిలోమా వైరస్ వాక్సినేషన్ ప్రత్యేకంగా బాధ్యతగా తీసుకుని అన్ని గవర్నమెంట్ హాస్పిటల్ ల లో టీకాను అందుబాటులో ఉండేవిధంగా చర్యలు చేపట్టారని తెలిపారు. ఉచితం గాప్రతీ గవర్నమెంట్ హాస్పిటల్ లో నిర్దేశించిన 14-15 వయసు గల ఆడపిల్లలు వాక్సిన్ వేయించుకోవాలనితెలిపారు. అందులో భాగంగా ఈరోజు వారి పాప గడిల శ్రీనిధి కి వాక్సిన్ ను గవర్నమెంట్ హాస్పటల్ లో వేయించటం జరిగింది ఈ వాక్సిన్ నందు ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఇబ్బందులు లేవని హాస్పిటల్ వైద్యురాలు ప్రేమలత నాయక్ ని అన్ని విషయాలు అడిగి తెలుసుకుని నగరం లో కూడా ఇంకా అవగాహనను పెంచేవిధంగా చూడాలని కోరటం జరిగింది. ఈ కార్యక్రమంలో సిబ్బంది శివాని, శారదా, మదనకుమారి, షారుని పాల్గొన్నారు

# రోడ్డు విస్తరణ భాధితులకు అండగా ఉంటాం

● మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్





**కొడంగల్ మున్సిపల్, మార్చ్,28(సమయం న్యూస్) :** కొడంగల్ పట్టణ కేంద్రంలో రోడ్డు విస్తరణలో భాగంగా అధికారులు చిరు వ్యాపారుల డబ్బాలు తొలగించడంతో జీవనోపాధి కోల్పోయిన చిరు వ్యాపారులను ఆదుకుంటామని కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ భరోసా ఇచ్చినట్లు ఎంఐఎం పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్.బీ.గుల్షన్ తెలిపారు. శనివారం ఆయన చిరు వ్యాపారులతో మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్మన్ ను కలిసి వినతి పత్రం అందించారు. చిరు వ్యాపారుల సమస్యను మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ కు గుల్షాన్ వివరించారు. స్పందించిన మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ మాట్లాడుతూ..చిరు వ్యాపారులకు అండగా ఉంటానని, వారం రోజుల్లో కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బస్టాండ్ ముందు చిరు వ్యాపారులతో జీవనోపాధి పొందుతున్న వారిని గుర్తించి వారికి న్యాయం చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎస్.బీ.గుల్షన్ తో కలిసి చిరు వ్యాపారులు చైర్మన్ ను పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎండీ.సర్తాజ్ హుస్సేన్, సయ్యద్ మహమూద్, ఎండీ. జహంగీర్, ఎండీ.అక్తార్, ఎండీ.కబీర్, నారాయణ, సుందర్, సయ్యద్ అర్షద్ అలీ ఖద్రి తదితరులు పాల్గొన్నారు.

# ఇరువురు సైబర్ నిందితులఅరెస్టు



**ఖమ్మం, మార్చి 28 :( సమయం న్యూస్ ) :** ఆన్లైన్ లో ట్రేడింగ్, ఇన్వెస్ట్మెంట్ లో డబ్బులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి, సుమారు 2 కోట్లరూపాయలు మోసం చేసిన కేసులో ఇద్దరు నిందుతులను ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు ఆంధ్ర ప్రదేశ్ లోని వెస్ట్ గోదావరి జిల్లా, తణుకుపట్టణంలో అరెస్టు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ శనివారం ప్రకటించారు . కేసు వివరాలలోకి వెళితే ఖమ్మం జిల్లాకు చెందిన వ్యాపార వేత్త కి వాట్సాప్ లో పరిచయమైన వ్యక్తులు ఆన్లైన్ లో ఎఫ్ ఎక్స్ ప్రో కంపెనీలో ట్రేడింగ్, ఇన్వెస్ట్మెంట్ చేస్తే అధిక లాభాలు వస్తాయని ఆశచూపి వాట్సప్ ట్రేడింగ్ లింకుల ద్వారా సుమారు 2 కోట్ల రూపాయలుఇన్వెస్ట్మెంట్ చేసి మోసపోయిన కేసులో గాను 7 లక్షలు రూపాయిలు అకౌంట్ కి వెళ్ళిన అకౌంట్హోల్డర్సయిన ఎండి. సాదిక్ (35సం), శ్యామ్ బాబు (21సం) లను , తణుకులోఅరెస్టు చేసి ఖమ్మం సైబర్ క్రైం కోర్టులో హాజరు పరిచి, రిమాండ్ కి తరలించినట్లు తెలిపారు. విచారణలో ముఖ్య పాత్ర వహించిన సైబర్ క్రైమ్ డిఎస్పీ, సిహెచ్ ఆర్ వి ఫణిందర్, ఇన్స్పెక్టర్ కొండపర్తి నరేశ్ , ఎస్సై రశీజిత్కుమార్ , కానిస్టేబుల్స్ వెంకట కృష్ణరావు ,కిషన్ రావు, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

# ఈ నెల 31న తైబజార్ భహిరంగ వేలం

● మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్

● మున్సిపల్ చెర్మెన్ నందారం ప్రశాంత్ అదేశాలమేరకు



**కొడంగల్ మున్సిపల్, మార్చి 28(సమయం న్యూస్):** కొడంగల్ పట్టణం తైబజార్ భహిరంగ వేలం ఈ నెల 31న నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ తెలిపారు. కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ ఆదేశాల మేరకు కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని తైబజార్, పశువుల వాదశాల మరియు రహదారి భహిరంగ వేలం ఈ నెల 31మంగళవారం నిర్వహించడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. ఇట్టి వేలం పాటలో పాల్గొనే వారు ఈ నెల 30న సోమవారం రోజు సాయంత్రం 4గంటల లోపు పురపాలక సంఘం నందు దరఖాస్తు ఫారాలను సమర్పించవలేనని కమిషనర్ పట్టణ ప్రజలకు సూచించారు.

## జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పిల్లల దత్తత



**సిద్ధిపేట మార్చి28( సమయం న్యూస్) :** జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో సిద్దిపేట జిల్లాలో శనివారం రోజున 4 సంవత్సరాల బాబును ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లాకు చెందిన దంపతులకు మరియు 6 నెలల ఆడ శిశువును నిజామాబాద్ జిల్లాకు చెందిన దంపతులకు సిద్దిపేట జిల్లా కలెక్టర్ కే. హైమావతి చేతుల మీదుగా అధికారికంగా దత్తతను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ దత్తత తీసుకున్న తల్లిదండ్రులతో మాట్లాడుతూ పిల్లలను బాగా చదివించాలి తనకు ఇష్టమైన రంగంలో ప్రోత్సహం ఇవ్వాలి పిల్లల బంగారు భవిషత్ కు బాట వేసే పూర్తి బాధ్యత మీదే అని చెప్పడం జరిగింది మరియు జిల్లాలోని పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకోవాలనుకుంటే సిద్దిపేటలో గల శిశు గృహ/ జిల్లా బాలల పరిరక్షణ విభాగం ద్వారా అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలని తద్వారా ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిజప్త్ర శారద , బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ మమత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎ. రాము మరియు శిశు గృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర భూ రీ సర్వే (నక్ష) పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని భవాని కుంట తండాలో నక్ష సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్
- ఎంపిడిఓ కార్యాలయంలో నక్ష సర్వే పురోగతిని సమీక్షించిన కలెక్టర్



**వరంగల్ జిల్లా/వర్ధన్నపేట: మార్చి 28,( సమయం న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం భూ వివాదాల పరిష్కారం మరియు యాజమాన్య హక్కుల నమోదు కోసం చేపట్టిన సమగ్ర భూ రీ సర్వే (నక్ష) కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శనివారం వర్ధన్నపేట మున్సిపల్ పరిధిలోని భవానీకుంట తండాలో వివిధ శాఖల అధికారులతో పాటు సర్వే బృందాల సహకారంతో జిల్లా కలెక్టర్ పంట పొలాల్లో నేరుగా పర్యటించారు. ఈ సందర్భంగా సర్వే జరుగుతున్న భూముల సరిహద్దులు, కొలతలు మరియు సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సమగ్ర భూ సర్వేలో భాగంగా జియో కోఆర్డినేట్లు, డ్రోన్ సర్వే మరియు మ్యాపింగ్ సాంకేతికతలను వినియోగించి భూముల హద్దులను ఖచ్చితత్వంతో, ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్వేను పూర్తి చేయాలని సూచించారు. పైలట్ ప్రాజెక్ట్ కింద వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో నక్ష సర్వే చేపట్టి భూముల హద్దులు, మ్యాపింగ్ పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. సర్వేలో పాల్గొంటున్న అధికారులు, సిబ్బంది ఆయా భూములకు సంబంధించిన వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం వర్ధన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నక్ష సర్వేను సమర్థవంతంగా, వేగవంతంగా పూర్తి చేయడానికి పలు సూచనలు చేశారు. మున్సిపల్ పరిధిలోని 10,240 ఎకరాల వ్యవసాయ భూమిలో 6,379 ఎకరాలకు రీ సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. అలాగే మొత్తం 4,652 ఇండ్లకు గాను సర్వే పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని 158 బ్లాకులలో 102 బ్లాకుల్లో రీ సర్వే పూర్తయినట్లు తెలిపారు. మిగతా బ్లాకుల్లో కొనసాగుతున్న సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా భూముల కొలతల శాఖ అధికారి శ్రీనివాసులు, ఆర్డీవో సుమ, తహసిల్దార్ విజయ్ సాగర్, ఎంపీడీవో వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ సుధీర్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 6 వ తేదీ లోపు అప్లై చేసుకోండి

-- జర్నలిస్టులకు అక్రెడిటేషన్ గడువు



**హైదరాబాద్,మార్చ్ 28:**తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టులు అక్రెడిటేషన్ కార్డుల కోసం ఏప్రిల్ 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్ ప్రియాంక సూచించారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆమె పలు వివ రాలు వెల్లడించారు. జర్నలిస్టులు తమ యాజమాన్యాల నుంచి పొందిన సిఫార్సు లేఖతో పాటు అవసరమైన పేపర్ కటింగులు విద్యార్హతల సర్టిఫికెట్లు ఇండిపెండెంట్ జర్నలి స్టులు కటింగ్లతో పాటు సంబంధిత ఎడిటర్ పత్రికకు వార్తలు రాసినట్లు ధ్రువీకరించే లేఖ సంబంధిత అర్హత పత్రాలను జత చేయడంతో పాటు తాము వేరే ఇతర వృత్తులలో అనగా సొసైటీ చైర్మన్, డైరెక్టర్ ప్రభుత్వ ఉద్యోగం, న్యాయవాద వృత్తి, సర్పంచ్ తదితర ఇతరత్రా ఏ పదపదవుల్లో కొనసాగడం లేదని సెల్ఫ్ డిక్లరేషన్ జతచేసి హార్డ్ కాపీని సంబంధిత డిపిఆర్ఓ కార్యాలయాలలో అందజేయాలని, అప్లికేషన్‌ను పూర్తి చేసి ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికే అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు స్పష్టం చేశారు. తప్పుడు సమాచారం ఇచ్చిన వారిపై సంబంధిత అధికారులకు కఠిన చర్యలకై ఆదేశాలు ఇవ్వనున్నట్లు స్పెషల్ కమిషనర్ వెల్లడించారుఇప్పటికే రాష్ట్ర అక్రెడిటేషన్ కమిటీ రెండు సార్లు సమావేశమై జీఓ అమలు, విధి విధానాలపై చర్చించిందని, అందరికీ సమాన అవకాశాలు కల్పించే దిశగా ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటికే వచ్చిన దరఖాస్తులను సమీక్షిస్తూ, అర్హత ప్రమాణాలు పూర్తి చేసిన జర్నలిస్టులకు కార్డులు జారీ చేసే చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

# లక్ష్య చేధన కు నిరంతర సాధన చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.
- పెదిరి పాడ్ లో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా
- తనిఖీ చేసిన- జిల్లా కలెక్టర్



**మద్దూరు మండలం, మార్చ్ 28(సమయం న్యూస్) :** విద్యార్థులు జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, ఆ లక్ష్య చేధన కు నిరంతర సాధన చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శనివారం ఆయన నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలోని పెదిరి పాడ్ గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ పాఠశాలలోని వంట గది, మరుగు దొడ్లు, స్టాక్ రూమ్, ఆర్వో ప్లాంట్ ను పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని ఎనిమిదో తరగతి గదిలోకి వెళ్ళి విద్యార్థినిలతో ముచ్చటించారు. పాఠశాలలో భోజనం, ఇతర వసతి సౌకర్యాలు, చదువు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అన్ని బాగున్నాయని విద్యార్థినిలు కలెక్టర్ కు తెలిపారు. ప్రతీ వారం సినిమా చూస్తున్నారా అని ఆరా తీశారు. ఇకపై ప్రతీ శనివారం విద్యార్థినులకు పాఠశాలలో మంచి సందేశాత్మక సినిమాలను చూపించాలని ఎస్. వో కు ఆయన సూచించారు. తరగతి గదిలోని విద్యార్థినుల జీవితాశయం, లక్ష్యం గురించి ఒక్కరిని అడగడంతో కొందరు ఐ ఏ ఎస్, ఐ పీ ఎస్, మరికొందరు డాక్టర్ అవుతామని తెలపగా ఆర్కిటెక్, సైంటిస్ట్ లు ఎవరూ కారా అని ప్రశ్నించారు. కొత్త కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్ళాలని సూచించారు. వారి వారి పుస్తకాల్లో విద్యార్థినుల పేర్లు రాయించారు. తరవాత పేర్ల ముందు వారు ఏం కావాలని అనుకుంటున్నారో ఆ డీజిగ్ నేషన్ ను రాయించి, రోజూ పుస్తకం తెరిచి చూస్తే తాము భవిష్యత్తులో ఆ డీజిగ్ నేషన్ చేరుకునేందుకు కష్టపడి చదవాలని తెలిపారు. కేవలం కలెక్టర్, డాక్టర్, ఇంజినీర్ అవుతాం అనుకుంటే సరిపోదని, ఆ స్థాయిని చేరుకునేందుకు ప్రణాళిక ప్రకారం చదువు కోవాలన్నారు. అనంతరం అక్కడున్న వైద్యులతో మాట్లాడి పాఠశాలలో విద్యార్థినిలు ఏ ఏ రుగ్మతలతో బాధపడుతున్నారని, వారిలో ఏ ఏ ఆరోగ్య సమస్యలు గుర్తించారని అడిగి తెలుసుకున్నారు. ఎనీమియా సమస్యతో ఉన్న విద్యార్థినిలు ఎక్కువగా ఉన్నారని, అందుకు తగిన మందులను ఇస్తున్నామని,ఆహారాన్ని పెట్టిస్తున్నామని వైద్యులు కలెక్టర్ కు తెలిపారు. మొత్తానికి పాఠశాలలో అన్ని బాగున్నాయని, పాఠశాలలో మరుగు దొడ్లు శుభ్రంగా ఉన్నాయని, ఆవరణ, వంటగది, తరగతి గదులు పరిశుభ్రంగా ఉన్నాయని కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

# నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని ఎలాంటి కొరత లేదు

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.

**భూపాల పల్లి మార్చి28( సమయం న్యూస్) :** శనివారం ఐడిఓసి కార్యాలయంలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఎస్పి సంకీర్త్ తో కలిసి జిల్లా ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్, పెట్రోల్, డీజిల్ పై పటిష్ట పర్యవేక్షణ కొనసాగాలని ఆదేశించారు. గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లు వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో మొత్తం లక్షా 20 వేల మంది గ్యాస్ వినియోగిస్తున్నారని తెలిపారు. సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, ఆసుపత్రులకు యధావిధిగా గ్యాస్ సరఫరా జరుగుతుందని, ఆయా శాఖల అధికారులు. పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పెట్రోల్, డీజిల్ అత్యవసర సేవలకు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలాల్లో డిటీలు, ఎస్ ఐ.లు పర్యవేక్షణ చేస్తున్నారని, వాహనాలు తనిఖీ చేసి కేసులు నమోదు చేయాలని ఆర్టిఓ కు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులు, పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల బుకింగ్ సైకిల్ అమలులో ఉందని, బుకింగ్ క్రమం ప్రకారమే సిలిండర్ సరఫరా జరుగుతోందని తెలిపారు. సిలిండర్ డెలివరీ సమయంలో ఓటిపి విధానం తప్పనిసరిగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల అమాంతం బుకింగ్‌లు పెరగడం వల్ల డిమాండ్ అధికమవుతోందని గుర్తించిన కమిటీ, ప్రజలు అవసరానికి మించి బుకింగ్ చేయకుండా, నిల్వలు చేయకుండా ఉ ండాలని సూచించారు. పాఠశాలలు, హాస్టళ్లలో ఎల్పీజీ వినియోగంపై వెల్ఫేర్ అధికారి, డీఈఓ పర్యవేక్షణ చేయాలని, వార్డెన్లు, హెడ్‌మాస్టర్లు సరైన వినియోగం చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడైనా కొరత ఉంటే వెంటనే తెలియజేయాలని సూచించారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు కూడా సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. బ్లాక్ మార్కెటింగ్, అనధికార రీఫిల్లింగ్ సెంటర్లు, అక్రమ నిల్వలు మరియు విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్యాస్, పెట్రోల్, డిజిల్ నిల్వలను ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ, పోలీస్ శాఖతో కట్టుదిట్టమైన అమలు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య అవస రాలకు అక్రమంగా వినియోగించడం, మళ్లింపు, నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి మొత్తం 19 కేసులు నమోదు చేసినట్లు తెలి పారు. హోటళ్లు, ధాబాలలో అక్రమంగా వినియోగిస్తున్న సిలిండర్లను స్వాధీనం చేసుకుని, సంబంధితులపై నిత్యావసర వస్తువులు చట్టం 1955 సెక్షన్ 6ఏ కింద కేసులు నమోదు చేశామన్నారు. కమిటీ కఠినంగా వ్యవహరించాలని నిరంతర తనిఖీలు, అప్రమత్తత ప ద్వారా అక్రమాలను పూర్తిగా అరికట్టాలని సూచించారు. అధి కారులు పారదర్శక సరఫరా, సమర్థవంతమైన పర్యవేక్షణ, సమయానుకూల నివేదికలు సమర్పించాలని ఆదేశి ంచారు. ఎస్పి సంకీర్త్ మాట్లాడుతూ జిల్లాలో పెట్రోల్, డీజిల్ , గ్యాస్ డీలర్లు తో సమావేశం నిర్వహించామని తెలిపారు. ప్రజలు సామాజిక మాధ్య మాల్లో వచ్చే అసత్య ప్ర చారాలు నమ్మి ఆందోళన చెందొద్దని సూచించారు. జిల్లాలో సరి పడా నిల్వలు ఉన్నాయని ప్రజలు భయప డాల్సిన అవసరం లేదని అన్నారు. అసత్య ప్రచారాలపై పర్యవేక్షణ ఉంటు ందని ఆయన స్పష్టం చేశారు. ఎలాంటి రద్దీ లేకుండా పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడోన్లు వద్ద పటిష్ట నిఘా .కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ డీఈఓ రాజేందర్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, సంక్షేమ శాఖల అధికారులు, హెచ్పీసీఎల్ సేల్స్ ఆఫీసర్ అమర్త్యదాస్ తదితరులు పాల్గొన్నారు.



## రోడ్ల పై పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- రోడ్డు ప్రమాదాలను నివారించాలి ...మత్తు పదార్థాలపై నిఘా పెంచాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ మార్చి28( సమయం న్యూస్). :** రోడ్ల పై పెండింగ్ పనులు పూర్తి చేసి రోడ్డు ప్రమాదాలు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో రోడ్ సేఫ్టీ, మత్తు పదార్థాల నిర్మూలనపై సమావేశ నిర్వహించారు .. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్క వాహనదారుడు సకాలంలో క్షేమంగా ఇంటికి చేరాలన్నారు. రోడ్ల పై పెండింగ్ లో ఉన్న సి సి కెమెరాలు సిగ్నల్స్ విద్యుత్ దీపాలు సైన్ బోర్డులు, గుంతలు పూడ్చి పెండింగ్ పనులు లేకుండా చూడాలన్నారు. విద్యాసంస్థల్లో, కళాశాలలో రోడ్డు భద్రత నియమాల గూర్చి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా ద్విచక్ర వాహనదారులకు జరుగుతున్నందున వాహన దారులు నియమాలు పాటించడం, హెల్మెట్ ధరించడం, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండడం, రోడ్ల పై ఉన్న వివిధ సిగ్నల్, మార్కింగ్ గురించి తెలుసుకొని జాగ్రత్తగా ప్రయాణం చేయాలని సూచించారు. మత్తు పదార్థాలపై నిఘా పెంచాలన్నారు. మత్తుకు అలవాటు పడి యువకులు భవిష్యత్తు కోల్పోకుండా చూడాలన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాలు నివారించవచ్చని, విద్యాలయాల్లో,మెడికల్ షాపుల్లో, పరిశ్రమలలో నిరతరం మత్తు పదార్థాలపై నిఘా పెట్టామన్నారు. మత్తు తో జీవితాలు చిత్తు అయిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్,జిల్లా వైద్య అధికారి శ్రీరామ్, డి ఎస్పీ లు, మున్సిపల్ కమిషనర్లు,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మారం మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ధర్మారం, మార్చి-28( సమయం న్యూస్) :** శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ధర్మారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ధర్మారం మండల తహసిల్దార్ కార్యాలయం, కేజీబీవీ ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ సకాలంలో జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. భూ భారతి ఆన్ లైన్ దరఖాస్తులు పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కేజీబీవీ లో బాలికలకు నాణ్యమైన ఆహారం అందించాలని అన్నారు. ప్రతి ఒక్కరికి మంచి విద్యా ప్రమాణాలు అందే విధంగా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ తెలిపారు. కేజీబీవీ రినోవేషన్ పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట తహసిల్దార్ శ్రీనివాస్,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపూర్ ప్రైమరీ పాఠశాలకు డ్యూయల్ డెస్క్ లను పంపిణీ చేసిన కళింగ బ్రీడింగ్ ఫామ్

- సర్కారు బడులను సమాజమే కాపాడుకోవాలి
- జగదేపూర్ ఎంఈఓ సైదులు
- తిమ్మాపూర్ అండగా ఉంటాం కళింగ బ్రీడింగ్ ఫామ్ అధినేత కొత్త సురేందర్ రెడ్డి



**సమయం న్యూస్ గజ్వేల్ మార్చి 28 :** సర్కారు బడులను సమాజమే కాపాడుకోవాలి, అది పౌరులుగా మనందరి బాధ్యత అని జగదేపూర్ ఎంఈఓ సైదులు అన్నారు. మండల ప్రాథమిక పాఠశాల తిమ్మాపూర్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోసానిపల్లి రాజు ఆధ్వర్యంలో కలింగా బ్రీడింగ్ ఫామ్ అధినేత కొత్త సురేందర్ రెడ్డి విద్యార్థులకు అవసరమైన 35 డ్యూయల్ డెస్క్ బెంచీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొత్త సురేందర్ రెడ్డి మాట్లాడుతూ నేను కూడా ప్రభుత్వ పాఠశాలలోని చదువుకున్నానని ,సామాజిక బాధ్యతగా పేద విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలకు డ్యూయల్ డిస్కను ఇచ్చానని,ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నది అన్నారు. గ్రామ సర్పంచ్ పోసానిపల్లి రాజు మాట్లాడుతూ తాను తొలి ప్రాధాన్యతగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతులను కల్పించాలని నిర్ణయించుకున్నాను అన్నారు.అందులో భాగంగానే సురేందర్ రెడ్డి గారిని అడగడం,వారు మారు ఆలోచన చేయకుండా సహకరించారన్నారు. ఆ ప్రాథమిక విద్యయే చాలా కీలకమని దీనిని బలోపేతం చేయడమే తన ప్రథమ కర్తవ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ ధీకొండ శ్రీశైలం, ఉపాధ్యాయులు కిరణ్ ,సరిత వర్గల్ ఉపాధ్యాయులు అన్న వెల్లి మల్లికార్జున్ ఉపసర్పంచ్ నాగరాజు గ్రామ విద్యా కమిటీ అధ్యక్షులు కొంతం కృష్ణంరాజు,వార్డు మెంబర్లు పొసాన్ పల్లి కిష్టయ్య, వీరభత్తిని నవనిత కుమార్ విశ్రాంత ఉపాధ్యాయులు యాదగిరి, గ్రామ శ్రేయోభిలాషులు శ్రీశైలం కొంతం లక్ష్మయ్య దువ్వల యాదగిరి బోడ్ల కనకయ్య కొంతం కిష్టయ్య పోచంపల్లి రమేష్ పోసానిపల్లి కనకయ్య పూర్వ విద్యార్థులు కొంతం బాలరాజ్ కొంతం రాజు పాల్గొనడం జరిగింది.

# జిల్లా కోర్టు సముదాయంలో నేషనల్ లోక్.అదాలత్ కార్యక్రమం



**వికారాబాద్, మార్చ్,28(సమయం న్యూస్) :** జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు సముదాయంలో నేషనల్ లోక్. అదాలత్ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రిన్సిపల్ ఒ సెషన్ జడ్జ్ సీహెచ్. చంద్ర కిషోర్ ముఖ్య అతిథిగా, జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా, ఘా అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి జడ్జ్ మాట్లాడుతూ, లోక్ అదాలత్ ద్వారా వివాదాలను త్వరితగతిన, సౌహార్దపూర్వకంగా పరిష్కరిం చుకోవడం సాధ్యమవుతుందని తెలిపారు. కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులను తగ్గించడంలో లోక్ అదాలత్ కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అలాగే చిన్న చిన్న వివాదాలను పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకోవడం వల్ల సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతాయని పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా,ఐపీఎస్ మాట్లాడుతూ, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ న్యాయవ్యవస్థకు సహకరిస్తుందని తెలిపారు. లోక్ అదాలత్ వంటి వేదికలు ప్రజలకు న్యాయం త్వరగా అందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రజలు చట్టపరమైన సమస్యలను సత్వరంగా పరిష్కరించుకోవడానికి ముందుకు రావాలని, పోలీస్ మరియు న్యాయ వ్యవస్థపై విశ్వాసం ఉంచాలని కోరారు. ముఖ్యంగా రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, రోడ్డు ప్రమాద భీమా కేసులు మరియు సివిల్ వివాదాలను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం వల్ల ఇరు వర్గాల మధ్య సత్సంబంధాలు నెలకొంటాయని ఎస్పీ వివరించారు. కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ తగ్గడమే కాకుండా, పోలీసు స్టేషన్లలో నమోదైన కేసులను సామరస్యంగా ముగించుకోవడానికి ఇదొక సువర్ణావకాశమని ఆమె తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న పోలీస్ అధికారులు లోక్ అదాలత్ విజయవంతం కోసం చురుగ్గా పని చేస్తున్నారని తెలిపినారు. అనంతరం ముఖ్య అతిథిలు మెడియోషన్ పైన ప్రజలకు అవగాహన కల్పించడానికి కాక్షిదారులతో కలసి లఘు చిత్రాన్ని విక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జ్ ఎం. వెంకటేశం, జూనియర్ సివిల్ జడ్జ్ శాంతి లత, అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ వైష్ణవి సభపతి,డీ సీ ఆర్ బి డీఎస్పీ జానయ్య, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి,ద్వితీయ శ్రేణి మేజిస్ట్రేట్ నర్సింహులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీస్ శాఖ అధికారులు, న్యాయవాదులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# రబీ సీజన్ కు సంబంధించి వరి ధాన్య సేకరణలో లక్ష్యాలను అధిగమించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరి అధికారులకు సూచించారు.



**వికారాబాద్, మార్చ్,28(సమయం న్యూస్) :** రబీ సీజన్ కు సంబంధించి వరి ధాన్య సేకరణలో లక్ష్యాలను అధిగమించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరి అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేటులోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో రబీ సీజన్ కు సంబంధించి వరి ధాన్యం సేకరణకై సంబంధిత అధికారులతో కార్యాచరణ ప్రణాళికపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...రబీ సీజన్ సంబంధించి వరి ధాన్య సేకరణకు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. రబీ 2025-26 వరి ధాన్య సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. జిల్లాలోని 129 వరి ధాన్యం సేకరణ కేంద్రాలను సంబంధిత అధికారులు సందర్శించి మౌలిక సదుపాయాల కల్పనకై చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి వరి ధాన్య సేకరణ సజావుగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని ఆమె తెలిపారు. వివిధ ఏజెన్సీల ద్వారా లక్ష మెట్రిక్ టన్నుల దొడ్డు రకం వరి ధాన్యం, పదివేల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యాన్ని సేకరించే దిశగా అధికారులు పనిచేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రాములు నాయక్,జిల్లా అదనపు జిల్లా పౌరసరఫరాల అధికారి సుదర్శన్,జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, జిల్లా రవాణా అధికారి వెంకట్ రెడ్డి, డి సి ఎం ఎస్ బిజినెస్ మేనేజర్ వెంకట రమణారెడ్డి, డిప్యూటీ డిఆర్డిఏ నరసింహులు, రవాణా కాంట్రాక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వారి ఆధ్వర్యంలో స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశాలు..

- జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి ఎం.ఏ సత్తార్



**వికారాబాద్, మార్చ్,28(సమయం న్యూస్) :** రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వారి ఆధ్వర్యంలో స్పోర్ట్స్ స్కూల్ లో ప్రవేశాలు, మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు. జిల్లాస్థాయిలో 30 మార్చ్ 2026 బ్లాక్ గ్రౌండ్ వికారాబాద్ నందు ఎంపికలు నిర్వహించబడును. ఉదయం 9:30 గంటల లోపు రిపోర్ట్ చేయగలరు.ధ్రువీకరణ పత్రాలు:- ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ఫామ్,ఆధార్ కార్డ్, బర్త్ సర్టిఫికెట్, 3తీఃఏ క్లాస్ బోనఫైడ్ సర్టిఫికెట్ మరియు ప్రోగ్రెస్ కార్డ్, కమ్యూనిటీ సర్టిఫికెట్, ఐదు పాస్పోర్ట్ సైజ్ ఫొటోస్.

## విద్యార్థిని విద్యార్థుల స్కాలర్ షిప్ దరఖాస్తు గడువును పొడిగించిన రాష్ట్ర ప్రభుత్వం

- పి.కమలాకర్ రెడ్డి జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ-వికారాబాద్ జిల్లా



**వికారాబాద్, మార్చ్,28(సమయం న్యూస్) :** ఈ నెల 31.03.2026 తో ముగియనున్న విద్యార్థిని విద్యార్థుల స్కాలర్ షిప్ దరఖాస్తు గడువును,పూర్తి స్థాయిలో దరఖాస్తులు చేసుకోనందున రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్ షిప్ దరఖాస్తు తేదిని 20.04.2026 వరకు పొడగించడం జరిగింది, కావున వికారాబాద్ జిల్లాకు చెందిన అర్హులైన యస్ సి, యస్ టి, బి సి మరియు మైనారిటీ (ూజ,ూ,దీజ డ వీఱఅశీతీఁఎ) విద్యార్థిని విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మరియు అన్ని ప్రభుత్వ,ప్రైవేటు మరియు ఎయిడెడ్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు ఇట్టి విషయం పట్ల అవగాహన కల్పించాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి పి.కమలాకర్ రెడ్డి తెలిపారు. స్కాలర్ షిప్ దరఖాస్తు నందు ఎవైన సాంకేతిక సమస్యలు తలేత్తిన లేదా పూర్తి వివరాలకు సమీకృత కలెక్టర్ భవనం నందు గల సంభందిత యస్ సి,యస్ టి, బిసి మరియు మైనారిటీ (ూజ, ూ,దీజడవీఱఅశీతీఁఎ) శాఖల కార్యాలయాలను సంప్రదించగలరని తెలిపారు. మరిన్ని వివరాలకు 9948663053 నందు సంప్రదించగలరు.

# నారాయణపేట జిల్లా కోర్ట్ ప్రాంగణంలో రాజి మార్గం ద్వారా 5149 కేసులు కొట్టివేత

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు

**నారాయణపేట, మార్చ్,28(సమయం న్యూస్) :** నారాయపేట జిల్లా కోర్ట్ ప్రాంగణంలో రాజి మార్గం ద్వారా 5149 కేసుల కొట్టివేత జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు.శనివారం జాతీయ న్యాయ సేవాధికార ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా న్యాయ సేవ సంస్థ లీగల్ సర్వీసెస్ ఆథారిటీ ఆధ్వర్యంలో నారాయపేట జిల్లా కోర్ట్ ప్రాంగణంలో 5 బెంచులను ఏర్పాటు చేసి, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కం చైర్మన్ లీగల్ సర్వీసెస్ ఆథారిటీ నారాయణపేట బోయ శ్రీనివాసులు మరియు లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి కం సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్, జూనియర్ సివిల్ జడ్జి సాయి మనోజ్, మరియు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కే.అవినాష్ మరియు సుష్మిత హాజరై శనివారం కోర్టు ఆవరణలో జరిగిన లోక్ అదాలత్ లో అన్ని కోర్టు పరిధిలో 5149 కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించమని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. జిల్లాలో 14 పోలీస్ స్టేషన్లతో పాటు రెండు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల (కోస్గి, నారాయణపేట) పరిధిలో ఉన్న కేసులకు న్యాయవాదులు సహకరించి పరిష్కారానికి కృషి చేశారు. కాగా మొత్తం కేసుల పరిష్కారానికి గాను రూ. 22,99,217=00 ఆదాయం ప్రభుత్వానికి సమకూరిందని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘువీర్, కె నర్సిములు,కే. సత్యనగరాయణ గౌడ్ ,వినోద్ కుమార్, సురేంద్ర చారి న్యాయవాదులు మరియు కక్షిదారులు, కోర్ట్ పోలీసులు పాల్గొన్నారు.

# డ్రగ్స్, గంజాయిని యువత దరిచేరనీయవద్దు

- గజ్వేల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మూల స్వాతి గౌడ్



**సమయం న్యూస్ గజ్వేల్, మార్చి 28:** డ్రగ్స్, గంజాయిని యువత దరిచేరనీయవద్దని గజ్వేల్ అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మూల స్వాతి గౌడ్ పిలుపునిచ్చారు. గజ్వేల్ రన్నర్స్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 12, ఆదివారం రోజున ఉదయం 6 గంటలకు చేపట్టనున్న ప్రోమో రన్ పోస్టర్ ను వారు కోర్టులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు రోజూ వారీ జీవితంలో వ్యాయామం, యోగా, క్రీడలపై ఆసక్తి పెంచుకుని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ప్రస్తుత యువత గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. గజ్వేల్ రన్నర్స్ చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గజ్వేల్ రూరల్ సీఐ రవిరాజు, తొగుట సీఐ ఎస్కే లతీఫ్, ఎస్ఐలు అరుణ్, మహిపాల్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, రఘుపతి, మానస, కృష్ణారెడ్డి, కోర్టు సూపరింటెండెంట్లు జ్యోతినాథ్ రెడ్డి, హనుమంతరెడ్డి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అష్టకాల కిరణ్ సాగర్ రావు, ప్రధాన కార్యదర్శి కరుణాకర్, న్యాయవాదులు పార్థసారధి రాజు, హరికృష్ణ పోస్టర్లను ఆవిష్కరించారు. వారితో ఈ కార్యక్రమంలో రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు జనార్ధన్, నిఖిల్ రెడ్డి, జంగం రమేష్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, కరుణాకర్, సత్యం, ఆంజనేయులు, నరేష్ గౌడ్, ముస్తఫా, అష్రఫ్ తదితరులు ఉన్నారు.

# పోచమ్మకు బోనాలు



**రాయపోల్, మార్చి 28:** రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని శనివారం మహిళలు భక్తిశ్రద్ధలతో పోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. గ్రామంలోని పోచమ్మ గుడికి సంప్రదాయ దుస్తుల్లో అలంకరించుకున్న మహిళలు తలపై బోనం లను మోసుకుంటూ ఊరేగింపుగా వెళ్లారు.బోనాలు పండుగలో భాగంగా మహిళలు పాలు, బెల్లంతో అన్నం వండి కొత్త కుండలో నింపి, పసుపు, కుంకుమ, వేప ఆకులతో అలంకరించి దీపం వెలిగించి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా డప్పుల మేళంతో మహిళలు భక్తి గీతాలు పాడుతూ నృత్యాలు చేశారు.గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామానికి శాంతి, సంపదలు కలగాలని భక్తులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

## అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ (ఐఏఎస్) ను మర్యాదపూర్వకంగా కలిసినపూడూర్ మండల తాహేసిల్దార్ బి విజయ్ కుమార్



**వికారాబాద్, మార్చి,28(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా( స్థానిక సంస్థల) అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ (ఞూూ) ను (శనివారం) కలెక్టరేట్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క (పుష్ప గుచ్ఛలు) అందించిన పూడూర్ తహేసిల్దార్ బి.విజయ్ కుమార్.

## బాయిమిది తండాలో తండ్రిని చంపిన కొడుకు



**పెద్దముల్ మండలం, మార్చ్,28(సమయం న్యూస్) :** తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండలంలోని బాయిమీది తండాలో ఈ సంఘటన కలకలం రేపింది. తాండూరు రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తండాకు చెందిన రాథోడ్ లోక్య నాయక్, బిక్కి బాయి దంపతులకు ముగ్గురు సంతానం. లోక్య నాయక్ మద్యానికి బానిసై తరచుగా భార్య బిక్కిబాయిని, ఇంట్లోనే ఉంటున్న చిన్న కుమార్తెను వేధిస్తుండేవాడు. శుక్రవారం ఉదయం కూడా లోక్య నాయక్ తన భార్య, కుమార్తెపై విచక్షణారహితంగా దాడి చేశాడు. భర్త వేధింపులు భరించలేక తల్లి బిక్కి బాయి వెంటనే హైదరాబాద్‌లో ఆటో నడుపుకుంటున్న తన కుమారుడు రాథోడ్ సునీల్ నాయక్‌కు తెలిపింది. విషయం తెలుసుకున్న సునీల్ నాయక్ హైదరాబాద్ నుండి స్వగ్రామానికి చేరుకున్నాడు. తన తల్లి, చెల్లెలిని ఎందుకు కొడుతున్నావంటూ తండ్రిని నిలదీశాడు. తండ్రి కొడుకుల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో సునీల్ నాయక్ ఇంట్లో ఉన్న గొడ్డలిని తీసుకుని తండ్రి మెడ, దవడ, తల వెనుక భాగంలో బలంగా నరికాడు. లోక్య నాయక్ రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతూ ప్రాణాలు విడిచాడు. సమాచారం తెలుసుకున్న రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, పెద్దేముల్ ఎస్సై ప్రశాంత్ వర్ధన్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తండ్రిని హత్య చేసిన సునీల్ నాయక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరులోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని శనివారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

## చట్టాల గురించి అవగహన కలిగి ఉండాలి



**ఊట్కూరు మండలం, మార్చ్,28(సమయం న్యూస్) :** ఊట్కూరు మండల వికలాంగుల సమాఖ్య కార్యాలయంలో న్యాయ అధికార సేవ సవస్త నారాయణపేట అధ్వర్యంలో న్యాయ సదస్సు నిర్వహించడం జరిగింది ప్రతి ఒక్కరికీ రాజ్యాంగంలో సమానంగా హక్కులు కల్పించబడ్డ వి ఎవరూ ఎక్కువ కాదు తక్కువ కాదు అలా ఎవరైనా వివక్ష చూపిన చట్ట ప్రకారం శిక్షిర్యులు ఔతారు 18 సం అయినా తరవాత పెళ్లి నిర్ణయించాలి అలా కాదని మైనర్ వివాహాలు ప్రోత్సహిస్తే చట్ట ప్రకారం శిక్షించబడుతారు. పిల్లలు. సమస్యలు ఉంటే 1098 ఫోన్ చేసి వివరాలు చెప్పాలని 100 కాల్ చేసి పెద్దవారి సమస్యలు. చెప్పాలని న్యాయ పరమైన సలహాలు సూచనలు కావాలంటె 15100 కి ఫోన్ చేసి వివరాలు చెప్పాలని పెర లీగల్ వాలంటీర్ కె నారాయణ అవగహన కల్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు పంచాయతీ కారోబర్ కనకప్ప ఏ పి ఎం వనిత కుమారీ మండల వికలాంగుల సమాఖ్య సీసీ నర్సింగమ్మ బిజ్వర్ నర్శింగమ్మ పి హెచ్ సి విద్యార్థులు, పెరెంట్స్ పాల్గొన్నారు

## కమనీయం... శ్రీ సీతారాముల కళ్యాణం





**రాయపోల్, మార్చి 28:** రాయపోల్ మండల కేంద్రంలో నిర్వహించిన శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి శ్రీ సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకలు భక్తుల హర్షధ్వానాలు, మంగళ వాయిద్యాల నడుమ అత్యంత ఘనంగా నిర్వహించారు.

పురోహితులు వేదమంత్రాల మధ్య శ్రీ సీతారాముల దివ్య కల్యాణాన్ని నిర్వహించగా, భక్తులు పెద్ద ఎత్తున హాజరై దర్శించుకున్నారు. కళ్యాణ వేడుక సందర్భంగా ఆలయ ప్రాంగణం విద్యుత్ దీపాలతో, పుష్పాలతో అలంకరించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయడంతో పాటు, అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జిల్లాలో 1655 KL ఇంధన నిల్వలు సిద్ధం

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు




**పెద్దపల్లి, మార్చి 28( సమయం న్యూస్) :** జిల్లాలో పెట్రోల్ (మీూ), డీజిల్ (ూణ) నిల్వలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. ఆయిల్ కంపెనీల సేల్స్ అధికారుల నివేదికల ప్రకారం జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధన సరఫరా ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగుతోందన్నారు. జిల్లాలో మొత్తం 108 పెట్రోల్ బంకులు ఉండగా, రోజువారీ సగటు విక్రయాలు 255 కిలోలీటర్లు నమోదవుతున్నాయని తెలిపారు. ఇందులో పెట్రోల్ 82 ఖూ, డీజిల్ 173 ఖూగా ఉన్నాయి. గడిచిన రోజున 240 ఖూ ఇంధనం విక్రయించబడగా, ఇందులో పెట్రోల్ 78 ఖూ, డీజిల్ 162 ఖూగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో మొత్తం 1655 ఖూ ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఇందులో పెట్రోల్ 624 ఖూ, డీజిల్ 1031 ఖూగా ఉన్నాయని తెలిపారు. అన్ని ఆయిల్ కంపెనీలు (×ూజూ, ూజూ, దీూజూ) ద్వా సరఫరా సాధారణంగా కొనసాగుతోందని, ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా అవసరమైన మేరకు మాత్రమే ఇంధనం వినియోగించాలని కలెక్టర్ సూచించారు.

## జిల్లా కేంద్రం లో జిల్లా కోర్ట్ ఆవరణలో నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం

లో పాల్గొనే నిమిత్తం మహబూబ్ నగర్ కు విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి. సామ్ కోషి,రాష్ట్ర హై కోర్ట్ న్యాయ మూర్తి ఎన్.వి. శ్రావణ్ కుమార్ లకు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎన్.ప్రేమలత, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాలు ఆర్‌డబి అతిథి గృహం వద్ద పుష్ప గుచ్ఛం, మొక్క అంద చేసి ఘన స్వాగతం పలికారు. ఆర్‌డబి అతిథి గృహం వద్ద హై కోర్ట్ న్యాయమూర్తులు పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు.

# విద్యా కార్యక్రమాలపై కలెక్టర్ సమగ్ర సమీక్ష



**నారాయణపేట, మార్చ్,28(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లాలో అమలవుతున్న వివిధ విద్యా కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ శనివారం సాయంత్రం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో సమగ్ర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా రంగంలో జరుగుతున్న కార్యక్రమాల అమలు, వాటి ప్రభావం మరియు నాణ్యతా ప్రమాణాలపై విశ్లేషణాత్మకంగా చర్చించారు. సమీక్షలో భాగంగా జిల్లాలో ప్రభుత్వం మరియు స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో అమలవుతున్న ముఖ్యమైన కార్యక్రమాలపై వివరాలు సేకరించారు. వాటిలో ముఖ్యంగా: ఆలోకిట్ ఫౌండేషన్ ద్వారా ఎఫ్ ఎల్ ఎన్ (Foundational Literacy and Numeracy) కార్యక్రమాలకు అందిస్తున్న సహకారం, అలాగే స్వతః ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమాలు, ఫ్యూచర్ డాట్స్ ద్వారా కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు, డిజిటల్ ఈక్విటీ ద్వారా విద్యార్థులకు డిజిటల్ అక్షరాస్యత అభివృద్ధి, ఆలోకిట్ ద్వారా యంగ్ ఆరేటర్స్ క్లబ్స్ నిర్వహణ, ఇన్ క్విలబ్ ఫౌండేషన్ ద్వారా టీ మేకర్స్ స్పేస్ మరియు ఏ టీ ఎల్ (Atal Tinkering Lab) సపోర్ట్ కార్యక్రమాలు, సీ ఎస్ ఎఫ్ (Central Square Foundation) ద్వారా ఎఫ్ ఎల్ ఎన్ కార్యక్రమాల అమలుకు ఖూణాూ (Key Academic Development Activities) లో అందిస్తున్న సహకారం ఆయా కార్యక్రమాల అమలు విధానం, విద్యార్థులపై వాటి ప్రభావం, మరియు భవిష్యత్ ప్రణాళికలపై కలెక్టర్ సుదీర్ఘంగా సవివరంగా ఆరా తీశారు. రాబోయే విద్యా సంవత్సరంలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడానికి ప్రత్యేక దృష్టి సారించాలని, అన్ని కార్యక్రమాలు సమన్వయంతో అమలవుతూ విద్యార్థుల నేర్చుకునే సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అలాగే స్వచ్ఛంద సంస్థలు విద్యాశాఖతో సమన్వయం పెంచి, ఫలితాలపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి డా. గోవిందరాజు, ఎ.ఎం.ఓ విద్యాసాగర్, సీఎస్ఎఫ్ ప్రతినిధులు, అలోకిత్, స్వతః, ఫ్యూచర్ డాట్స్, డిజిటల్ ఈక్విటీ, ఇన్ క్విలబ్ తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కట్నం తీసుకోవద్దు... ఇవ్వొద్దు!

### సామాజిక బాధ్యతగా యువత ముందుకు రావాలి.



**రాయపోల్, మార్చి 16:** వధూవరుల వివాహం అనే పవిత్ర బంధాన్ని డబ్బు,బంగారం, ఆస్తులతో కొలిచే కట్నపు దురాచారం సమాజంలో ఇప్పటికీ కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. వధువు కుటుంబం నుంచి వరుడి కుటుంబానికి నగదు, బంగారం,స్థలాలు లేదా ఇతర ఆస్తుల రూపంలో ఇచ్చే కట్నం చట్టపరంగా నేరమని తెలిసినా,అనేక చోట్ల అది సామాజిక సంప్రదాయంలా మారిపోయింది. దీనివల్ల ఆడపడుచుల కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక భారం మోసే పరిస్థితి ఏర్పడుతోంది.

కట్నం కారణంగా అనేక కుటుంబాలు అప్పులపాలవుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కొన్నిచోట్ల కట్నం వివాదాలు కుటుంబ కలహాలకు దారితీస్తుండగా, మరికొన్నిచోట్ల మహిళలపై వేధింపులు, అన్యాయాలు చోటుచేసుకుంటున్నాయి. కట్నం ఇవ్వాల్సి వస్తుందనే భయంతో కొంతమంది తల్లిదండ్రులు ఆడబిడ్డలను కనడానికే వెనుకంజ వేస్తున్నారు.

ఇంకా కొన్ని దురదృష్టకర సంఘటనల్లో ఆడపిల్ల పుట్టగానే చెత్తకుప్పల్లో, ముళ్లపొదల్లో లేదా కాలువల్లో వదిలేస్తున్న ఘటనలు కూడా వెలుగులోకి వస్తున్నాయి. ఇటువంటి పరిస్థితులు కొనసాగితే భవిష్యత్తులో సమాజంలో ఆడపిల్లల సంఖ్య మరింత తగ్గిపోయి, అబ్బాయిలకు వివాహం చేసుకునేందుకు అమ్మాయిల కొరత ఏర్పడే ప్రమాదం ఉంది.

ఈ నేపథ్యంలో కట్నం నిర్మూలన కోసం ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తీసుకొచ్చినా, క్షేత్రస్థాయిలో వాటి అమలు పూర్తిగా జరగడంలేదు. సామాజిక మార్పు కోసం ముఖ్యంగా యువత ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

పెళ్లి చేసుకునే యువకులు కట్నం తీసుకోకుండా ఆదర్శంగా నిలిస్తే సమాజంలో మంచి మార్పు వస్తుందాని కొందరు అభిప్రాయపడుతున్నారు. "కట్నం తీసుకోను" అనే సంకల్పంతో వివాహాలు జరిగితేనే ఆడపడుచుల కుటుంబాలపై ఉన్న ఆర్థిక భారం తగ్గుతుందని చెబుతున్నారు. సమాజంలో అవగాహన పెంచడం కూడా అత్యంత అవసరం. తల్లిదండ్రులు, పెద్దలు, యువత కలిసి కట్నం అనే చెడు సంప్రదాయాన్ని త్రోసిపుచ్చాలి. కట్నం లేకుండా జరిగే వివాహాలను ప్రోత్సహిస్తే సమానత్వం, పరస్పర గౌరవం పెరుగుతాయని నిపుణులు పేర్కొంటున్నారు.

పెళ్లి అనేది ఇద్దరి మనసుల కలయికే గానీ డబ్బుతో కొనుగోలు చేసే సంబంధం కాదని గుర్తించాలి. కట్నం తీసుకోకుండా పెళ్లి చేసుకోవడానికి యువకులు ముందుకు రావడం ద్వారానే ఈ సామాజిక దురాచారానికి ముగింపు పలకవచ్చని సామాజికవేత్తలు సూచిస్తున్నారు.

## షెడ్యూల్డ్ కులాల యువత నుండి దరఖాస్తుల స్వీకరణకు గడువు పొడిగింపు

- జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం ఈ.ఈ. చాతరాజుల దుర్గాప్రసాద్



**మార్చి 28, 2026:** 2025-26 సవత్సరానికి గాను షెడ్యూల్డ్ కులముల కార్యకరణ ప్ర ణాళికలో భాగంగా ప్రభుత్వ ఆమోదిత మొదటి విడత పథకాల కోసం అర్హత గల ఎస్.సి. యువత దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఏప్రిల్ 2వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం ఈ.ఈ. చాతరాజుల దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రవాణా రంగం ఎలక్ట్రికల్ లో ఈ.వి. ద్విచక్ర వాహన లక్ష్యం 185 యూనిట్లకు గాను 608 దరఖాస్తులు, ఈ.వి. త్రిచక్ర వాహనం (సరకు/ప్రయాణికుల రవాణా) లక్ష్యం 91 యూనిట్లకు గాను 838 దరఖాస్తులు, వ్యవసాయ పథకాలలో సోలార్ యూనివర్సల్ పంపు కంట్రోల్, వ్యవసాయ అనుబంధ భాగం లక్ష్యం 19 యూనిట్లకు గాను 73 దరఖాస్తులు ఆన్ లైన్ లో https://tgobmms.cgg.gov.in నమోదు కావడం జరిగిందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల షెడ్యూల్డ్ కులములకు చెందిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మంచిర్యాల జిల్లా పౌర సంబంధాల అధికారిచే జారీ చేయడమైనది


## డిఫాల్ట్ రైస్ మిల్లర్లకు బకాయిలు చెల్లించేందుకు మూడు నెలలు గడువు పొడిగింపు...

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, మార్చి- 28:( సమయం న్యూస్). :** డిఫాల్ట్ రైస్ మిల్లర్లకు బకాయిలు చెల్లించేందుకు మూడు నెలలు గడువు ప్రభుత్వం పొడగించిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2014-15 నుండి ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2023-24 వరకు (రబీ 2022-23 సీజన్‌కు సంబంధించిన Auction Paddy $TqVŸä) బకాయిలు ఉన్న రైస్ మిల్లర్లు, తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ లిమిటెడ్‌తో కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం 90 రోజుల లోపు ఎఫ్.ఆర్.కే సన్న బియ్యం (ఖీశీతీఅటఅవస ఝఅఝఎఅఎఝఎ) లేదా నగదు రూపంలో బకాయి పరిమాణానికి సమానమైన మొత్తాన్ని 125% తో పాటు 12% వడ్డీతో చెల్లించాలనే ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ గడువు ముగిసిన నేపథ్యంలో, ప్రభుత్వం విషయాన్ని పునఃపరిశీలించి బకాయిల వసూలును వేగవంతం చేయడం, అలాగే తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ లిమిటెడ్ ప్రయోజనాలను పరిరక్షించడం కోసం గతంలో ఇచ్చిన గడువును మరో 3 నెలల పాటు పొడిగిస్తూ మార్చి 25 న ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, డిఫాల్ట్ రైస్ మిల్లర్లు ఖీ=ఖ సన్నబియ్యం లేదా నగదు రూపంలో బకాయిలను గడువులోపు చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఈ వెసులుబాటును డిఫాల్ట్ రైస్ మిల్లర్లు సద్వినియోగం చేసుకొని, తమ బకాయిలను ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ లిమిటెడ్‌కు గడువు లోపల చెల్లించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.




# తొక్కిసలాట మృతులకు నివాళి..

## స్మారకార్థం 11 సీట్లు కేటాయింపు

ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్ ఆరంభ పోరులో చిన్నస్వామి తొక్కిసలాట మృతులకు నివాళులు అర్పించారు. టాస్ అనంతరం ఆర్సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాళ్లతో పాటు స్టాండ్స్‌లోని అభిమానులందరూ లేచి నిల్చొని మౌనం పాటించారు. ఇదివరకూ చెప్పినట్టుగానే ఆ పదకొండు మంది జ్ఞాపకార్థం కర్నాటక క్రికెట్ సంఘం ప్రత్యేకంగా 11 సీట్లను కేటాయించింది. జాతీయ గీతం ఆలాపన అనంతరం మ్యాచ్ ప్రారంభమైంది. ఐపీఎల్ ఫ్రాంఛైజీ ఆర్సీబీ , కర్నాటక క్రికెట్ సంఘం మాట నిలబెట్టుకున్నాయి. నిరుడు జూన్ 4వ తేదీన మరణించిన 11 మంది జ్ఞాపకార్థం చిన్నస్వామి స్టేడియంలో స్మారకం ఏర్పాటు చేయడంతో పాటు పదకొండు ప్రత్యేక సీట్లను కేటాయించాయి. ఇదివరకే మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం ప్రకటించిన ఆర్సీబీ.. ఇప్పుడు వారిని ప్రత్యేకంగా స్మరించుకుంది.

# ఇదేం బ్యాటింగ్ భయ్యా..

## భారీ హిట్టింగ్ చేస్తారనుకుంటే పెవిలియన్‌కి క్యూ కట్టారు..

### షాక్‌లో ఎస్ఆర్‌హెచ్





**బెంగళూరు:** క్రికెట్ ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్ గ్రాండ్‌గా మొదలైంది. చిన్నస్వామి స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య జరుగుతున్న ఈ తొలి మ్యాచ్‌లో ఎస్ఆర్‌హెచ్ బ్యాటర్లు తేలిపోయారు. టాస్ గెలిచిన ఆర్సీబీ మొదట ఫిల్డింగ్ తీసుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్ కి వచ్చిన ఆరెంజ్ ఆర్మీ బ్యాటర్లు చెలరేగిపోతారని అనుకుంటే తుస్సుమనిపించారు. మొదటి ఓవర్లు ఓ సిక్సు కొట్టిన అభిషేక్ శర్మ మంచి ఊపు మీద కనిపించాడు.. ఫస్ట్ రెండు ఓవర్లలో 17 పరుగులు చేసిన ఎస్ ఆర్ హెచ్.. మూడో ఓవర్ లో బౌలింగ్ కి వచ్చిన జాకబ్ డఫీ బౌలింగ్ లోనే భారీ షాట్ ఆడబోయిన అభిషేక్ వికెట్ కీపర్ జితేష్ శర్మకి క్యాచ్ ఇచ్చిన అభి పెవిలియన్ కు చేరుకున్నాడు. కేవలం 8 బంతుల్లో 7 పరుగులు చేశాడు. అనంతరం మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్ సైతం ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయాడు. 9 బంతుల్లో రెండు ఫోర్లు కొట్టి అదే ఓవర్లో జాకబ్ బౌలింగ్ లో ఔట్ అయ్యాడు. బౌండరీ లైన్ వద్ద ఫిల్ సాల్ట్‌కి క్యాచ్ ఇచ్చిన హెడ్ డకౌట్ కి వెళ్లిపోయాడు. అనంతరం బ్యాటింగ్ కి వచ్చిన లోకల్ బాయ్ నితిశ్ కుమార్ రెడ్డి మాత్రం దారుణంగా విఫలమయ్యాడు. దాదాపు 6 బంతులు కేవలం 1 పరుగు మాత్రమే చేసి అభినందన్ సింగ్ కి క్యాచ్ ఇచ్చి పెవిలియన్ కి వెళ్లిపోయాడు. దీంతో బ్యాటింగ్ భారం మొత్త కెప్టెన్ ఇషన్ కిషన్ పై పడింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో భారీ హిట్టర్లకు పెట్టింది పేరు.. అలాంటి హిట్టర్లు ఈ మ్యాచులో ఘోరంగా విఫలమయ్యారు. ఎస్ఆర్ హెచ్ కోల్పోయిన మూడు వికెట్లను ఆర్సీబీ బౌలర్ జాకబ్ డఫీ ఒక్కడే తీసుకోవడం గమనార్హం. కీలకమైన వికెట్లు కోల్పోయిన ఆరెంజ్ ఆర్మీ కష్టాల్లో పడింది. ప్రస్తుతం క్రీజులో కెప్టెన్ ఇషాన్ (33లి), హెన్రీచ్ క్లాసెన్ (4లి) ఉన్నారు.



# పాక్ క్రికెట్‌కు ఘోర అవమానం

## ప్లేయర్లతో పాటు షాక్ ఇస్తున్న కామెంటేటర్లు..

**ఢిల్లీ:** పాకిస్తాన్ క్రికెట్ రోజురోజుకు దిగజారిపోతుంది. వరసగా అవమానాలు ఎదురవుతూనే ఉన్నాయి. పాకిస్తాస్ సూపర్ లీగ్ నుంచి విదేశీ క్రికెటర్లు బయటకు వస్తున్నారు. వీరంతా ఇండియన్ ప్రీమియర్ లీగ్లో ఆడేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఐపీఎల్‌లో అమ్ముడుపోని క్రికెటర్లు మాత్రమే పీఎస్ఎల్‌లో ఆడుతున్నారనే ప్రచారం ఉంది. ఇక ఇప్పుడు, కామెంటేటర్లు కూడా పీఎస్ఎల్ వీడి ఐపీఎల్ కోసం వస్తున్నారు. పీఎస్ఎల్ కామెంటేటర్స్ ప్యానెల్‌లో ఉన్న మాజీ ఇంగ్లాండ్ స్టాన్ నిక్ నైట్, ఇప్పుడు ఐపీఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీనికి ముందు ప్లేయర్లు దాసున్ శనక, స్పెన్సర్ జాన్సన్, బ్లెస్సింగ్ ముజరబాని వంటి ఆటగాళ్లు పీఎస్ఎల్ వీడి ఐపీఎల్‌లో చేరారు. పాక్ క్రికెట్ బోర్డ్(పీసీబీ) చీఫ్ మోహ్సిన్ నఖ్వీకి ఈ పరిణామాలు తీవ్ర అవమానంగా మిగిలిపోతున్నాయి. వెళ్లిపోయిన ఆటగాళ్లపై చర్యలు తీసుకుంటామని నఖ్వీ హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉంటే, శుక్రవారం పీఎస్ఎల్ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. లాహోర్‌లో లాహోర్ ఖలందర్స్, హైదరాబాద్ కింగ్స్ మెన్ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ కూడా చాలా నిశ్శబ్ధంగా జరిగింది. ప్రేక్షకులు ఎవరూ మ్యాచ్‌కు హాజరుకాలేదు. ఎలాంటి హడావుడి లేకుండా, ప్రారంభ కార్యక్రమాలు లేకుండా టోర్నీ ప్రారంభమైంది. ఇరాన్ యుద్ధం కారణంగా ప్రజలు పెట్రోల్, డిజల్ ఆదా చేసే పనిలో ఉన్నారు. దీంతోనే ప్రేక్షకులు ఎవరూ మ్యాచ్‌కు రాలేదు. దీనికి తోడు తాలిబాన్‌తో జరుగుతున్న యుద్ధం కూడా పీఎస్ఎల్ భద్రతపై ప్రభావం చూపుతున్నాయి.



# గంభీర్ పేరుతో ఉన్న ఏఐ వీడియోలు 36 గంటల్లో తొలగించాలి

## ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు



టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు ఢిల్లీ హైకోర్టు ఊరట లభించింది. తన పేరును వాడుకుంటూ ఏఐ జనరేటెడ్ వీడియోలు తీశారని గంభీర్ కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. శనివారం ఢిల్లీ హైకోర్టు ఈ అంశంపై విచారణ జరిపి కీలక తీర్పు వెలువరించింది. గంభీర్ పేరు, ఫొటో, వాయిస్ లేదా ఏఐ జనరేటెడ్‌తో కూడిన వీడియోలను 36 గంటల్లో తొలగించాలని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లను కోర్టు ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ జ్యోతి సింగ్ ధర్మాసనం తీర్పునిచ్చింది.గంభీర్ తరఫున న్యాయవాదులు పలు సోషల్ మీడియా ఖాతాలను కోర్టు ముందుంచారు. ఆన్‌లైన్ అతడి గుర్తింపును దుర్వినియోగం చేసినట్లు వాదనలు వినిపించారు. దీంతో ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, అమెజాన్, ఫ్లిప్ కార్ట్‌తో పాటు ఇతర సోషల్ మీడియా ఖాతాల్లోని కంటెంట్‌ను 36 గంటల్లో తొలగించాలని కోర్టు స్పష్టం చేసింది. మున్ముందు ఇలాంటి అవాంఛిత కంటెంట్ ఆయా ఖాతాల్లో రాకుండా చూడాలని హెచ్చరించింది. ఉల్లంఘనకు పాల్పడిన బాధ్యుల వివరాలను వెల్లడించాలని ఆదేశించింది. భారత క్రికెట్‌కు ప్రధాన కోచ్‌గా ఉన్న గంభీర్ తన వ్యక్తిగత జీవితాన్ని ఆస్వాదించే హక్కును కాలరాయడం తగదని హైకోర్టు పేర్కొంది.

# ఐపీఎల్‌కు ధోనీ దూరం..

## శాంసన్‌కు భలే ఛాన్స్!

**ఢిల్లీ:** పంతొమ్మిదో సీజన్ ఆరంభానికి ముందే చెన్నై సూపర్ కింగ్స్ కు పెద్ద షాక్. తొలి ఎడిషన్ నుంచి సీఎస్కేకు ఆడుతున్న మహేంద్ర సింగ్ ధోనీ మెగా టోర్నీకి దూరం కానున్నాడు. గాయం నుంచి పూర్తిగా కోలుకోని ధోనీ తొలి రెండు వారాలు ఐపీఎల్‌కు అందుబాటులో ఉండడం లేదు. తమ వెటరన్ ఆటగాడు మెగా ఈవెంట్‌కు కొన్ని రోజులు దూరం అవుతున్నాడని శనివారం సీఎస్కే యాజమాన్యం వెల్లడించింది. ధోనీ లేకుండా చెన్నై జట్టు ఐపీఎల్ ఆడనుండడం ఇదే మొదటిసారి కానుంది. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినప్పటి నుంచి పూర్తిగా ఐపీఎల్‌కే అంకితమైన మహేంద్ర సింగ్ ధోనీ తొలిసారి టోర్నీకి దూరమవుతున్నాడు. ఆరంభ సీజన్ నుంచి బ్రేక్ లేకుండా ఆడుతున్న తాలా ఈసారి కొన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడు. గత సీజన్ ఫైనల్లో మోకాలి గాయంతోనే ఆడిన ధోనీ అనంతరం సర్జరీ చేయించుకున్నాడు. ఈ గాయం నుంచి కోలుకున్నా.. కండరాల గాయం ధోనీని వెంటాడింది. దాంతో, అతడికి విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. అందుకే రెండు వారాలు సీఎస్కే మ్యాచ్‌లకు ధోనీ దూరం కానున్నాడు. పంతొమ్మిదో ఎడిషన్ తొలి మ్యాచ్‌లో మార్చి 30న రాజస్థాన్ రాయల్స్‌తో సీఎస్కే తలపడనుంది. రికార్డు స్థాయిలో 278 మ్యాచ్‌లు ఆడిన ధోనీ గౌర్హాజరీలో సంజూ శాంసన్ కు వికెట్ కీపింగ్ అప్పగించే అవకాశముంది. ఇటీవలే ట్రేడ్ పద్ధతిన సీఎస్కే గూటికి చేరిన శాంసన్




ఓపెనర్‌గా, వికెట్ కీపర్‌గా తన ముద్ర వేసేందుకు ఇంతకుమించిన సమయం ఉండదేమో.



# చెల్లి నిర్మాత.. అన్న హీరోగా బరిలోకి

## వరుణ్‌తేజ్ కొత్త సినిమాకు పవన్ క్లాప్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, ఆయన సోదరి నిహారిక కొణిదెల నిర్మాణంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'బరి' శనివారం ఘనంగా ప్రారంభమైంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌కు యువ దర్శకుడు యదువంశీ దర్శకత్వం వహిస్తున్నారు. అట్టహాసంగా పూజా కార్యక్రమాలు నిర్వహించగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరై చిత్ర యూనిట్‌ను ఆశీర్వదించారు. ముహూర్తపు సన్నివేశానికి పవన్ కళ్యాణ్ స్వయంగా క్లాప్ కొట్టడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా వరుణ్ తేజ్ భావోద్వేగానికి లోనవుతూ, తన బిజీ షెడ్యూల్ మధ్య కూడా పవన్ కళ్యాణ్ హాజరై ఆశీర్వదించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. మెగా ఫ్యామిలీ మెంత్తం ఒకే వేదికపై కనిపించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. స్పోర్ట్స్ డ్రామాలు, వాస్తవిక కథలు అంటే మలయాళ సినిమాల వైపు చూస్తారనే అభిప్రాయం ఉందని, తెలుగు చిత్ర పరిశ్రమలో కూడా గొప్ప కంటెంట్ ఉందని, మన సంస్కృతి, మన విలువలను ప్రతిబింబించేలా సినిమాలు తెరకెక్కించగల సామర్థ్యం తమకుందని దర్శకుడు యదువంశీ స్పష్టం చేశారు. గతంలో కొత్త కాన్సెప్ట్‌లతో తెలుగు సినిమాలు సక్సెస్ సాధించిన ఉదాహరణలు ఉన్నాయని గుర్తుచేస్తూ, 'బరి'తో ప్రేక్షకులను కొత్త అనుభూతి కలిగించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో గుర్తింపు పొందిన యదు వంశీ, మొదటి సినిమాతోనే మంచి పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు వరుణ్ తేజ్‌తో కలిసి రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా 'బరి'ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో వరుణ్ తేజ్ వాలీబాల్ ప్లేయర్ పాత్రలో కనిపించనుండటం విశేషం. సంక్రాంతి 2027 కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.



# అక్షయ్‌ఖన్నాకు ప్రశాంత్ గ్రీటింగ్స్

## మహాకాళిపై త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని ప్రకటన

బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా కేవలం తన నటనతోనే మాట్లాడతారని, ఆయనతో కలిసి పనిచేయడం తనకు దక్కిన గౌరవమని ప్రశాంత్ వర్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ప్రశాంత్ వర్మ ప్రత్యేక పోస్ట్‌ను పంచుకున్నాడు. నిజమైన టాలెంట్‌కు అరుపులు అవసరం లేదని నిరూపించే నటుడు అక్షయ్ ఖన్నా. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, పెర్ఫార్మెన్స్ ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన క్లాస్‌ను చాటుతాయని ప్రశాంత్ వర్మ కొనియాడారు. అలాగే ప్రశాంత్ వర్మ తన సినిమాటిక్ యూనివర్స్ లో భాగంగా వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న 'మహాకాళి', 'అధీర', మరియు 'జై హనుమాన్' చిత్రాల గురించి త్వరలోనే మరిన్ని అప్‌డేట్స్ ఇస్తామని హింట్ ఇచ్చాడు. అక్షయ్ ఖన్నా ప్రస్తుతం ప్రశాంత్ వర్మ నిర్మిస్తున్న 'మహాకాళి' చిత్రంలో అసుర గురువు 'శుక్రాచార్యుడి' పాత్రలో నటిస్తున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం కావడం విశేషం. ప్రస్తుతం అక్షయ్ ఖన్నాకు సంబంధించిన షూటింగ్ పార్ట్ పూర్తయిందని, అవుట్‌పుట్ చాలా అద్భుతంగా వచ్చిందని చిత్ర యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రశాంత్ వర్మ క్రియేట్ చేస్తున్న ఈ మైథలాజికల్ యూనివర్స్ కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.





# దురంధర్-2 ఓ చెత్త సినిమా

## అక్కసు వెళ్లగక్కిన ఓవైసీ



ధురంధర్ 2' సినిమాపై హైదరాబాద్ ఎంపీ, మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ 'తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తున్నప్పటికీ, ఒవైసీ మాత్రం దీనిని ఒక చెత్త సినిమాగా అభివర్ణించారు. ఒక మీడియా సదస్సులో ఒవైసీ మాట్లాడుతూ.. 'ధురంధర్ 2' వంటి మూడు గంటల పనికిరాని సినిమాలను చూసే సమయం తనకు లేదని అన్నారు. ఈ చిత్రం పూర్తిగా హింసను ప్రేరేపించేలా ఉందంటూ ఆయన మండిపడ్డారు. అసలు అది ఒక సినిమానా? అందులో మూడు గంటల పాటు కేవలం బూతులు, హింస తప్ప మరేమీ లేదు' అని ఆయన కొట్టిపారేశారు. ఈ సినిమాలో ముస్లింలను చిత్రీకరించిన విధానంపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఈ సినిమాకు బ్రహ్మరథం పడుతున్నారని గుర్తు చేయగా.. ఆయన తనదైన శైలిలో హైదరాబాదీ యాసలో స్పందిస్తూ, ఇలాంటి విషయాలను తాను పట్టించుకోనని తేల్చి చెప్పారు.



### సినిమాలన్నీ అట్టర్ ఫ్లాప్..

# కానీ లైఫ్ సెటిల్డ్!

వెండితెరపై మెరిసిపోవాలని, స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకోవాలని ఎందరో ముద్దుగుమ్మలు కలలు కంటారు. కానీ అందం, అభినయం ఉన్నా అందరికీ అదృష్టం కలిసిరాదు. సరిగ్గా ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంది అందాల భామ ఆదితి ఆర్య. టాలీవుడ్ డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ చేతుల మీదుగా హీరోయిన్‌గా పరిచయమైనా.. కెరీర్ పరంగా ఆశించిన సక్సెస్ అందుకోలేకపోయింది. అయితే, రీల్ లైఫ్‌లో ఫ్లాపులు ఎదురైనా, రియల్ లైఫ్‌లో మాత్రం ఏకంగా రూ. 12 వేల కోట్ల సామ్రాజ్యానికి కోడలై అందరినీ ఆశ్చర్యపరిచింది. చండీగఢ్‌లో జన్మించిన ఆదితి ఆర్య చదువులో టాపర్. ఫైనాన్స్, బిజినెస్ స్టడీస్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఈమె, మోడలింగ్‌పై ఆసక్తితో 'ఫెమినా మిస్ ఇండియా వరల్డ్ 2015' కిరీటాన్ని కైవసం చేసుకుంది. ఆ గుర్తింపుతోనే నందమూరి కల్యాణ్‌రామ్ సరసన 'ఇజం' చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమాలో గ్లామర్ పరంగా మంచి మార్కులు కొట్టేసినా, సినిమా బాక్సాఫీస్ వద్ద బోల్తా పడింది. ఆ తర్వాత కన్నడలో 'తంత్ర', హిందీలో రణవీర్ సింగ్ నటించిన '83' వంటి చిత్రాల్లో నటించినా అవేవీ ఆమె కెరీర్‌ను మలుపు తిప్పలేకపోయాయి. సినిమాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో, ఆదితి ఆర్య తన కెరీర్ బాట మార్చుకుంది. భారతదేశంలోని అత్యంత ధనవంతులైన బ్యాంకర్లలో ఒకరైన ఉదయ్ కోటక్ కుమారుడు జై కోటక్ తో ప్రేమలో పడింది. వీరిద్దరూ కొన్నాళ్ల పాటు డేటింగ్ చేసి, గత ఏడాది ఘనంగా వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం జై కోటక్ తన తండ్రి వ్యాపార సామ్రాజ్యాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. తాజా నివేదికల ప్రకారం జై కోటక్ ఆస్తుల విలువ దాదాపు రూ.12 వేల కోట్లకు పైగానే ఉంటుందని సమాచారం. సినిమాల్లో సక్సెస్ కాకపోయినా, తన చదువు, సంస్కారంతో ఏకంగా ఒక బిలియనీర్ ఫ్యామిలీకి కోడలిగా వెళ్లి, ఇప్పుడు వైవాహిక జీవితంలో ఎంతో సంతోషంగా గడుపుతోంది ఈ మాజీ మిస్ ఇండియా.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131



## ‘ఆర్డీటీ’పై మాట నిలబెట్టున్నాం

### రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

**అమరావతి :** అనంతపురంలోని రూరల్ డవలప్ మెంట్ ట్రస్ట్(ఆర్డీటీ) సంస్థకు నిధుల సమీకరణకు విదేశీ నిధుల రెన్యూవల్ (ఎఫ్.సి.ఆర్.ఎ)ను పునరుద్ధరిస్తూ మాట నిలబెట్టుకున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఆర్డీటీ విదేశీ నిధుల రెన్యూవల్ కు సహకరించిన సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్ కు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. అసెంబ్లీ ఆవరణలో ఉన్న మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు ఎమ్మెస్ రాజు, పరిటాల సునీత, పల్లె సింధూర రెడ్డి, బంగారు శ్రావణితో కలిసి ఆమె మాట్లాడారు. 60 ఏళ్ల నుంచి ఆ సంస్థ ఉమ్మడి అనంతపురం జిల్లాలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆపద్బాంధవిలా నిలుస్తూ, సామాజిక సేవలు అందిస్తోందన్నారు. స్పెయిన్ నుంచి వచ్చిన విన్సెంట్ ఫెర్రర్, ఆన్ ఫెర్రర్ దంపతులు అనంతపురంలోని వెనుకబడిన ప్రాంతాలను చూసి చలించిపోయారన్నారు. ఆర్డీటీ సంస్థను స్థాపించి పేదలకు విద్య, వైద్య సేవలు అందించారన్నారు. ఇళ్లు లేని వేలాది మందికి గృహ సదుపాయం కల్పించారని, మరికొందరు పేదలకు వ్యవసాయం కోసం భూములిచ్చారని, ఆధునిక పనిముట్లు అందిస్తూ రైతులకు తోడుగా నిలిచారని కొనియాడారు. ముఖ్యంగా, క్రీడల్లో ప్రత్యేక శిక్షణ అందజేశారని, ఎందరో అనంతపురం క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన సందర్భాలున్నాయన్నారు. ఆర్డీటీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుతో ఎందరో పేద రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. అత్యవసర చికిత్స కోసం బెంగళూరుకో, హైదరాబాద్‌కో వెళ్లాల్సిన అవసరం తప్పిందన్నారు. ముఖ్యంగా గర్భిణులకు ఈ ఆసుపత్రి ఓ వరమన్నారు. వేలాది మంది పేద బిడ్డలను చదివించి ఆ సంస్థ ప్రయోజకులను చేసిందని మంత్రి కొనియాడారు.

## ఆరోగ్యశ్రీ సేవలు అధ్వాన్నం

### పేదల ఆరోగ్యంతో చెలగాటం

### రూ.3వేల కోట్ల బకాయిలు సత్వరమే చెల్లించాలి

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య



**అమరావతి:** రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం దారుణ స్థితికి చేరుకుందని, పేదల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 1 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేయాలని నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ (ఆశ) తీసుకున్న నిర్ణయం అత్యంత ఆందోళనకరమని తెలిపారు. దాదాపు రూ. 3వేల కోట్ల బకాయిలను చెల్లించకుండా చంద్రబాబు ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. బకాయిల చెల్లింపుల కోసం ఆస్పత్రులు పలుమార్లు ప్రభుత్వాన్ని విన్నవించినప్పటికీ స్పందన లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్ బీమా కంపెనీలకు లాభం చేకూర్చే దిశగా ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటివరకు ఎన్నడూ లేని విధంగా బకాయిల కోసం ఆస్పత్రులు హైకోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్ల నెట్‌వర్క్ ఆస్పత్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఆస్పత్రులకు వెళ్లిన పేద రోగులను తిరస్కరించి వెనక్కు పంపిస్తున్న దయనీయ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రూ. 3వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. బీమా కంపెనీల ఎంపిక కోసం టెండర్లు పిలవడాన్ని సీపీఐతో పాటు ప్రజా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుత వైద్య ఖర్చులకు అనుగుణంగా ప్రొసీజర్ రేట్లు పెంచాలని ఆస్పత్రుల యజమానులు చేస్తున్న డిమాండ్లు సముచితమని అభిప్రాయపడ్డారు. వైద్యశాఖ అధికారులతో చర్చలు జరిపినప్పటికీ బకాయిల చెల్లింపుపై స్పష్టమైన హామీ ఇవ్వకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని సూచిస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని బీమా విధానంగా మార్చడం ద్వారా పేదల వైద్యాన్ని వ్యాపారంగా మలచాలనే ప్రయత్నం కొనసాగుతోందన్నారు. ఏప్రిల్ 1లోగా బకాయిలు చెల్లించకపోతే, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు తప్పవని, దాంతో పేదల వైద్య పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతుందని హెచ్చరించారు. పేదల ప్రాణాలతో ఆటలాడటం మానుకుని, తక్షణమే ఆరోగ్యశ్రీ వ్యవస్థను గాడిలో పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నప్పటికీ ఆస్పత్రుల్లో బెడ్లు లేవని చెప్పి రోగులను తిరస్కరిస్తున్న పరిస్థితులపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. బీమా విధానం అమలు ద్వారా ప్రైవేట్ సంస్థల దయాదాక్షిణ్యాలపై పేదల ప్రాణాలను ఆధారపరచే పరిస్థితి తీసుకురావడం ప్రమాదకరమని, తక్షణమే దానిని విరమించాలన్నారు, నెట్ వర్క్ ఆస్పత్రులకు బకాయి పడిన రూ. 3వేల కోట్లను చెల్లించి, ఆరోగ్యశ్రీ సేవలు సక్రమంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## జర్నలిస్టులకు ప్రశ్నించే స్వేచ్ఛను కల్పించాం..

### అభివృద్ధికి మీడియా సహకరించాలి

### ఐజేయూ ప్లీనరీలో సీఎం చంద్రబాబు

**విజయవాడ:** విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (×జీఖ) 11వ ప్లీనరీ సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని ప్రసంగించారు. మూడు దశాబ్దాలుగా జర్నలిస్టులతో తనకు విడదీయలేని అనుబంధం ఉందని గుర్తు చేసుకున్న ఆయన, తన ప్రభుత్వం ఎప్పుడూ జర్నలిస్ట్ ఫ్రెండ్లీగానే ఉంటుందని స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తాము ఐటీ రంగంలో చేసిన కృషి వల్ల నేడు హైదరాబాద్‌లో కనిపిస్తున్న ఫలితాలను ఐజేయూ ప్రతినిధులు ప్రశంసించడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రతిరోజూ మీడియాలో వచ్చే వార్తాంశాలను తాము నిశితంగా పరిశీలిస్తున్నామని, ప్రజా సమస్యలపై వచ్చే కథనాలపై తక్షణమే చర్యలు తీసుకుంటున్నామని, మీడియాకు తమ ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యత ఇదేనని వివరించారు. అయితే, ప్రస్తుత కాలంలో మీడియా పోకడలు ఆందోళనకరంగా మారుతున్నాయని, వాస్తవాలను పక్కన పెట్టి అబద్ధాలను చిత్రీకరించే ధోరణి పెరిగిపోయిందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వైఎస్ వివేకా



మరణాన్ని గుండెపోటుగా చిత్రీకరించి, ఆ తర్వాత నిజాన్ని కప్పిపుచ్చేందుకు తనపై ‘నారాసుర రక్త చరిత్ర’ అంటూ సాక్షిలో అవాస్తవ కథనాలు వండి వార్చారని ధ్వజమెత్తారు. ఇటువంటి విపరీత పోకడలు ప్రజాస్వామ్యానికి, సమాజానికి మంచిది కాదని హెచ్చరించారు. గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన జీవో నంబర్ 2430 వంటి అణచివేత చర్యలను తాము వ్యతిరేకిస్తామని, జర్నలిస్టులకు పూర్తిస్థాయిలో ప్రశ్నించే స్వేచ్ఛను కల్పించామని పేర్కొన్నారు. మండల రిపోర్టర్లకు అక్రిడిటేషన్లు ఇవ్వడంతో పాటు, జర్నలిస్ట్ వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు చేశామని, విలేకరులపై దాడులు జరిగితే ఎస్పీ స్థాయి అధికారితో విచారణ చేయిస్తున్నామని తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు సమాచారం ఇప్పుడు పెద్ద సమస్యగా మారిందని, దీన్ని నియంత్రించడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. విలువలు, సిద్ధాంతాలు పడిపోతున్న తరుణంలో వాటిని పునరుద్ధరించుకోవాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. కేవలం పాజిటివ్ న్యూస్ మాత్రమే ఇవ్వాలని తాను కోరడం లేదని, రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడేలా ‘ప్రోగ్రెసివ్ న్యూస్’ (పురోగతి వార్తలు) అందించాలని విజ్ఞప్తి చేశారు. అద్భుతమైన ఫ్యూచర్ సిటీగా మారుతున్న అమరావతికి చట్టబద్ధత కోరుతూ నేడే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపామని, రాబోయే ఐదేళ్లలో అమరావతిలో జరిగే అద్భుత అభివృద్ధిని మీడియానే ప్రపంచానికి చాటిచెప్పాలని కోరారు. అమరావతిలో ఐజేయూ కార్యాలయానికి స్థలం ఇచ్చే అంశాన్ని పరిశీలించేందుకు సబ్ కమిటీకి అప్పగిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## అమరావతికి చట్టబద్ధతతో భావితరాలకు భరోసా

### బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

**అమరావతి :** ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయించడం అభినందించదగ్గ విషయమని, ఈ తీర్మానం భావితరాలకు భరోసానిస్తుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ల్యాండ్ పూలింగ్ విధానంలో 33 వేల ఎకరాలు సేకరించడం చరిత్రలో మొట్టమొదటిసారన్నారు. ఇది సీఎం చంద్రబాబుకే సాధ్యమని కొనియాడారు. అమరావతికి స్వాగతిస్తున్నానని, ఇక్కడే ఇల్లు కట్టుకున్నానని మభ్యపెట్టి, అధికార గర్వంతో మూడు ముక్కలాట ఆడుతూ ప్రజలను భయభ్రాంతులకు, గందరగోళాలకు గురిచేశారని జగన్ పై మంత్రి సవిత మండిపడ్డారు. అమరావతికి చట్టబద్ధతకు శనివారం నిర్వహించిన ప్రత్యేక అసెంబ్లీ సమావేశంలో తీర్మానానికి మద్దతుగా ఆమె మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తరవాత అప్పులతో నవ్యాంధ్ర ప్రదేశ్ ఏర్పడిందన్నారు. ముఖ్యమంత్రిగా సీఎం చంద్రబాబు ప్రమాణా స్వీకారం చేసిన రోజున లోటు బడ్జెట్ తో పాటు కనీసం కూర్చోడానికి కుర్చీలు కూడా లేవన్నారు. సమర్థవంతమైన నాయకత్వంలో ఏపీ 2014-19 మధ్య కాలంలో అభివృద్ధి పథం వైపు దూసుకెళ్లిందన్నారు. సీమాంధ్ర ప్రజల నూతన రాజధాని అమరావతిని సీఎం చంద్రబాబు ఎంపిక చేసినప్పుడు ప్రపంచం నలుమూలల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయన్నారు. సీఎం చంద్రబాబు పిలుపునకు స్పందిస్తూ...రాజధాని నిర్మాణానికి ఆ ప్రాంత రైతులు ల్యాండ్ పూలింగ్ ద్వారా స్వచ్ఛందంగా 34 వేల ఎకరాలు అందజేశారని, వారందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నానని తెలిపారు. రాజధాని నిర్మాణానికి ల్యాండ్ పూలింగ్ లో భూములు సేకరించిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. చరిత్రలో ఎక్కడా ఇలా ల్యాండ్ పూలింగ్ పద్ధతిలో భూములు సేకరించిన



దాఖలాలల్లేవన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడి చేతుల మీదుగా అమరావతికి శంకుస్థాపన జరిగిందన్నారు. ఆయన దేశంలో ముఖ్యమైన నదుల్లో జలాలు, పుణ్యక్షేత్రాలకు చెందిన మట్టిని అందజేసి అమరావతి నిర్మాణానికి అందజేసి దీవెనలు అందజేశారన్నారు.

### తీర్మానంతో భావితరాలకు భరోసా

అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించేలా అసెంబ్లీ తీర్మానం అభినందించదగ్గ విషయమని, ఈ తీర్మానం భావితరాలకు భరోసానిస్తుందని మంత్రి సవిత తెలిపారు. నవ్యాంధ్ర ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోందని, ముఖ్యంగా పెట్టుబడిదారుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయని అన్నారు. అమరావతి నిర్మాణంపై మాట చెప్పడమే చేసి చూపుతున్నారు సీఎం చంద్రబాబును కొనియాడారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రానికి ప్రాణ త్యాగాలు చేసిన అమరజీవి పొట్టి శ్రీరాముల విగ్రహాన్ని ఇటీవల ఆవిష్కరించుకున్నామని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు అందుబాటులో ఉండేలా రాజధాని అమరావతిని నిర్మిస్తున్నారని తెలిపారు. ఒకవైపు అమరావతి రాజధానిని నిర్మిస్తూనే, మరో వైపు రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలను కూడా సీఎం చంద్రబాబు అభివృద్ధి చేస్తున్నారన్నారు. ప్రాంతాల వారీగా హార్టీకల్చర్ హబ్, సిరికల్చర్ హబ్, పారిశ్రామిక హబ్, టెక్స్ టైల్స్ హబ్, లాజిస్టిక్స్ హబ్ గా అభివృద్ధి చేస్తున్నారన్నారు. రాజధాని ప్రాంతం సంపద సృష్టించడమే కాకుండా ఉద్యోగాల కల్పనకు కీలకం కానుందన్నారు.

### జగన్ మూడు ముక్కలాటతో సర్వనాశనం

30 వేల ఎకరాల్లో అమరావతి రాజధాని ఉండాలని ఇదే అసెంబ్లీలో ప్రతిపక్షంలో కూర్చొన్న జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారని మంత్ర సవిత గుర్తు చేశారు. ‘అమరావతిని నేను స్వాగతిస్తున్నాను... నేను ఒప్పుకుంటున్నాను... ఇల్లు కూడా కట్టుకున్నాను’ అని ప్రజలను నమ్మించారన్నారు. 2019 ఎన్నికల సమయంలో ఎక్కడ సభ జరిగినా ఇదే మాట చెపుకుంటూ వచ్చారన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన అమరావతిపై మాటతప్పి, మూడు ముక్కలాట ఆట ఆడుతూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. జగన్ తీరును ఎండగడుతూ ఆనాడు టీడీపీ, బీజేపీ, జనసేన, ప్రజా సంఘాలతో రాజధాని ప్రాంత రైతుల పెద్ద ఎత్తున నిరసన తెలిపారన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం రాకతో మరోసారి సుందర అమరావతి నిర్మాణ పనులు ఊపందుకున్నాయన్నారు. అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పిస్తూ తీర్మానం చేయడం ద్వారా భవిష్యత్తుల్లో మరెవరూ రాజధాని కదపడానికి అవకాశం ఉండదన్నారు. తీర్మానం ప్రవేశపెట్టినందుకు సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు.

## యువతిపై ఆటో డ్రైవర్ అత్యాచారం

**విజయవాడ:** దేశవ్యాప్తంగా మహిళలపై అత్యాచారాలు రోజురోజుకూ పెరిగిపోతూనే ఉన్నాయి. ప్రతి రోజూ ఏదో ఒక చోట వారిపై కామాంధులు లైంగిక దాడులకు పాల్పడుతూనే ఉన్నారు. చిన్న, పెద్ద, వృద్ధులు అనే తేడా లేకుండా కామవాంఛలు తీర్చుకుంటూ రెచ్చిపోతున్నారు. ఒంటరిగా చిక్కితే పాపం.. అత్యాచారాలకు తెగపడుతున్నారు. తాజాగా అలాంటి ఘటనే ఒకటి విజయవాడలో జరిగింది. ఆటో ఎక్కిన యువతిపై డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. యువతి వెళ్లాల్సిన ప్రాంతానికి కాకుండా బలవంతంగా కృష్ణలంక వైపునకు తీసుకెళ్లాడు కామాంధుడు. భయభ్రాంతులకు గురి చేసి ఎవరూ లేని ప్రదేశానికి లాక్కెళ్లాడు. అనంతరం యువతిపై అత్యాచారానికి



ఒడికట్టాడు. ఆ తర్వాత ఆమెను అక్కడే వదిలిపెట్టి ఆటోతో సహా పరారయ్యాడు. ఏడుస్తూ ఇంటికి వెళ్లిన బాధితురాలు జరిగిన విషయం తల్లికి చెప్పింది. షాక్‌కు గురైన బాధిత కుటుంబం మాచవరం పోలీసులను ఆశ్రయించారు. తనపై జరిగిన లైంగిక దాడి గురించి పోలీసులకు ఫిర్యాదు చేసింది సదరు యువతి. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆటో డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సీసీటీవీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కాగా, మహిళలపై లైంగిక దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను నగర వాసులు కోరుతున్నారు. కఠిన శిక్షలు వేసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ‘మరి వైజాగ్‌లో ఐటీ కంపెనీలకు ఎలా అనుమతిస్తున్నారు?’

**కాకినాడ:** పదకొండేళ్ల క్రితం హైదరాబాద్‌ను వదిలేసి వచ్చి అమరావతి రాజధాని అని చంద్రబాబు చెప్పుకొచ్చారని, ఇప్పుడు మళ్ళీ ఎవరిని మభ్య పెట్టడానికి అసెంబ్లీ లో అమరావతే ఏకైక రాజధాని అని తీర్మానం చేయడం వెనుక కారణాలు ఏంటని వైఎస్సార్‌సీపీ నేత కురసాల కన్నబాబు ప్రశ్నించారు. అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతులకు ఫ్లాట్లు ఇంత వరకు ఇవ్వలేదని, ఇప్పుడు అమరావతి పేరుతో కట్టు కథలు చెప్పి రానున్న మూడేళ్ళు గడిపేయడానికి ఈ డ్రామా అని ధ్వజమెత్తారు కురసాల. మీరు మళ్ళీ అధికారంలో ఉంటామన్న నమ్మకం మీకు లేదా?, రైతులకు ఒక్క రిటన్ బుల్ ఫ్లాట్ ఇచ్చారా?, రాజధాని రైతు చనిపోతే కనీసం మీరు పరామర్శించారా?, చారిత్రాత్మక రాజధాని అని మీరు చెప్పినప్పుడు సమిధలు అవుతున్న రైతులను పరామర్శించరా?, ఇప్పటికీ రాజధానికి సరైన కనెక్టింగ్ రోడ్డులు ఉన్నాయా?, కనీసం ఆస్తులు ఉండీ అమ్ముకునే దుస్థితి అమరావతి రైతులకు లేదు. రాజధానికి అప్పులు ఎక్కడ నుండి తెస్తున్నారో తెలియదు. రాజధాని భవనాలకు అడుగు నిర్మాణానికి రూ. 11 వేలు అవినీతి కాదా?, డిజైన్లకు కొత్తగా రూ.400 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇడ్లీ పాత్ర..ఉప్మా గిన్నెల్లా భవనాలను డిజైన్ చేయించారు.రాష్ట్రాన్ని గాలికి వదిలేశారు. ఎలాంటి అభివృద్ధి లేదు. అమరావతిని సెల్ఫ్ ఫైనాన్స్ నగరం అని చెప్పి ఇప్పటి వరకు నిధులు ఏమైనా సమీకరించారా?, రాజధాని లో ఇవాళ్టికి భూములు తుప్పలుగా ..పరలు పరలుగా కనిపిస్తున్నాయి.హైపర్ లూప్, ఒలింపిక్స్ అంటూ అమరావతిని బాగా మార్కెటింగ్ చేస్తున్నారు. అమరావతి ని ఒక మహ నగరంగా తీర్చిదిద్దుతారన్న నమ్మకం ఎవరికీ లేదు.

### అప్పుడు సునామీలన్నారు.. ఇప్పుడు ఐటీ కంపెనీలకు అనుమతి ఎలా?

రాష్ట్రంలో అతి పెద్ద సిటీ వైజాగ్ అనడంలో ఎటువంటి సందేహం లేదు. మరి వైజాగ్‌ను పరిపాలన రాజధాని చేస్తానంటే.. సునామీలు వస్తాయని టీడీపీ తన అనుకూల మీడియాతో దుష్ప్రచారం చేయించింది. మరీ వైజాగ్‌లో ఇప్పుడు ఐటీ కంపెనీలకు ఏలా అనుమతి ఇస్తున్నారు.



అమరావతి మీరు క్రియేట్ చేసిన ఇల్యూజన్‌లా కనిపిస్తుంది.అమరావతిని ఎవరికి స్వర్గంలా చేసేందుకు నిర్మిస్తున్నారు. అమరావతి లో పేదలకు చోటు లేదా? ఎవరి కోసం నిర్మాణం’ అని ప్రశ్నించారు.

# 12,576 సెన్సెక్స్ | 3,521 నిఫ్టీ | డౌన్

## శిఖరాగ్రం నుంచి పాతాళానికి!

### ఆల్ టైమ్ హై నుంచి సెన్సెక్స్ 12,576 పాయింట్ల పతనం

**నిఫ్టీ ఖాతాలో 3521 పాయింట్ల గల్లంతు**

**14 శాతం మేర కరిగిపోయిన సూచీల విలువ**

- లక్షల కోట్లు నష్టపోయిన మదుపరులు
- కోలుకోవడానికి సుదీర్ఘ సమయం పట్టే అవకాశం




**బిజినెస్ డెస్క్ - సమయం న్యూస్:**

దేశీయ స్టాక్ మార్కెట్లు మునుపెన్నడూ లేని విధంగా ఒక చారిత్రక పతనాన్ని చవిచూస్తున్నాయి. గతంలో ఎవరూ ఊహించని రీతిలో ఆల్ టైమ్ హై రికార్డులను తాకిన సూచీలు, ఇప్పుడు అదే వేగంతో పాతాళానికి పడిపోతున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో బీఎస్ఈ సెన్సెక్స్ 86159 పాయింట్ల వద్ద చారిత్రక గరిష్టాన్ని నమోదు చేసింది. అప్పట్లో మార్కెట్ ఉత్సాహం చూసి సెన్సెక్స్ లక్ష పాయింట్లకు చేరుకుంటుందని విశ్లేషకులు అంచనా వేశారు. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా అదే సమయంలో 26340 పాయింట్ల ఆల్ టైమ్ హైని తాకింది. ఆ ఉత్సాహం ఎంతోకాలం నిలవలేదు. అక్కడి నుంచి మొదలైన పతనం ఏకధాటిగా కొనసాగుతూనే ఉంది. ప్రస్తుత గణాంకాలను పరిశీలిస్తే సెన్సెక్స్ తన జీవితకాల గరిష్ఠ స్థాయి నుంచి ఏకంగా 12576 పాయింట్లు పతనమై 73583 స్థాయికి పడిపోయింది. నిఫ్టీ సైతం తన అత్యున్నత స్థాయి నుంచి 3521 పాయింట్లు కోల్పోయి 22819 వద్ద ముగిసింది. శాతాల పరంగా చూస్తే రెండు సూచీలు తమ ఆల్ టైమ్ హై నుంచి దాదాపు 14 శాతానికి పైగా నష్టాలను మూటగట్టుకున్నాయి.

#### కరిగిపోయిన మార్కెట్ క్యాపిటలైజేషన్

ఈ పతనం వల్ల ఇన్వెస్టర్ల సంపద భారీగా ఆవిరైపోయింది. ఆల్ టైమ్ హై సమయంలో బీఎస్ఈలో నమోదైన మొత్తం కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రికార్డు స్థాయిలో ఉండేది. కొద్ది నెలల వ్యవధిలోనే అందులోంచి ఏకంగా 35 లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరైపోయింది. కేవలం నిన్న ఒక్కరోజే మార్కెట్ పతనంతో 9 లక్షల కోట్ల రూపాయలు గల్లంతయ్యాయి. రిటైల్ ఇన్వెస్టర్లు మొదలుకొని భారీ సంస్థాగత పెట్టుబడిదారుల వరకు అందరూ ఈ నష్టాల బారిన పడ్డారు. ముఖ్యంగా మ్యూచువల్ ఫండ్ల ద్వారా మార్కెట్లోకి వచ్చిన చిన్న మదుపరులు తమ పోర్ట్‌ఫోలియోలు ఎర్రబడటంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

#### కుదేలైన ప్రధాన రంగాలు

మార్కెట్ పతనంలో అన్ని రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నప్పటికీ, కొన్ని రంగాలు ఆల్ టైమ్ హై నుంచి అత్యధికంగా నష్టపోయాయి. ఐటీ రంగం తన గరిష్ఠ స్థాయి నుంచి 20 శాతం మేర పడిపోయింది. విదేశీ ఆర్డర్లు తగ్గడం, డాలర్ మారకం విలువలో ఒడిదుడుకులు ఐటీ కంపెనీల లాభాలపై తీవ్ర ప్రభావం చూపాయి. బ్యాంకింగ్ రంగం సైతం 18 శాతం వరకు కరెక్షన్‌కు గురైంది. ద్రవ్యోల్బణం పెరగడం, వడ్డీ రేట్ల తగ్గింపుపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. రియల్టీ, ఆటోమొబైల్ రంగాలు కూడా తమ గరిష్ఠ స్థాయిల నుంచి 15 శాతం మేర పడిపోయాయి. బ్లూచిప్ కంపెనీలైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్, ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లు సైతం తమ ఆల్ టైమ్ హై నుంచి 15 నుంచి 25 శాతం వరకు నష్టపోయాయి.

#### పతనానికి ప్రధాన కారణాలు

ఈ స్థాయిలో మార్కెట్లు పడిపోవడానికి అంతర్జాతీయంగా నెలకొన్న ప్రతికూల పరిస్థితులే ప్రధాన కారణం. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 109 డాలర్లు దాటాయి. ముడి చమురు ధరలు పెరిగితే భారతదేశ ఆర్థిక వ్యవస్థపై నేరుగా ప్రభావం పడుతుంది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐ) భారీ ఎత్తున తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. ఒకే రోజులో 10414 కోట్ల రూపాయల విలువైన షేర్లను వారు విక్రయించారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 94.82 స్థాయికి పడిపోవడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దారుణంగా దెబ్బతీసింది.

#### కోలుకునేందుకు సుదీర్ఘ సమయం

మార్కెట్లు తమ ఆల్ టైమ్ హై స్థాయిని మళ్లీ చేరుకోవడానికి చాలా సమయం పట్టే అవకాశం ఉందని ఆర్థిక విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులు చక్కబడకుండా మార్కెట్లలో సానుకూల వాతావరణం ఏర్పడదు. ద్రవ్యోల్బణం అదుపులోకి రావడం, ముడి చమురు ధరలు దిగిరావడం, భౌగోళిక ఉద్రిక్తతలు సద్దుమణగడం వంటి పరిణామాలు జరిగితేనే సూచీలు తిరిగి కోలుకుంటాయి. అప్పటివరకు ఈ ఒడిదుడుకులు కొనసాగే అవకాశం ఉంది. రాబోయే 2 లేదా 3 త్రైమాసికాల పాటు ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు కూడా మందగించే ప్రమాదం ఉంది. ఇన్వెస్టర్లు ఇప్పుడు ఆచితూచి అడుగువేయాలని, నాణ్యమైన వ్యాపార నమూనా ఉన్న కంపెనీల్లో మాత్రమే పెట్టుబడులు కొనసాగించాలని నిపుణులు సూచిస్తున్నారు.



## ఎక్సైజ్ కోత.. లాభం ఎవరికి?

### కేంద్రం తాజా నిర్ణయంతో చమురు సంస్థలకు ఊరట

- వినియోగదారులకు దక్కని ప్రయోజనం
- తగ్గిన భారాన్ని తమ ఖాతాలో వేసుకుంటున్న కంపెనీలు
- ధరల తగ్గింపు ఇప్పట్లో సాధ్యం కాదంటున్న నిపుణులు

**బిజినెస్ డెస్క్ - సమయం న్యూస్:**

కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ పై విధించే అదనపు ఎక్సైజ్ సుంకాన్ని ఇటీవల తగ్గించింది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరల్లో తీవ్రమైన ఒడిదుడుకులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో దేశీయంగా ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. అయితే ఈ సుంకం తగ్గింపు వల్ల నిజంగా లాభపడేది ఎవరు అనే దానిపై ఇప్పుడు సర్వత్రా చర్చ జరుగుతోంది. ప్రభుత్వం తన ఆదాయాన్ని వదులుకుని పన్ను భారాన్ని తగ్గించినప్పటికీ రిటైల్ మార్కెట్లో వాహనదారులకు ఆశించిన స్థాయిలో ప్రయోజనం చేకూరడం లేదు. దీని వెనుక చమురు మార్కెటింగ్ కంపెనీల ఆర్థిక వ్యూహాలు దాగి ఉన్నాయి.

#### కంపెనీలకు బదలాయిస్తే లాభమెంత?

ప్రభుత్వం తగ్గించిన పన్ను ప్రయోజనాన్ని పూర్తిగా చమురు మార్కెటింగ్ కంపెనీలకు బదలాయిస్తే వాటికి వేల కోట్ల రూపాయల మేర లాభం చేకూరుతుంది. గత కొద్ది నెలలుగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 90 డాలర్ల పైనే పలుకుతున్నా దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను ఆయా కంపెనీలు పెంచలేదు. దీనివల్ల లీటరుపై సుమారు 4 నుంచి 6 రూపాయల వరకు నష్టాలను భరించాయి. ఇప్పుడు కేంద్రం ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించడంతో, రిటైల్ ధరలను తగ్గించకుండా ఆ పన్ను రాయితీని తమ పాత నష్టాలను పూడ్చుకునేందుకు ఈ సంస్థలు వాడుకుంటున్నాయి. ఓఎంసీలు అనగా ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం లాంటి దిగ్గజ సంస్థల బ్యాలెన్స్ షీట్లు ఈ నిర్ణయంతో ఒక్కసారిగా లాభాల్లోకి మళ్లే అవకాశం ఉంది. పన్ను తగ్గింపు ద్వారా వచ్చే ప్రతి రూపాయి నేరుగా వారి నిర్వహణ లాభాల్లో కలుస్తుంది.

#### వినియోగదారులకు ఇస్తే.. ?

ఒకవేళ ఈ ఎక్సైజ్ పన్ను కోతను పూర్తిగా వినియోగదారులకే బదలాయించాలని ప్రభుత్వం, చమురు సంస్థలు నిర్ణయిస్తే పంప్ వద్ద ఇంధన ధరలు గణనీయంగా తగ్గుతాయి. కేంద్రం సగటున లీటరుకు 2 రూపాయల పన్ను తగ్గిస్తే అదే మొత్తంలో బంకుల్లో ధరలు కిందికి వస్తాయి. స్థానిక వ్యాట్‌తో కలుపుకుంటే ఈ తగ్గింపు ప్రభావం దాదాపు 2.50 రూపాయల వరకు ఉంటుంది. దీనివల్ల సామాన్యులకు రవాణా ఖర్చులు కలిసివస్తాయి. ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తుంది. నిత్యావసర వస్తువుల ధరలు స్థిరపడతాయి. లక్షలాది మంది వాహనదారులకు నెలవారీ బడ్జెట్లో ఊరట లభిస్తుంది. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో కంపెనీలు పాత నష్టాలను చూపిస్తున్నందున ఈ ప్రయోజనం నేరుగా సామాన్యుడికి చేరడం లేదు.

#### అసలు లాభపడేది ఎవరు?

తాజా పరిణామాలను నిశితంగా పరిశీలిస్తే ఈ ఎక్సైజ్ కోత వల్ల అంతిమంగా లాభపడేది చమురు సంస్థలే అని స్పష్టమవుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు పెరిగినప్పుడు సామాన్యులపై భారం పడకుండా ప్రభుత్వాలు కంపెనీలను ధరలు పెంచవద్దని ఆదేశిస్తాయి. ఆ సమయంలో అండర్ రికవరీల పేరుతో కంపెనీలు నష్టాలను నమోదు చేస్తాయి. ఆ తర్వాత ముడి చమురు ధరలు తగ్గినప్పుడో లేక ఇలా ప్రభుత్వం పన్నులు తగ్గించినప్పుడో ఆ లాభాన్ని తమ ఖాతాలో వేసుకుని నష్టాలను సరిచేసుకుంటాయి. అంటే ప్రభుత్వం తన పన్ను ఆదాయాన్ని కోల్పోతోంది, సామాన్యుడికి ధరలు తగ్గడం లేదు. మధ్యలో చమురు కంపెనీలు మాత్రమే తమ ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకుంటున్నాయి.

#### ముందున్న మార్గం

రాబోయే 6 నెలల పాటు చమురు కంపెనీలు ఇదే వ్యూహాన్ని అమలు చేసే అవకాశం ఉంది. తమ పాత నష్టాలన్నీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయి, బ్యాలెన్స్ షీట్లు తిరిగి అత్యధిక లాభాల్లోకి వచ్చాక మాత్రమే రిటైల్ మార్కెట్లో ధరల తగ్గింపు గురించి ఆలోచిస్తాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు 80 డాలర్ల దిగువకు స్థిరంగా పడిపోతే అప్పుడు వినియోగదారులకు లీటరుకు కనీసం 2 రూపాయల చొప్పున తగ్గింపు లభించే అవకాశం ఉంది. అప్పటివరకు ఈ పన్ను కోతల ప్రయోజనాలన్నీ నేరుగా ఓఎంసీల ఖజానాకే చేరుతాయి.

## బంగారం, వెండి బేజారు!

- ఆల్ టైమ్ హై నుంచి పాతాళానికి పసిడి
- భారీగా పతనమైన వెండి ధరలు
- లక్షల కోట్లు నష్టపోయిన మదుపరులు
- అంతర్జాతీయ పరిణామాలే ప్రధాన కారణం
- కోలుకోవడానికి పట్టొచ్చు సుదీర్ఘ సమయం



**బిజినెస్ డెస్క్ - సమయం న్యూస్:**

స్టాక్ మార్కెట్ల పతనం దెబ్బకు విలవిల్లాడుతున్న మదుపరులకు బులియన్ మార్కెట్ సైతం భారీ షాక్ ఇస్తోంది. సురక్షిత పెట్టుబడిగా భావించే బంగారం, వెండి ధరలు మునుపెన్నడూ లేని స్థాయిలో పతనమవుతున్నాయి. కొద్ది నెలల క్రితం వరకు ఎవరికీ అందనంత ఎత్తులో ఆల్ టైమ్ హై రికార్డులను నమోదు చేసిన పసిడి, వెండి ధరలు ఇప్పుడు అనూహ్యంగా నేలచూపులు చూస్తున్నాయి. ఈ భారీ కుదింపుతో బులియన్ మార్కెట్‌ను నమ్ముకున్న పెట్టుబడిదారులు లక్షల కోట్ల రూపాయల మేర నష్టాలను చవిచూడాల్సి వస్తోంది.

#### శిఖరాగ్రం నుంచి భారీ పతనం

గణాంకాలను పరిశీలిస్తే బంగారం, వెండి ధరల పతనం తీవ్రత అర్థమవుతుంది. ఈ ఏడాది ఆరంభంలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం 10 గ్రాముల ధర ఏకంగా 1,69,000 రూపాయల రికార్డు స్థాయికి చేరుకుంది. అదే సమయంలో కిలో వెండి ధర చరిత్రలోనే తొలిసారిగా 4,20,000 రూపాయల వద్ద ఆల్ టైమ్ హై నమోదు చేసింది. ఆ ఉత్సాహం ఎంతోకాలం నిలవలేదు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో 10 గ్రాముల బంగారం ధర సుమారు 25,000 రూపాయలు పతనమై 1,44,000 రూపాయల స్థాయికి పడిపోయింది. అటు వెండి సైతం కిలోపై ఏకంగా 1,80,000 రూపాయలకు పైగా కోల్పోయి 2,40,000 రూపాయల దరిదాపుల్లో ట్రేడ్ అవుతోంది. శాతాల పరంగా చూస్తే బంగారం 15 శాతం పడిపోగా, వెండి ఏకంగా 40 శాతానికి పైగా పతనమైంది.

#### పతనానికి ప్రధాన కారణాలు

ఈ భారీ పతనానికి అంతర్జాతీయ పరిణామాలే ప్రధాన కారణమని ఆర్థిక విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచే యోచనలో ఉందన్న వార్తలు డాలర్ విలువను బలపరిచాయి. డాలర్ బలపడిన ప్రతిసారీ బంగారం ధరలు పడిపోవడం సహజం. బాండ్ ఈల్డ్స్ ఆకర్షణీయంగా మారడంతో అంతర్జాతీయ సంస్థాగత పెట్టుబడిదారులు బులియన్ మార్కెట్ నుంచి తమ నిధులను వెనక్కి తీసుకుని బాండ్ల వైపు మళ్లిస్తున్నారు. పశ్చిమాసియాలో భౌగోళిక ఉద్రిక్తతలు నెమ్మదిగా సద్దుమణుగుతుండటంతో పెట్టుబడిదారుల్లో భయాలు తగ్గాయి. పరిశ్రమల నుంచి వెండికి డిమాండ్ ఒక్కసారిగా పడిపోవడం కూడా ఈ పతనానికి మరో కారణం.

#### మదుపరులకు లక్షల కోట్ల నష్టం

సాధారణంగా స్టాక్ మార్కెట్లు పతనమైనప్పుడు పెట్టుబడిదారులు బంగారాన్ని ఆశ్రయిస్తారు. ఈసారి రెండు మార్కెట్లు ఒకేసారి కుప్పకూలడం మదుపరులను తీవ్ర గందరగోళానికి గురిచేసింది. ఆల్ టైమ్ హై వద్ద బంగారం, వెండి కొనుగోలు చేసిన రిటైల్ ఇన్వెస్టర్లు, జువెలరీ వ్యాపారులు ఇప్పుడు భారీ నష్టాలను ఎదుర్కొంటున్నారు. ఈటీఎఫ్, సావరిన్ గోల్డ్ బాండ్ల ద్వారా పెట్టుబడులు పెట్టిన వారు సైతం తమ పోర్ట్‌ఫోలియోలు భారీ నష్టాల్లో ఉండటంతో ఆందోళన చెందుతున్నారు. దేశవ్యాప్తంగా బులియన్ మార్కెట్ విలువ పరంగా చూస్తే ఈ పతనం వల్ల ఇన్వెస్టర్లకు లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరైపోయింది.

#### ఆర్థిక వ్యవస్థపై పర్యవసనాలు

బంగారం ధరల పతనం సామాన్య కొనుగోలుదారులకు కొంత ఊరటనిచ్చినా, స్థూల ఆర్థిక వ్యవస్థపై మిశ్రమ ప్రభావం చూపుతుంది. దేశీయంగా పసిడి దిగుమతులు తగ్గితే కరెంట్ అకౌంట్ లోటు భారం తగ్గుతుంది. ఇప్పటికే అధిక ధరలకు నిల్వలు చేసుకున్న నగల వ్యాపారుల లాభాలు పడిపోయి, ఆ రంగంలో ఉపాధి అవకాశాలపై దెబ్బ పడుతుంది. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే బులియన్ మార్కెట్ ఇప్పట్లో కోలుకునే అవకాశాలు కనిపించడం లేదు. అంతర్జాతీయంగా డాలర్ ఇండెక్స్ బలహీనపడి, ద్రవ్యోల్బణం మళ్లీ పెరిగితే తప్ప పసిడికి పాత రోజులు రావు. పెట్టుబడిదారులు ప్రస్తుత పతనాన్ని కొనుగోలు అవకాశంగా మలచుకోవాలంటే, ఒకేసారి కాకుండా సిప్ విధానంలో కొద్దికొద్దిగా కొనుగోలు చేయడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు.